


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు

**ఆర్థికాభివృద్ధి కేంద్రంగా అమరావతి**

*2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్‌ప్లాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష*



5

# పట్టిసీమతో కృష్ణా డెల్టాకు సిరులు



2

- 2015 నుంచి 450 టీఎంసీల తరలింపు
- పోలవరం వంటి ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యంతో దేశద్రోహం
- గోల్డెన్ క్వాడ్రిలేటరల్ లాగే నదుల అనుసంధానం జరగాలి
- వంశధార నుంచి పెన్నా వరకూ రివర్ లింకేజ్ లక్ష్యం
- ఇబ్రహీంపట్నం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి
- కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా నివాళులు

పట్టిసీమ ప్రాజెక్టు వల్లే కృష్ణా డెల్టాలో రైతులు సిరులు పండించారని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 2015 నుంచి ఇప్పటివరకూ పట్టిసీమ ప్రాజెక్టు నుంచి 450 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించినట్టు వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి నదుల పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయి. నాడు పట్టి సీమ నిర్మిస్తుంటే కొందరు విమర్శించారు. వాటిని పట్టించుకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు చేసి పట్టిసీమ పూర్తి చేశాం. గోదావరి నుంచి కృష్ణా నదికి 450 టీఎంసీల వరద జలాలను తీసుకు వచ్చాం. పట్టిసీమకు చేసిన ఖర్చుతో కృష్ణా డెల్టా మొత్తం స్థిరీకరణ జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకి సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

## జల భగీరథం

13

### సంకల్పం నుంచి సాకారం దాకా..

*గోదావరి పరవళ్లు ఏటా సముద్రం పాలవుతుంటే.. సీమ నేలలు చుక్కనీటి కోసం తపించే వైరుధ్యానికి తెరదించే మహాసంకల్పం మరోసారి ఊపందుకుంది. కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. రెండేళ్లలో సాగునీటి రంగంపై రూ.24 వేల కోట్లు వెచ్చించామని, మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించడాన్ని సాధారణ అంశంగా చూడకూడదు. మార్చి 2027నాటికి పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామన్న గడువుతోపాటు.. నదుల అనుసంధానంతో రాష్ట్రానికి కరవే ఉండదన్న భరోసానూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారు. పట్టిసీమతో దేశంలోనే తొలి అనుసంధాన ప్రయోగాన్ని విజయవంతం చేసిన అనుభవం.. నేడు గోదావరి-బనకచర్ల మహా ప్రణాళికగా విస్తరిస్తోంది. ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి, సెప్టెంబరు 1న వెలిగొండ జాతికి అంకితం.. ఇలా గడువులతో సాగుతున్న జలయజ్ఞం వెనుక ఉన్న సంకల్పం, ప్రస్థానంతో ప్రజలూ అనుసంధానం కావాల్సిన తరుణమిది!*





ఏపీపై విశ్వాసానికి నిదర్శనం

## దాల్మియా ప్లాంట్ విస్తరణ

- పారిశ్రామిక ప్రగతిలో విలువైన భాగస్వామ్యం
- పరిశ్రమలకు యువతను సిద్ధం చేస్తున్నాం
- నైపుణ్యాభివృద్ధిలో సహకారం అందించండి
- దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్ విస్తరణకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్

6

## సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ జగన్‌రెడ్డి

- రాయలసీమ అభివృద్ధికి ఆయన చేసింది శూన్యం
- బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో వేలకోట్లు దోచుకున్నారు
- ఐదేళ్లలో ఒక్క పరిశ్రమ తేలేదు.. ఒక్క ఉద్యోగం లేదు
- 250 మంది మత్స్యకారులు చనిపోతే రూపాయి ఇవ్వలేదు
- దాల్మియా సిమెంట్స్‌ను బెదిరించి ఇబ్బందులూ పెట్టారు
- రికార్డు స్థాయిలో పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొస్తున్నాం
- దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్

8 9



## మరోసారి విద్యుత్ ఛార్జీల తగ్గింపు

విద్యుత్ ఛార్జీల తగ్గింపుపై కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రెండో ఏడాది 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ట్రూడౌన్ అమలు చేయనున్నట్లు ప్రకటించింది. ఏపీ విద్యుత్ రంగంలో మును పెన్నడూ లేని విధంగా వినియోగదారులకు వరుసగా రెండో ఏడాది కూడా భారీ ఊరట లభించనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏకంగా రూ.940.07 కోట్లను తగ్గించాలని డిస్కంలు నిర్ణయించాయి. ఏపీఈఆర్‌సీ తుది ఆమోదం విద్యుత్ ఛార్జీలు తగ్గనున్నాయి.

12



4


## యూఎన్ హ్యాబిటాట్‌తో సమ్మిళిత పట్టణాభివృద్ధిపై కీలక ఒప్పందం

**పేదరిక నిర్మూలనకు ఎంఓయూ చారిత్రాత్మకం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**

రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఏపీ ప్రభుత్వం-ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలకమైన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం చారిత్రాత్మకమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.





# పట్టిసీమ వల్లే కృష్ణా డెల్టాకు సిరులు

- 2015 నుంచి ఇప్పటివరకూ 450 టీఎంసీల తరలింపు
- పోలవరం వంటి ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యం దేశద్రోహం
- గోల్డెన్ క్వాడ్రిలేటరల్ లాగే నదుల అనుసంధానం జరగాలి
- వంశధార నుంచి పెన్నా వరకూ రివర్ లింకేజి లక్ష్యం
- ఇబ్రహీంపట్నం బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు జలహారతి
- కేఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని నివాళులు





అమరావతి (చైతన్యరథం): పట్టిసీమ ప్రాజెక్టు వల్లే కృష్ణా డెల్టాలో రైతులు సిరులు పండించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2015 నుంచి ఇప్పటివరకూ పట్టి సీమ ప్రాజెక్టు నుంచి 450 టీఎంసీల గోదావరి వరద జలాలను తరలించినట్టు వెల్లడించారు. రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టి సీమ డెల్టాతో పాటు రాష్ట్రంలో విలువైన సంపద సృష్టికి కారణమైం దని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి నదుల పవిత్ర సంగమం వద్ద గోదావరి జలాలకు ముఖ్యమంత్రి జల హారతి ఇచ్చారు. సంప్రదాయ పంచె కట్టులో వచ్చిన ముఖ్యమంత్రి కృష్ణా-గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు-కుంకుమలు సమర్పించారు. అనంతరం ప్రముఖ ఇంజనీరు కేఎల్ రావు 124వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బహిరంగసభలో మాట్లాడుతూ సాగునీటి రంగానికి సేవలు అందించిన కేఎల్ రావుగారి 124 జయంతిని పురస్కరించుకుని ఇంజనీరుగా స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ఆయన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుంది. పట్టి సీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయి. ఏడాదిలో పట్టి సీమ పూర్తి చేసి కృష్ణాడెల్టాను కాపాడిన ఘనత తెలుగుదేశం పార్టీది. 80 టీఎంసీలతో కృష్ణా డెల్టాలోని 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం. నాకు ఎక్కడ పేరు వస్తుందో అని నాడు పట్టి సీమ నిర్మిస్తుంటే కొందరు విమర్శించారు. పట్టి సీమ, ఒట్టిసీమ అన్నారు. విమర్శలు పట్టించుకుని ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేస్తే కృష్ణా డెల్టా ఏమయ్యేదో..విమర్శలు పట్టించుకోకుండా రూ.1300 కోట్లు ఖర్చు చేసి పట్టి సీమ పూర్తి చేశాం. గోదావరి నుంచి కృష్ణా నదికి 450 టీఎంసీల వరద జలాలను తీసుకువచ్చాం. పట్టి సీమకు చేసిన ఖర్చుతో కృష్ణా డెల్టా మొత్తం స్థిరీకరణ జరిగింది. ఎకరాకు రూ.1200 ఖర్చు అవుతోంది. వనరులు వృధా కాకుండా రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతోనే పనిచేస్తున్నాం. వచ్చే వరద జలాల ను సముద్రానికి వదిలేసి ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చు కోవటం తెలివైన పని అనిపించుకోదు. పట్టిసీమ నీటితో కృష్ణా డెల్టాలో రైతులు బంగారం పండిస్తున్నారు. పోలవరం కుడి కాలువ నుంచి నీటి తరలింపు కారణంగానే శ్రీశైలంలో కృష్ణా నీటిని పొదుపు చేసి రాయలసీమకు నీరందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతీ ఎకరాకి సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు.

## ప్రాజెక్టులపై గత పాలకుల నిర్లక్ష్యం


2014-19 మధ్య రూ.68 వేల కోట్లు సాగునీటి రంగానికి ఖర్చు చేశాం. 2024 నుంచి రెండేళ్లలో రూ.24 వేల కోట్లు ఖర్చు పెట్టాం. గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకు పోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల మరమ్మతులకు పైసా ఇవ్వలేదు, గ్రీజు కూడా పూయలేదు. తుంగభద్ర డ్యామ్ కు కొత్త గేట్లను ఏర్పాటు చేయించాం. నిన్న ధవళేశ్వరం బ్యారేజికి కూడా రూ.152 కోట్లతో కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం. 2014-19లో పోలవరం ప్రాజెక్టులో 72 శాతం పనులు పూర్తి చేశాం. గడచిన రెండేళ్లలో ప్రాజెక్టును 89 శాతం మేర పూర్తి చేశాం. కానీ 2019-24 మధ్య కనీసం 2 శాతం కూడా పనులు చేయలేదు. పూర్తి నిర్లక్ష్యంతో డయాఫ్రమ్ వాల్ కూడా కొట్టుకుపోయేలా చేశారు. అతి ముఖ్యమైన ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం చేయటం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం. ప్రాజెక్టులను గాలికి వదిలేసిన గత పాల కులు రాష్ట్ర రైతులకు ద్రోహం చేశారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారు. ప్రతిపక్షంలోని

(తరువాయి 3లో..)





# పట్టిసీమ వల్లే కృష్ణా డెల్టాకు సిరులు



(2వ పేజీ తరువాయి.. )

కొందరు రైతులను రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

## సాగునీటికి ఎక్కువ నిధులు

వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులు అనుసంధా నం జరగాలన్నదే నా ఆకాంక్ష. గోల్డెన్ క్వాడ్రిలేటరల్ తరహాలో నదులు అనుసంధానమైతే భారత్ దేశానికి తిరుగు ఉండదు. సముద్రంలోకి వెళ్లే నీటిని సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తే పెద్ద ఎత్తున సంపద సృష్టి జరుగుతుంది. ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో పూర్తి చేస్తాం.ఈ ఏడాది జూన్‌లో తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్త గేట్లు ఏర్పాటు చేసి ప్రారంభించాం. కాటన్ బ్యారేజికి కూడా కొత్త గేట్ల పనులు ప్రారంభించాం. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తి అవుతా యి. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులకు కూడా ఈ నెలలోనే శంకుస్థాపన చేసి రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తి అయ్యింది. ఆగస్టు 14 తేదీన గోదావరి జలా లకు అనకాపల్లి వద్ద స్వాగతం పలుకుతాం. వెలిగొండ ప్రాజెక్టు మొదటిదశను 2026 సెప్టెంబరు 1 తేదీన జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టులో రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నా గత పాలకులు ప్రాజెక్టు ప్రారంభించామని నాటకాలు ఆడారు. సొరంగంలో టన్నెల్ బోరింగ్ యంత్రం ఇరుక్కుపోయి ఉన్నా జాతికి అంకితం చేశారు. గత పాలకులు చేసిన మోసాన్ని కూడా ప్రజలకు చెబుతాం. రాష్ట్రంలో కురిసే ప్రతీ వర్షపు చుక్క నూ భూగర్భ జలంగా మార్చుకోవాల్సి ఉంది. జలధార కింద ఈ పనులు పెద్దఎత్తున చేపట్టాం. రాష్ట్ర భవిష్యత్తుకు విరోధంగా పనిచేసే వారి పట్ల మనం అంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## సాగునీటి రంగంలో కేఎల్ రావుది ఎనలేని కృషి

శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారు. ఐక్యరాజ్య సమితి తరపున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారు. విజయవాడలో జన్మించి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్ర మంత్రిగా పనిచేశారు. నీటి పారుదల రంగం, జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావు తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా నాకు ఎంతో స్ఫూర్తి. జలధార కార్యక్రమంతో భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్ సహా ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## వచ్చే మూడేళ్లలో ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసే 36 సాగునీటి ప్రాజెక్టులు

1 తుంగభద్ర కొత్త గేట్లు 25-06-2026 ప్రారంభోత్సవం పూర్తి
2 కాటన్ బ్యారేజ్ గేట్లు 13-07-2026 శంకుస్థాపన పూర్తి
3. గుంటూరు ఛానల్ ఆధునీకరణ 31-07-2026 శంకుస్థాపన
4. పోలవరం ఎడమ ప్రధాన కాలువ 14-08-2026 ప్రారంభోత్సవం
5. పెరూరు బ్రాంచ్ కెనాల్ - ప్యాకేజీ 36ఈూ 04-08-2026 శంకుస్థాపన
6. వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్ - 1 01-09-2026 ప్రారంభోత్సవం
7. పాలేరు రిజర్వాయర్ 10-09-2026 శంకుస్థాపన
8a. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 (400-490 కి.మీ) 31-10-2026 ప్రారంభోత్సవం
b. హెచ్.ఎన్.ఎస్.ఎస్. ఫేజ్-2 (490-554 కి.మీ, అడవిపల్లి వరకు) 30-06-2027 ప్రారంభోత్సవం
9. నెరడి బ్యారేజ్ 30-11-2026 శంకుస్థాపన
10. పెన్నా-సర్వేపల్లి రిజర్వాయర్ 31-12-2026 ప్రారంభోత్సవం
11. మడ్డువలస స్టేజ్-2 31-01-2027 ప్రారంభోత్సవం
12. జంఝావతి రిజర్వాయర్ ప్రాజెక్ట్ 31-01-2027 ప్రారంభోత్సవం
13. పోలవరం సాగునీటి ప్రాజెక్ట్ 31-03-2027 ప్రారంభోత్సవం
14. హీరమండలం ఎత్తిపోతల పథకం 30-04-2027 ప్రారంభోత్సవం
15. నీవా బ్రాంచ్ కెనాల్ (నీవా నది వరకు) 30-06-2027 ప్రారంభోత్సవం
16. నాగావళి - చంపావతి నదుల అనుసంధానం 30-06-2027 ప్రారంభోత్సవం
17a. బుడమేరు (ఎనికేపాడు యూటీ) 30-06-2027 ప్రారంభోత్సవం
17b. బుడమేరు డైవర్షన్ ఛానల్ (బి.డి.సి) 30-06-2027 ప్రారంభోత్సవం
18. ముక్త్యాల ఎత్తిపోతల పథకం 30-06-2027 ప్రారంభోత్సవం
19. వంశధార ఫేజ్-2, స్టేజ్-2 01-07-2027 ప్రారంభోత్సవం
20. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-1 31-07-2027 ప్రారంభోత్సవం
21. మహేంద్రతనయ ఆఫ్-షోర్ రిజర్వాయర్ 15-07-2027 ప్రారంభోత్సవం
22. గజపతినగరం బ్రాంచ్ కెనాల్ 31-07-2027 ప్రారంభోత్సవం
23. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్ట్ 20-07-2027 ప్రారంభోత్సవం
24. a అల్లూరుపాడు ఎత్తిపోతల 30-09-2027 ప్రారంభోత్సవం
b అల్లూరుపాడు రిజర్వాయర్ 30-09-2027 ప్రారంభోత్సవం
c అల్లూరుపాడు నుండి మెర్లపాక వరకు ఎస్.ఎస్.ఎల్.సి 30-09-2027 ప్రారంభోత్సవం
d మల్లెమడుగు ఎత్తిపోతల 30-09-2027 ప్రారంభోత్సవం
e మల్లెమడుగు రిజర్వాయర్ 31-12-2027 ప్రారంభోత్సవం
f బాలాజీ రిజర్వాయర్ 31-03-2028 ప్రారంభోత్సవం
25. కళ్యాణి డ్యామ్ కోసం ములపల్లి ఎత్తిపోతల పథకం 15-12-2027 ప్రారంభోత్సవం
26. మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ 31-12-2027 ప్రారంభోత్సవం
27. తారక రామ తీర్థసాగరం ప్రాజెక్ట్ 30-12-2027 ప్రారంభోత్సవం
28. వేదవతి ఎత్తిపోతల పథకం 30-06-2028 ప్రారంభోత్సవం
29. భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం 30-06-2028 ప్రారంభోత్సవం
30. అప్పర్ పెన్నా ప్రాజెక్ట్ 30-06-2028 ప్రారంభోత్సవం
31. కడప నగరం వరకు జీఎన్‌ఎస్‌ఎస్ 30-06-2028 ప్రారంభోత్సవం





32. గోదావరి డెల్టా వ్యవస్థ ఆధునీకరణ 30-06-2028 ప్రారంభోత్సవం
33. వరికుడిసేల ప్రాజెక్ట్ 15-12-2028 ప్రారంభోత్సవం
34. ఎస్.ఆర్.ఎం.సి మరియు ఎస్.ఆర్.బి.సి అప్‌గ్రేడేషన్ 31-12-2028 ప్రారంభోత్సవం
35. జి.ఎన్.ఎస్.ఎస్ కడప నుండి కొడూరు వరకు 31-12-2028 ప్రారంభోత్సవం
36. జి.ఎన్.ఎస్.ఎస్ కొడూరు - మల్లెమడుగు - బాలాజీ రిజర్వాయర్ 31-12-2028 ప్రారంభోత్సవం



# యూఎన్ హ్యాబిటాట్‌తో

# సమ్మిళిత పట్టణాభివృద్ధిపై కీలక ఒప్పందం

- పేదరిక నిర్మూలనకు ఎంవోయూ చారిత్రాత్మకం
- అమరావతిలో గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలు
- తానే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తా
- రాజధానిని గ్రీన్‌ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దుతున్నాం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో సమ్మిళిత పట్టణాభివృద్ధిని ప్రోత్సహించేలా ఏపీ ప్రభుత్వం-ఐక్యరాజ్య సమితికి చెందిన యూఎన్ హ్యాబిటాట్ మధ్య కీలకమైన అవగాహనా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్‌ల సమక్షంలో ఈ వ్యూహాత్మక ఒప్పందాన్ని ఏపీ పురపాలక శాఖ-యూఎన్ హ్యాబి టాట్ సంస్థలు కుదుర్చుకున్నాయి. ఆమె సింగపూర్ నుంచి వర్చువల్‌గా ఈ ఎంఓయూ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ విధానాల్లో భాగంగా అమరావతిలో పట్టణ వ్యవహారాలపై ఓ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేయ డంతో పాటు పేదరిక నిర్మూలన, పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచటం వంటి అంశాలను చేపట్టేలా ఈ ఒప్పందం చేసుకున్నారు. ప్రాంతీయ ఆర్థిక వృద్ధి కోసం వ్యూహాత్మక పట్టణ ప్రణాళిక, వాతావరణ మార్పులను తట్టుకునేలా సుస్థిర పర్యా వరణ వ్యవస్థల నిర్మాణం, డిజిటల్ గవర్నెన్స్, మున్సిపల్ ఫైనాన్స్ తో పాటు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఏపీ ప్రభుత్వం- యూఎన్ హ్యాబిటాట్‌తో కలిసి పనిచేయనుంది. దీంతో పాటు 2028లో మెక్సికోలో జరుగనున్న 14వ వరల్డ్ అర్బన్ ఫోరమ్ సదస్సులో ఏపీ విజయాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని నిర్ణయించారు.

### పేదరిక నిర్మూలనలో ఒప్పందం చారిత్రాత్మకం

అమరావతి రాజధాని నిర్మాణంలో ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్య మంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. సర్జ్ ఏపీ, రైజ్ ఏపీ, అప్ లిఫ్ట్ ఏపీ సహా పట్టణ పేదరిక నిర్మూలనపై యూఎన్ హ్యాబి టాట్‌తో కుదుర్చుకున్న ఒప్పందం చారిత్రాత్మకం అవుతుందని పేర్కొన్నారు. జీరో పావర్టీపై ఓ రోడ్‌మ్యాప్ నిర్దేశించుకుని ఏపీ ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని యూఎన్ హ్యాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వివరించారు. అర్బన్ ప్లానింగ్ సహా ఆర్థికాభివృద్ధిపై మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా ఎప్పటి కప్పుడు సమీక్ష చేసుకుంటున్నట్టు తెలిపారు. బయోడైవర్సిటీని సంరక్షించేలా గ్రీన్ ఎనర్జీ విద్యుత్ ఉత్పత్తి కోసం పెద్దఎత్తున చర్యలు చేపట్టామన్నారు. అర్బన్ ప్లానింగ్, లివబిలిటి, డిజిటల్ గవర్నెన్స్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉందని వివరించారు. డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. బెస్ట్ ప్రాక్టీసె స్ బ్రాండ్ అంబాసిడర్‌గా తాను వ్యవహరిస్తానని చెప్పారు. మరో వైపు రాజధాని



అమరావతి నిర్మాణం సీఎం చంద్రబాబు విజన్‌కు ప్రతిరూపంగా ఉందని, ఏపీ-యూఎన్ హ్యాబిటాట్ మధ్య కుదిరిన ఒప్పందం చారిత్రాత్మకమని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనక్లాడియా రోస్బాక్ వ్యాఖ్యానించారు. వ్యర్థాల నిర్వహ ణ, వాయు కాలుష్య నియంత్రణ, బహిరంగ ప్రదేశాల అభివృద్ధి తదితర అంశాలపై ఏపీతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. 2036 నాటికి పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సమూల మార్పులు వచ్చేలా ఒప్పందం సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.









### ఎమ్మెల్యే పుట్టాకు లోకేష్ పరామర్శ

ప్రొద్దుటూరు(చైతన్యరథం): కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, వారి కుటుంబసభ్యులను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. పుట్టా సుధాకర్ యాదవ్ మాతృమూర్తి పుట్టా పోలమ్మ ఇటీవల మరణించింది. దాంతో మంత్రి లోకేష్ ప్రొద్దుటూరులోని వారి నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. పుట్టా పోలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చైతన్యరథం



# ఆర్థికాభివృద్ధి కేంద్రంగా అమరావతి

**ప్రపంచస్థాయి నగరానికి ప్రణాళిక - 2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్‌ప్లాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి నివసించేలా రాజధాని అమరావతికి ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అమ రావతి ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ఆర్థికాభివృద్ధికి కేంద్ర బిందువుగా నిలిచే ప్రపంచస్థాయి నగరంగా అమరావతి-2.0 ఇంటిగ్రేటెడ్ మాస్టర్ ప్లాన్, ల్యాండ్ పూలింగ్ స్కీమ్ (ఎల్‌పీఎస్-2) రూపకల్పన పనుల పురోగతిపై అధికారులు, సింగపూర్ ప్రతినిధులతో సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా సింగపూర్ ప్రతినిధులు ప్రాజెక్టు పరిధి, అమలు ప్రణాళిక, దశలవారీ కార్యాచరణను సీఎంకు వివరించారు. ఏరియా ప్లాన్, మౌలికవసతుల ప్రణాళిక, పెట్టుబడి నమూనా వంటి అంశాలను ప్రాజెక్టులో భాగం చేస్తున్నట్టు తెలిపా రు. ఉద్యోగాలు కల్పించేలా అమరావతి ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలని సీఎం సూచించారు.

ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లతో అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మిస్తున్నామని.. ఎల్‌నినోతో సమస్య తలెత్తినా పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణా నదికి తీసుకురావడంతో రాజధాని ప్రాంతం జల వనరులతో కళకళలాడుతోందని చెప్పారు. అమరావతిని ఆర్థికంగా బలోపేతం చేసేలా క్రియేటివ్ సిటీ నిర్మాణం చేయాల్సి ఉందన్నారు.

గ్లోబల్ బెంచ్ మార్కింగ్ చేరుకోవడం, అత్యధిక తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు వివరించారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ బిల్డింగ్ విధానంతో పర్యావరణ అనుకూల విధానాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు.

ఈ సమీక్షలో మంత్రి పి.నారాయణ, పురపాలక, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శులు సురేష్ కుమార్, పీయూష్‌కుమార్ సహా ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కరమలవారిపల్లిలో లోకేష్ ప్రజాదర్బార్

**ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరణ**

జమ్మలమడుగు (చైతన్యరథం): కడప జిల్లా మైలవరం మండలం కరమలవారిపల్లిలో మంత్రి నారా లోకేష్ 91వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. తనను కలిసేందుకు వచ్చిన ప్రజలను ఆప్యా యంగా పలకరించి వారి నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖకు కేటాయించిన పోస్టుల లో ఖాళీగా ఉన్న 520 డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ఏఈ పోస్టులను మండల ఇన్‌చార్జ్‌లతో భర్తీ చేయాలని హౌసింగ్ ఏఈ, ఎంఐసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల పరిధిలోని అర్బన్ లోకల్ బాడీస్ నుంచి గత మూడు సంవత్సరాల లైబ్రరీ సెస్ మొత్తాన్ని జమచేయడం, ఆలస్యం అయిన సెస్‌పై సర్వీస్ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర, జిల్లా గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కోరారు. కడప పట్టణంలోని జవహర్ బాల భవన్‌లో పనిచేస్తున్న సిబ్బందికి టైమ్ స్కేల్ కల్పించాలని బాలభవన్ పర్యవేక్షకురాలు జి.సునీత కోరారు. ఆయా వినతులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.











చైతన్యరథం

# ఏపీపై విశ్వాసానికి దాల్మియా ప్లాంట్ విస్తరణ నిదర్శనం

- పారిశ్రామిక ప్రగతిలో విలువైన భాగస్వామ్యం
- పరిశ్రమలకు యువతను సిద్ధం చేస్తున్నాం
- నైపుణ్యాభివృద్ధిలో సహకారం అందించండి
- దాల్మియా సిమెంట్ విస్తరణ పనులకు
- శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేష్



జమ్మలమడుగు (చైతన్యరథం): ఏపీపై విశ్వాసానికి దాల్మియా భారత్ సిమెంట్ ప్లాంట్ విస్తరణ నిదర్శనం.. ఏపీ పారిశ్రామిక ప్రగతిలో దాల్మియా భారత్‌ది విలువైన భాగస్వామ్యం అని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజక వర్గం మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు లోకేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ దాల్మియా సిమెంట్స్ కడప ప్లాంట్ లైన్-2 విస్తర ణకు సంబంధించిన భూమిపూజ కార్యక్రమంలో మీ అందరితో కలిసి పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజు కేవలం ఒక తయారీ యూనిట్ విస్తరణ గురించి మాత్రమే కాదు.. విశ్వా సాన్ని మరింత విస్తరించే రోజు. వ్యాపారంలో మొదటి పెట్టుబడి అవకాశాలపై నమ్మకంతో వస్తుంది. రెండో పెట్టుబడి అనుభవంపై నమ్మకంతో వస్తుంది. ఇప్పటికే ఉన్న ఒక సంస్థ తన కార్యకలా పాలను విస్తరించాలని నిర్ణయించినప్పుడు అది గట్టి సందేశాన్ని ఇస్తుంది. రాష్ట్రంపై విశ్వాసం, పాలనపై విశ్వాసం, భవిష్యత్తుపై విశ్వాసం. ఈ రోజు దాల్మియా భారత్ చేపడుతున్న విస్తరణ కూడా అలాంటి విశ్వాసానికే నిదర్శనం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తంపున రాష్ట్రంపై తమ నమ్మకాన్ని మరింత బలోపేతం చేసిన దాల్మియా భారత్ కుటుంబసభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## పునీత్ దాల్మియా జీవితం ఎంతో స్ఫూర్తిదాయకం

పునీత్ జీ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకం. ఆయన ఐఐటీ ఢిల్లీ నుంచి ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఐఐఎం బెంగళూరు నుంచి గోల్డ్ మెడల్ సాధించారు. నేడు దేశంలోని అత్యంత గౌరవనీయ పారిశ్రామికవేత్తల్లో ఒకరిగా నిలిచారు. అయితే నన్ను మరింతగా ప్రేరేపించేది ఏమిటంటే భారతదేశంలోని తొలి డిజిటల్ స్టార్టప్‌లలో ఒకటైన JobsAhead.com సహస్థాప కులుగా వ్యవహరించడం. వారు కేవలం ఒక వారసత్వాన్ని స్వీక రించలేదు. దానికి నాయకత్వం వహించే ముందు వారి కంటూ ఒక ప్రత్యేక గుర్తింపును నిర్మించుకున్నారు. అదే ఔత్సాహిక పారిశ్రామిక స్ఫూర్తి ఈ రోజుకీ దాల్మియా భారత్‌ను ముందుకు నడిపిస్తోంది.

## మానవవనరులే దేశానికి విలువైన సంపద

ఆంధ్రప్రదేశ్ మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా మీ నాయకత్వంలోని ఒక అంశంతో ప్రత్యేక అనుబంధం ఉంది. మీరు భారతదేశంలోని అతిపెద్ద పారిశ్రామిక సంస్థల్లో ఒక దానికి నాయకత్వం వహిస్తున్నప్పటికీ విద్యాభివృద్ధికి, విద్యాసంస్థల నిర్మాణానికి నిరంతరం అండగా నిలుస్తున్నారు. అశోక విశ్వ విద్యాలయంతో మీ అనుబంధం... భారతదేశానికి అత్యంత విలువైన సంపద సిమెంట్, ఉక్కు కాదు, మానవ వనరులేనని మీరు విశ్వసిస్తున్నారనే విషయాన్ని ప్రతిబింబిస్తోంది. అదే తత్వాన్ని మేం కూడా బలంగా విశ్వసిస్తున్నాం. ప్రభుత్వాలు ప్రతిభను తీర్చిదిద్దుతాయి. పరిశ్రమలు అవకాశాలను సృష్టిస్తాయి. రెండూ కలిసి భవిష్యత్తును నిర్మిస్తాయి.



## పారిశ్రామిక ప్రగతిలో విలువైన భాగస్వామ్యం

దాల్మియా భారత్ అనేక ఏళ్లుగా ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో భాగస్వామిగా ఉంది. ఈ రోజు జరుగుతున్న విస్తరణ మన భాగ స్వామ్యానికి ఆరంభం కాదు.. ఇది పరస్పర విశ్వాసంతో కొనసా గుతున్న బంధానికి తదుపరి అధ్యాయం. రూ.3,100 కోట్ల ఈ విస్తరణ ఏపీ పట్ల దాల్మియా భారత్‌కు ఉన్న దీర్ఘకాలిక నిబద్ధతకు నిదర్శనం. అలాగే ఈ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుంది. సస్టైనబులిటీ, గ్రీన్ మ్యానుఫ్యాక్చరింగ్, రెన్యూవ బుల్ ఎనర్జీ, రెస్పాన్సిబుల్ గ్రోత్..ఇవన్నీ మేం ఎంతో విలువైన విగా భావించే సూత్రాలు.



## స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ ఏపీ బలం

ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు నిర్ణయాల్లో వేగం, విధానాల్లో స్థిరత్వం, పాలనలో సేవాభావాన్ని కోరుకుంటున్నారు. గౌరవ సీఎం చంద్రబాబు దూరదృష్టి నాయకత్వంలో ఏపీ ఈ మూడు సూత్రాల ఆధారంగా పెట్టుబడులకు అనుకూలమైన పటిష్టమైన వ్యవస్థను నిర్మిస్తోంది. అందుకే ఇప్పటికే ఉన్న పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను విస్తరిస్తున్నారు. కొత్త పెట్టుబడిదారులు కూడా ఏపీని తమ గమ్యస్థానంగా ఎంచుకుంటున్నారు.

## సుస్థిరతే అభివృద్ధికి అతిపెద్ద ప్రేరణ

ప్రపంచ దేశాలు పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వైపు అడుగులు వేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి అవస రమైన మౌలికవసతులను నిర్మిస్తున్న కొద్దీ.. ఉక్కు, సిమెంట్, ఇంధనం, రవాణా వంటి రంగాలపై ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ మరింత పెరుగుతుంది.

## అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మియా ఒకటి

కర్బన్ ఉద్గారాలను తగ్గించడం అత్యంత క్లిష్టమైన పరిశ్రమల్లో సిమెంట్ రంగం అత్యంత సవాలుతో కూడుకున్నది. ప్రపంచంలో అత్యల్ప కర్బన ఉద్గారాలున్న సిమెంట్ తయారీ సంస్థల్లో దాల్మి యా ఒకటి. 2040 నాటికి కార్బన్ న్యూట్రల్ సంస్థగా మారాలని సంకల్పించింది. పునరుత్పాదక ఇంధనం, ఇంధన సామర్థ్యం, విద్యుత్ ఆధారిత రవాణాలో తన నాయకత్వాన్ని చాటుతూ.. ప్రపంచంలోనే RE100, EP100, EV100 కార్యక్రమాల్లో సభ్యత్వం పొందిన తొలి సిమెంట్ సంస్థగా కూడా దాల్మియా భారత్ నిలిచింది. కడప ప్లాంట్ విస్తరణ కూడా ఈ విషయాన్ని

(తరువాయి 7లో..)




# ఏపీపై విశ్వాసానికి దాల్మియా ప్లాంట్ విస్తరణ నిదర్శనం

(6వ పేజీ తరువాయి.. )

ప్రతిబింబిస్తోంది. కార్యకలాపాల్లో 80 శాతం వరకు రెన్యూవబుల్ ఎనర్జీ, వేస్ట్ హీట్ రికవరీ, మున్సిపల్ వ్యర్థాల కో ప్రాసెసింగ్, జీరో లిక్విడ్ డిశ్చార్జ్, విస్తృత స్థాయిలో వర్షపు నీటి సంరక్షణ, విద్యుత్ వాహనాల ఆధారిత లాజిస్టిక్స్, ఏఐ ఆధారిత కార్యాచరణ సామర్థ్యం, అత్యుత్తమ ఉద్గార నియంత్రణ వ్యవస్థలు వంటి అంశాలతో ఈ ప్లాంట్ భవిష్యత్తుకు సిద్ధమైన తయారీకి ఆదర్శంగా నిలుస్తోంది. ఇలాంటి పరిశ్రమలతో భాగస్వామ్యం వహించడం ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో గర్వకారణం.

### కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు

జమ్మలమడుగు ఎప్పుడొచ్చినా జోష్ అదిరిపోతుంది. కడప జిల్లా ప్రజలు అనగానే నాకు గుర్తొచ్చేది కష్టం. కష్టాన్ని నమ్ముకున్న వాళ్లు కడప జిల్లా ప్రజలు. ఎవరి నుంచి సహాయం ఆశించరు. ఇక్కడి కార్మికులు, రైతులు ఆంధ్రప్రదేశ్‌కి బ్రాండ్ అంబాసిడర్లు. ఇక్కడ రైతులు పిల్లల భవిష్యత్ కోసం భూములు త్యాగం చేశారు. మీ పిల్లలు కంపెనీలో కష్టపడి పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారు. మేం అనుమతులు ఇవ్వగలం కానీ కంపెనీకి నమ్మకం మీ వల్లనే వస్తుంది. మీరు ఆ నమ్మకాన్ని ఇచ్చారు.

### పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి

మన గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు, మన పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, నేను అన్ని దేశాలు తిరుగుతూ ఏపీని ప్రమోట్ చేస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని అడుగుతున్నాం. నేను యువగళం పాదయాత్రలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చా. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం కోసం కష్టపడుతు న్నాం. రెండేళ్లలోనే అనేక పెద్ద కంపెనీలు ఏపీకి తీసుకువచ్చాం. దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయి. కొత్త కంపెనీలు తీసుకురావడం ఎంత ముఖ్యమో.. రాష్ట్రంలో ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన కంపెనీలు కూడా మనకి అంతే ముఖ్యం. నేను కొత్త వాళ్లను కన్విన్స్ చేయడంతో పాటు మనదగ్గర ఉన్న కంపెనీలతో ఎక్స్ పాన్షన్ చేయించాలి. అప్పుడే మనం సక్సెస్ అవుతాం.

### పెట్టుబడిదారులకు భరోసా కల్పిస్తున్నాం

మన రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన వాళ్లకి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. అందుకే వేరే రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని రిక్వెస్ట్‌లు వస్తున్నా ఏపీనే ఎంచుకుంటున్నారు. ఈ రోజు దాల్మియా సిమెంట్స్ విస్తరణ జరగడానికి ప్రధాన కారణం ఇక్కడి రైతులు, కంపెనీని నడిపిస్తున్న ఉద్యోగులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణు లు, కార్మికులు. మీ అందరికీ అభినందనలు. కడప జిల్లా భవిష్యత్ కు



మరో బలమైన పునాది వేశాం. నేను ప్రపంచం మొత్తం తిరిగి కంపెనీలు తీసుకొస్తాను. అది నా బాధ్యత. కానీ ఆ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చిన యువతపై కూడా బాధ్యత ఉంటుంది. మీ క్రమశిక్షణ, శ్రమించే తత్వం, మీ వ్యక్తిత్వం వల్ల మనకి మంచి పేరు వస్తుంది. మీరంతా కష్టపడి పనిచేస్తే మరిన్ని కంపెనీలు ఏపీకి వస్తాయి.

### పరిశ్రమలకు యువతను సిద్ధం చేస్తున్నాం

నాకొక వింత పరిస్థితి ఉంది. మేం కంపెనీ పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం. మీ దగ్గర నిపుణులైన యువత ఉన్నారా అని కొంతమంది అడుగుతున్నారు. అందుకే ఇప్పుడు ఐటీఐలను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నాం. ఒక్కో ఐటీఐని ఒక్కో కంపెనీకి అనుసంధానిస్తున్నాం. పరిశ్రమలకు కావాల్సిన విధంగా యువతను సిద్ధం చేస్తున్నాం. మొన్న శ్రీసిటీలో యూనివర్సిటీని ప్రారంభించాం. అది ఇండియాలోనే ఫస్ట్ ఎల్ఈజీ(లెర్న్, ఎర్న్, గ్రాడ్యుయేట్) మోడల్ యూనివర్సిటీ. మూడు నెలలు క్లాస్‌రూమ్‌లో, 8 నెలలు ఇండస్ట్రీలో వర్క్. చదువుకుంటూనే సంపాదిస్తారు. చదువు పూర్తయ్యేసరికి ఉద్యోగానికి కావాల్సిన అన్ని నైపుణ్యాలు వారికి ఉంటాయి.

### నైపుణ్యాభివృద్ధిలో సహకారం అందించండి

ప్రపంచ స్థాయి నైపుణ్యాభివృద్ధి వ్యవస్థను నిర్మించే మా ప్రయ త్నంలో ఏపీ ప్రభుత్వానికి భాగస్వామిగా నిలవాలని పునీత్ జీని కోరుతున్నా. మా యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో మాకు సహకరించండి. నైపుణ్యాభివృద్ధిలో ఏపీని దేశానికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు మాతో కలిసి పనిచేయండి. అశోక విశ్వవిద్యాలయం తరహాలో ఉన్నత విద్యను ప్రోత్సహించే మరో ప్రపంచస్థాయి విద్యాసంస్థను ఏపీలో ఏర్పాటు చేయడాన్ని కూడా మీరు పరిశీలిస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది.

### ఏపీని రెండో ఇల్లుగా భావించండి

ఒక వ్యాపారవేత్తగా మీ ఔత్సాహిక పారిశ్రామిక ప్రయాణం, మీరు భవిష్యత్తులో ప్రారంభించబోయే కొత్త వ్యాపారాలపై నాకు అపారమైన గౌరవం ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను మీ రెండో ఇల్లుగా భావించండి. మీరు ఏ కొత్త వ్యాపారాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకున్నా ముందుగా మాకోసారి ఫోన్ చేయండి. మీకు అత్యుత్తమ వేదికను, అత్యంత ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలను, అనుకూలమైన విధానాలను అందిస్తాం. మీతో మేం పోటీ పడేది ఒక్క విషయంలోనే..అది వేగంలో. నా దృష్టిలో ఇది కేవలం ఒక సిమెంట్ ప్లాంట్ విస్తరణ మాత్రమే కాదు.. దాల్మియా గ్రూప్‌తో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే ఘట్టం.

### అభివృద్ధిలో దాల్మియా భాగం

గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి వికసిత్ భారత్-2047 దార్శనికత, గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి స్వర్ణాంధ్ర-2047 దార్శనిక మార్గదర్శకత్వంలో దాల్మియా భారత్ ఏపీ అభివృ ద్ధి ప్రస్థానంలో విలువైన భాగస్వామిగా నిరంతరం కొనసాగు తుందని పూర్తి విశ్వాసం ఉందని లోకేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్ పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు నియోజ కవర్గ ఎమ్మెల్యే సీ.ఆదినారాయణ రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ సీహెచ్ భూపేష్ రెడ్డి, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.





# దాల్మియా సిమెంట్ రెండో ప్లాంట్
# విస్తరణ పనులకు శంకుస్థాపన

**శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి లోకేష్ - రూ.3,100 కోట్ల పెట్టుబడి పెట్టనున్న సంస్థ**





జమ్మలమడుగు (చైతన్యరథం): కడప జిల్లా మైలవరం మండలం చిన్నకొమెర్లలో దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ప్లాంట్ ఆవరణకు చేరుకున్న మంత్రి లోకేష్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ముందుగా దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్‌ను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణను రూ.3,100 కోట్ల వ్యయంతో చేపట్టనుంది. మైలవరం మండలంలోని చిన్నకొమెర్లలో ప్లాంటులో దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్తప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్లాంట్ విస్తరణతో కొత్తగా 1000 మందికి ఉద్యోగాల కల్పన జరగనుంది. ఈ కార్య క్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీ.జీ. భరత్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, జమ్మలమడుగు ఎమ్మెల్యే సీ.ఆదినారా యణరెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, ఎమ్మెల్సీ భూమి రెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, దాల్మియా భారత్ లిమిటెడ్ గ్రోత్ అండ్ ఎక్స్‌పాన్షన్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేసీ బిర్లా, నేషనల్ మ్యానుఫ్యాక్చ రింగ్ హెడ్ గణేష్ వామనరావు జిర్కుంత్వార్, ప్లాంట్ హెడ్ అర్పన్ పరేఖ్, ప్రాజెక్ట్ హెడ్ అనుపమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.








చైతన్యరథం



# జగన్‌రెడ్డి సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ

- బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో వేలకోట్లు దోచుకున్నారు
- ఆ సొమ్ముతోనే సాక్షి పేపర్, టీవీ పెట్టారు
- ఐదేళ్లలో కడప జిల్లాకు జగన్ చేసింది శూన్యం
- వారు ఫ్యాక్షనిజం తెస్తే..మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం
- ఆర్థిక ఇబ్బందులున్నా పథకాలు అమలు చేస్తున్నాం
- ఈనెల 24న తల్లికి వందనం నిధులను జమ చేస్తాం
- ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో యువనేత నారా లోకేష్



ప్రొద్దుటూరు (చైతన్యరథం): జగన్‌రెడ్డి రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ.. జగన్ అధికారంలో ఉండగా కడప జిల్లాకు ఒక్క పరిశ్రమను సీమకు తీసుకురాకపోగా ఇక్కడ సంపదనంతా అడ్డగోలుగా దోచుకున్నారని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో ధ్వజ మెత్తారు. ప్రొద్దుటూరు సమీపంలోని దొరసానిపల్లిలో నియోజక వర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 11 వేల ఎకరాలను ఎకరా రూ.18 వేల చొప్పున, మరో 3 వేల ఎకరాలను ఎకరా రూ.25 వేల చొప్పున  తీసుకున్నారు, యువతకు 10 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చకుండా, ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేశారు. ఓబులాపురం గనుల్లో విచ్చలవిడిగా ఐరన్ ఓర్ తవ్వేసి రెడ్ గోల్డ్ పేరుతో విదేశాలకు తరలించి వేలకోట్లు దోచు కున్నారు, అదే అవినీతి సొమ్ముతో సాక్షి పత్రిక, టీవీలను కూడా పెట్టారని దుయ్యబట్టారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో కడపకు జగన్ చేసింది శూన్యం. చివరకు ఆయన నియోజకవర్గం పులి వెందులకు నీళ్లు ఇచ్చింది కూడా చంద్రబాబేనని తెలిపారు. ఈరోజు దాల్మియా భారత్ విస్తరణ పనులకు మేం శంకుస్థాపన చేశాం. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా లీగల్ నోటీసులు ఇచ్చి అడ్డుకోవడమే గాక మామూళ్ల కోసం వేధించారని గుర్తుచేశారు.

## వారు ఫ్యాక్షన్ తెస్తే..మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం

చంద్రబాబు నాలుగోసారి సీఎం అయ్యాక రాయలసీమలో ఇదివరకెన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోంది. జెఎస్ డబ్ల్యు స్టీల్‌ప్లాంట్‌కు ఇటీవల భూమిపూజ చేశారు, అంతకు ముందు ఎస్ఎఈఎల్ రెన్యువబుల్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభిం చాం, జిల్లావ్యాప్తంగా స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నాం. పరిశ్రమలతో పాటు హార్టికల్చర్‌ను కూడా ప్రోత్సహిస్తున్నాం. గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే మేం ఫ్యాక్టరీలు తెచ్చాం, రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం. వారు అధికారంలో ఉండగా చంద్రబాబును ఇంటినుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు వేయించారు. ఈరోజు జగన్ స్వేచ్ఛగా ఎక్కడకు వెళ్లడానికైనా అనుమతి ఇస్తున్నాం. ఇదే ప్రొద్దుటూరులో బీసీ నేత నందం సుబ్బయ్యను వైసీపీ హయాంలో దారుణంగా హతమార్చారు, మేం వారి కుటుంబానికి అండగా నిలిచి వారి బిడ్డలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూలులో చదివిస్తున్నామని చెప్పారు.

## ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం

వైసీపీ హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్య కర్తలే. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేం. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి భయపెట్టాలని చూశారు. జీవో 1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో మళ్లీ పార్టీకి గతవైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకు వస్తుంటాయి. మినీ ముంబాయిగా పేరొందిన ప్రొద్దుటూరు బంగారు వ్యాపారానికి దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ఇటీవల జొన్నగిరి గోల్డ్‌మైన్‌ను ప్రారంభించిన చంద్రబాబు రాయలసీమను గోల్డ్ హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ప్రొద్దుటూరులో నాలుగుసార్లు టీడీపీ గెలిచిందని పేర్కొన్నారు.

## కోటిమంది కుటుంబంలో చిన్నచిన్న సమస్యలు సహజం

2025 కడపలో జరిగిన మహానాడులో ఆరు శాసనాలను తీసుకున్నాం. అందులో ముఖ్యమైంది కార్యకర్తే అధినేత. దానిని చిత్తశుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తున్నాం. కోటిమందికి పైగా కార్యకర్తలున్న అతిపెద్ద కుటుంబం మనది. ఇంత భారీ వ్యవస్థలో చిన్నచిన్న సమస్యలు సహజం. బూత్, క్లస్టర్, మండల, నియోజకవర్గ, పార్లమెంటు, జోనల్ స్థాయిల్లో సమస్యలను పరి ష్కరించుకోవాలి. ఆ దశల్లో పరిష్కారం కాకపోతే

(తరువాయి 10లో..)



# జగన్‌రెడ్డి సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ

(9వ పేజీ తరువాయి.. )

కేంద్ర కార్యాలయం దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం. కార్యకర్తల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత నాయకులందరిపైనా ఉంది. పార్టీలో సంస్కరణల కోసం నేను ఎంతో పోరాటం చేయాల్సి వచ్చింది. సమస్యలను నాలుగు గోడల నడుమ బాబు గారితో చర్చిస్తామని తెలిపారు.

## పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత నాది

సీనియర్ నేత, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గంలోని పార్టీ కేడర్ అంతా కలిసికట్టుగా ముందుకు సాగాలి. ప్రతిపక్షంలో ఈ నియోజకవర్గంలో అనేక మంది నేతలు నాతో కలసి నడిచారు. వారందరినీ కలుపుకుని వెళ్లాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉంది. పార్టీలో వర్గాలు ఉండకూ డదు. వర్గాల వల్ల పార్టీ నష్టపోతుంది. నాయకులు పార్టీని నమ్మి పనిచేయండి, వారికి సరైన స్థానం కల్పించే బాధ్యత మేం తీసు కుంటాం. కష్టపడిన నాయకులను గుర్తించేందుకే మై టీడీపీ యాప్ తెచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా వివిధ స్థాయిల్లో పనిచేసే 4 లక్షల మంది నాయకుల పనితీరును అంచనా వేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. ఏ కార్యక్రమం చేసినా మై టీడీపీ యాప్ ద్వారా పార్టీ దృష్టికి తీసుకురండి. పదవులు వాటంతట అవే మిమ్మల్ని వెదుక్కుంటూ వస్తాయి. నామినేటెడ్ పోస్టులకు ఎంపిక ప్రక్రియను చంద్రబాబు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. తొలి విడతలో అవకాశం రాని వారికి మలివిడతలో వస్తుంది. క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తను గుర్తించే బాధ్యత తనదని స్పష్టం చేశారు.

## ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ కార్యక్రమాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక ఆర్థిక ఇబ్బందు లు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు నడిపిస్తున్నాం. ఈనెల 24వ తేదీన రెండోవిడత తల్లికి వందనం నిధులు జమ చేయబోతున్నాం. దేశంలో మరెక్కడా లేనివిధంగా రూ.4 వేల పెన్షన్ అందజేస్తున్నాం. దీపం-2 పథకంలో ఏడాదికి 3 గ్యాస్ సిలండర్లు, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు, చేనేతలకు ఉచిత విద్యుత్, ఆటో డ్రైవర్లు, మత్స్యకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నాం. ఎన్నికల్లో హామీ ఇవ్వని అన్న క్యాంటీన్లను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేశాం. యువగళంలో ఇచ్చిన హామీ మేరకు 16 వేల టీచర్ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీచేశాం. 10 వేల పోస్టులతో జాబ్ క్యాలండర్ ప్రకటించాం. ఒకవైపు గతంలో చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకుంటూ మరోవైపు సంక్షేమాన్ని పద్ధతి ప్రకారం కొనసాగిస్తున్నాం. వైసిపి హయాంలో ఆరుసార్లు విద్యుత్ చార్జీలు పెంచితే కూటమి ప్రభుత్వంలో ట్రూడౌన్ చేసి తగ్గించాం. చెత్తపై పన్ను వంటి వాటిని తొలగిం చాం. 60 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్నా సంక్షేమ పథకాలను సంతృప్తస్థాయిలో అందజేస్తున్నాం. మరో ఏడాది కష్టపడితే ఆర్థిక











సమస్యలను అధిగమిస్తాం. సర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత డోర్ టు డోర్ కార్యక్రమం ద్వారా ప్రజాప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం నింపాల్సిన బాధ్యత పార్టీ కేడర్‌పై ఉందని పిలుపునిచ్చారు.

## రాష్ట్రాభివృద్ధి కోసమే మూడు పార్టీల కలయిక

కేవలం రాష్ట్రాభివృద్ధే ఏకైక ఎజెండాగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. ఒకరి పేరుతో మరొకరిని ఉసిగొల్పేలా సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టి రెచ్చగొట్టేందుకు వైసీపీ పేటీఎం బ్యాచ్ ప్రయత్నిస్తారు. కూటమి కేడర్ అప్రమత్తంగా ఐక్యంగా ఉండి వారి కుట్రలను తిప్పికొట్టాలి. ఎట్టి పరిస్థితులు ఎదురైనా దీర్ఘకాలం కూటమి కొనసాగుతుంది. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోడీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖ స్టీల్‌కు నిధులు, రైల్వే జోన్, బీపీసీఎల్ వంటి భారీ ప్రాజెక్టులను రాష్ట్రానికి ఇచ్చారు. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాం. సరైన సమయంలో సరైన నాయ కుడు ప్రధాని మోదీ. ఆయన నేతృత్వంలో కలసికట్టుగా ముందుకు సాగుతాం. కార్యకర్తలు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో మాదిరి గానే పనిచేయండి. రాబోయే ఎన్నికల్లో ప్రతి బూత్, ప్రతి ఓటు మనకు కీలకమే. భారీ మెజారిటీతో నెగ్గిన మంగళగిరిలో కూడా 20 బూత్‌లలో మైనస్ వచ్చింది. ప్రజలతో బంధాన్ని ఏర్పాటు చేసుకుని మమేకమై ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు.





# విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిపెట్టాలి

**ఎంఈవోలు 15 రోజులకోసారి సమీక్షించాలి - విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశం - కడప జిల్లాలో పర్యటనలో భాగంగా దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ**





ప్రొద్దుటూరు(చైతన్యరథం): విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిపెట్టాలని మంత్రి నారా లోకేష్ సూచించారు. కడప జిల్లాలో పర్యటించిన మంత్రి నారా లోకేష్ బుధవారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభ్యసన ఫలితాలు, పాఠశాల పనితీరుపై ఆరా తీశారు. ముందుగా పాఠశా లలోని పదో తరగతి విద్యార్థులతో మంత్రి సంభాషించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల అందజేత, వాటి నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ఎంతమంది గమనిస్తున్నారని అడిగారు. విద్యతో పాటు శారీరక వ్యాయామం ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు.

## నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది

మీకు మార్కులు రాకపోతే నా మార్కులు పోతాయని విద్యార్థు లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నా భవిష్యత్ మీపై ఆధారపడి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రజాప్రభుత్వం విశేషంగా కృషిచేస్తోంది. అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫాం, షూ, తల్లికి వందనం పథకాలను అమలు చేస్తోందని వివరించా రు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరా తీశారు. ఐవీఆర్ఎస్ ద్వారా తల్లిదండ్రులు ఫీడ్‌బ్యాక్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సంద ర్భంగా విద్యార్థులు లోకేష్‌కు వివరించారు.

## లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టి పెట్టాలి

పాఠశాల తనిఖీ సందర్భంగా విద్యార్థుల అభ్యసన ఫలితాలపై మంత్రి ఆరా తీశారు. లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో పాఠశాల 1.3 స్టార్ రేటింగ్ పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.ధనలక్ష్మిని మంత్రి ప్రశ్నించారు. ఫార్మాటివ్, సమ్మెటివ్ అసెస్‌మెంట్‌పై తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించాలని, లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. పనితీరులో వెనుకబడిన పాఠశాలల పట్ల ఎంఈవోలు దృష్టిపెట్టాలని, 15 రోజులకోసారి సమీక్ష చేయాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. హాజరుపై ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరయ్యే పరిస్థితిని నివారించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ గతేడాది కంటే తక్కువగా ఉండటంపై ఆరా తీశారు. 10 మంది విద్యార్థు లు వసతిగృహాలకు, కేజీబీవీలకు తరలివెళ్లడం వల్ల ఎన్‌రోల్ మెంట్ తగ్గిందని ప్రిన్సిపాల్ వివరించారు. గతేడాది కంటే అడక మిక్ ఫెర్ఫార్మెన్స్ మెరుగుపడటాన్ని లోకేష్ ప్రశంసించారు. ప్రభు త్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకు ఉపాధ్యాయుల సహకారం కావాలని పేర్కొన్నారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ లక్ష్యమని, అందరం కలిసికట్టుగా ఉంటేనే ఇది సాధ్యమని చెప్పారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్‌పై దృష్టిపెట్టాలని.. ముఖ్యంగా విద్యార్థినులు డ్రాప్ అవుట్స్ కాకుండా చూడాలని సూచించారు. ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. లెర్నింగ్ అవుట్ కమ్స్‌లో వచ్చే ఏడాదికి 4 స్టార్ రేటింగ్ సాధిస్తామని ప్రిన్సిపాల్ హామీ ఇచ్చారు. అనంతరం అందరితో కలిసి మంత్రి ఫొటోలు దిగారు.

















## కృష్ణా-గోదావరి జలహారతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద కృష్ణా-గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. కృష్ణవేణి-గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు-కుంకుమలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# మరోసారి విద్యుత్ ఛార్జీల తగ్గింపు

- వరుసగా రెండో ఏడాది ప్రజలకు శుభవార్త
- ఏపీఈఆర్సీ తుది ఆమోదం తర్వాత అమలు
- ట్రూడౌన్ విధానంతో కూటమి ప్రభుత్వం మేలు

అమరావతి (చైతన్యరథం): ఏపీ విద్యుత్ రంగంలో మును పెన్నడూ లేని విధంగా వినియోగదారులకు వరుసగా రెండో ఏడాది కూడా భారీ ఊరట లభించనుంది. విద్యుత్ ఛార్జీల తగ్గిం పుపై కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రెండో ఏడాది 2025-2026 ఆర్థిక సంవత్సరానికి ట్రూడౌన్ అమలు చేయను న్నట్లు ప్రకటించింది. సాధారణంగా ఏటా విద్యుత్ ఛార్జీలు పెరుగుతాయని భయపడే సామాన్యుడికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ట్రూడౌన్ అనే వినూత్న విధానం ద్వారా కరెంట్ బిల్లుల ను తగ్గిస్తూ సరికొత్త రికార్డు సృష్టిస్తోంది. జగన్ ప్రభుత్వ హయాం లో అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ రంగాన్ని గాడిలోకి తీసుకు రావడం వల్లే ఇది సాధ్యమైంది. సాధారణంగా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) తాము అదనంగా కొనుగోలు చేసిన విద్యుత్ లేదా బొగ్గు రవాణా భారాలను ట్రూ అప్ చార్జీల పేరిట ప్రజలపై రుద్దుతుంటాయి. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఇదే పద్ధతిలో వేల కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం సమర్థవంతమైన విద్యుత్ కొనుగోళ్లు, పవర్ స్వాపింగ్, చౌకగా లభించే పునరుత్పాదక ఇంధనాన్ని సరిగ్గా వినియోగించు కోవడం ద్వారా డిస్కంల ఖర్చులను గణనీయంగా తగ్గించింది. ఇలా మిగిలిన లాభాన్ని తిరిగి వినియోగదారులకే బదిలీ చేసే ప్రక్రియనే ట్రూడౌన్ అంటారు.

**రూ.940 కోట్ల ఉపశమనం**

ఈ విధానం ద్వారా గతంలో తొలిసారిగా యూనిట్‌కు సుమారు 13 పైసల మేర దాదాపు రూ.924 కోట్ల ఉపశమనం కల్పించింది. ఇప్పుడు మలి దశలో అంతకంటే భారీ స్థాయిలో మరోసారి ట్రూడౌన్ చేయడానికి రంగం సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏకంగా రూ.940.07 కోట్లను తగ్గించాలని డిస్కంలు నిర్ణయించాయి. దీనివల్ల రాష్ట్రంలోని కోటికి పైగా ఉన్న గృహ వినియోగదారులతో పాటు లక్షలాది మంది వాణిజ్య, పారిశ్రామిక యజమానులకు నేరుగా లబ్ధి చేకూరనుంది. పరిశ్రమలకు ఊతమిచ్చేలా ఇప్పటికే చిన్న కుటీర పరిశ్రమల కనెక్టెడ్ లోడ్ పరిమితిని 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచిన ప్రభుత్వం..ఈ నిర్ణయంతో సామాన్యుడి నెల వారీ భారాన్ని మరింత తగ్గించనుంది. ఈ రూ.940 కోట్ల అదనపు రాబడిని వినియోగదారుల బిల్లుల్లో మినహాయించేం దుకు సంబంధించిన ప్రతిపాదనలను డిస్కంలు ఇప్పటికే ఏపీఈఆర్సీ(ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్)కి సమర్పించాయి. ఈ నియంత్రణ మండలి తుది ఆమోదం లభించిన వెంటనే రాబోయే నెలల బిల్లులలో ఈ తగ్గుదల స్పష్టంగా కనిపిం చనుంది. నిరంతరం భారం వేసే సంస్కృతికి స్వస్తి పలికి విద్యుత్ సంస్కరణలలో రాష్ట్రాన్ని దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలబెట్టే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.



**గోదావరి పరవళ్లు ఏటా సముద్రం పాలవుతుంటే.. సీమ నేలలు చుక్కనీటి కోసం తపించే వైరుధ్యానికి తెరదించే మహాసంకల్పం మరోసారి ఊపందుకుంది. కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. రెండేళ్లలో సాగునీటి రంగంపై రూ.24 వేల కోట్లు వెచ్చించామని, మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించడాన్ని సాధారణ అంశంగా చూడకూడదు. మార్చి 2027నాటికి పోలవరాన్ని జాతికి అంకితం చేస్తామన్న గడువుతోపాటు.. నదుల అనుసంధానంతో రాష్ట్రానికి కరవే ఉండదన్న భరోసానూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారు. పట్టిసీమతో దేశంలోనే తొలి అనుసంధాన ప్రయోగాన్ని విజయవంతం చేసిన అనుభవం.. నేడు గోదావరి-బనకచర్ల మహా ప్రణాళికగా విస్తరిస్తోంది. ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి, సెప్టెంబరు 1న వెలిగొండ జాతికి అంకితం.. ఇలా గడువులతో సాగుతున్న జలయజ్ఞం వెనుక ఉన్న సంకల్పం, ప్రస్థానంతో ప్రజలూ అనుసంధానం కావాల్సిన తరుణమిది!**

- మహాదేవ

◆ జల భగీరథం



# సంకల్పం నుంచి సాకారం వరకూ..

నీరే నాగరికతల తల్లి! నదీ తీరాల్లోనే మానవ చరిత్ర పురుడు పోసుకుంది!! కానీ ప్రకృతి పంపిణీలో ఉన్న అసమానత.. ఒక ప్రాంతాన్ని వరదలతో ముంచెత్తుతుంటే, మరో ప్రాంతాన్ని కరవుతో కాల్చేస్తోంది. గోదావరి ఏటా వేల టీఎంసీ జలాలను వృథాగా సముద్రం పాలు చేస్తుంటే.. రాయలసీమ నేలలు చుక్కనీటి కోసం తపిస్తున్నాయి. ఈ వైరుధ్యానికి పరిష్కారమే నదుల అనుసంధానమన్నది దశాబ్దాలుగా వినిపిస్తున్న ఆలోచన. ఆ ఆలోచనను ఆచరణలోకి తెచ్చే మహాయజ్ఞానికి ఆంధ్రప్రదేశ్ మరోసారి వేదికవుతోంది. ఇబ్రహీంపట్నం సమీపంలోని కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రెండేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై రూ.24 వేల కోట్లు ఖర్చు చేశామని, వచ్చే మూడేళ్లలో మరో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించడం రాష్ట్ర జలచరిత్రలో కీలక ఘట్టం. "నదుల అనుసంధానం పూర్తి చేస్తే రాష్ట్రానికి కరవు ఉండదు" అన్న చంద్రబాబు మాట ఈ యజ్ఞం వెనుక ఉన్న మౌలిక దృష్టిని ఆవిష్కరిస్తోంది. నిజానికి చంద్రబాబుకు నదుల అనుసంధానం కొత్త అంశమేమీ కాదు. అది ఆయన దీర్ఘకాల రాజకీయ-పాలనా అజెండాలో అంతర్భాగం. 2014లో విభజిత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆయన చేపట్టిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఇందుకు తొలి తార్కాణం. గోదావరి జలాలను పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణమ్మకు చేర్చిన ఆ పథకం.. దేశంలోనే నదుల అనుసంధానాన్ని ఆచరణాత్మకంగా నిరూపించిన తొలి ప్రయోగంగా చరిత్రకెక్కింది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన జాతీయస్థాయి చర్చను.. ఏడాది వ్యవధిలో పూర్తైన ఒక పథకం ద్వారా క్షేత్రస్థాయి వాస్తవంగా మార్చి చూపడం విశేషం. కృష్ణా డెల్టా స్థిరీకరణకు ఆ జలాలు అండగా నిలిచాయి. శ్రీశైలం జలాలను రాయలసీమ అవసరాలకు మళ్లించే వెసులుబాటూ లభించింది. ఆనాటి విజయమే నేటి విస్తృత అనుసంధాన ప్రణాళికలకు ఆత్మవిశ్వాస పునాది.

ఈ ప్రస్థానంలో పోలవరం ప్రాజెక్టు కేంద్రబిందువు. "పోలవరం రాష్ట్రానికి జీవనాడి" అని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి.. మార్చి 2027నాటికి ప్రాజెక్టును వందశాతం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టమైన గడువు ప్రకటించడం సాహసోపేత నిర్ణయం కాకపోదు. గత ప్రభుత్వ హయాంలో నత్తనడకన సాగి, డయాఫ్రం వాల్ దెబ్బతిని, వ్యయ అంచనాలు పెరిగి సంక్షోభంలో పడిన ఈ ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి పట్టాలెక్కించడం, కేంద్ర నిధులు రాబట్టడం, విదేశీ నిపుణుల సలహాలతో సాంకేతిక సమస్యలను అధిగమించడం కీలక పరిణామ ఘట్టాలు. పోలవరం పూర్తయితే 7.2 లక్షల ఎకరాలకు కొత్త సాగునీరు, 23.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 28.5 లక్షలమందికి తాగునీరు అందుతాయని అంచనా. ఇప్పటికే ఎడమ కాల్వ పనులు పూర్తికావడంతో ఆగస్టు 14న అనకాపల్లిలో గోదావరి జలాలకు జలహారతి ఇవ్వనున్నట్టు సీఎం ప్రకటించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ద్వారా అనకాపల్లి, విశాఖలకు గోదావరి నీళ్లందించి.. ఆపై గోదావరి-నాగావళి అనుసంధానం చేపడతామన్న రూట్‌మ్యాప్ కూడా బాబు నోట వినిపించింది. దశాబ్దాల నిరీక్షణలో ఉన్న వెలిగొండ ఫేజ్-1ను సెప్టెంబరు 1న జాతికి అంకితం చేయనుండటం -ప్రకాశం జిల్లా ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు పెద్ద ఊరట. గుంటూరు ఛానల్ ఆధునికీకరణకు ఈ నెలలోనే శంకుస్థాపన జరగనుంది. ఇక అనుసంధాన యజ్ఞంలో తలమానికం కానున్నది గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు. పోలవరం వద్ద గోదావరి వరద జలాలను కృష్ణాలోకి, అక్కడి నుంచి పల్నాడు జిల్లా బొల్లాపల్లి జలాశయానికి, ఆపై నల్లమల మీదుగా బనకచర్లకు తరలించి.. రోజుకు రెండు టీఎంసీ చొప్పున ఏటా 200 టీఎంసీ వరద జలాలను ఒడిసిపట్టాలన్నది ఈ బృహత్ ప్రణాళిక. సుమారు రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో మూడు దశల్లో దీన్ని చేపట్టాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం ముఖ్యమంత్రి చైర్మన్‌గా ప్రత్యేకంగా 'జలహారతి కార్పొరేషన్' ఏర్పాటు చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి సంకేతం. బనకచర్ల చేరిన జలాలు తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి వ్యవస్థల ద్వారా రాయలసీమ నలుమూలలకూ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకూ విస్తరిస్తాయి. అదే జరిగితే వర్షాభావంతో వలసబాట పట్టే సీమ పల్లెల తలరాత మారుతుంది.

చంద్రబాబు సంకల్పంలో కనిపించే మరో విశేషం.. రాష్ట్ర సరిహద్దులు దాటిన జాతీయ దృక్పథం. "గంగా-కావేరి నదుల అనుసంధానం చేయగలిగితే దేశానికి తిరుగుండదు" అని నేటి సభలో ఆయన చేసిన వ్యాఖ్య ఇందుకు నిలువుటద్దం. గోదావరి-కావేరి అనుసంధానంపై కేంద్రం యోచిస్తున్న వేళ.. కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు ఒకే వేదికపైకి రావడాన్ని చారిత్రక ఘట్టంగా ఆయన అభివర్ణించారు. కేన్-బెత్వా అనుసంధాన ప్రాజెక్టు దేశ నీటి నిర్వహణకు ఆదర్శమని, అదే తరహాలో గోదావరి-కావేరి అనుసంధానం జరిగితే నాలుగు దక్షిణాది రాష్ట్రాలకు అపార ప్రయోజనాలు కలుగుతాయని ఆయన పేర్కొన్న తీరు.. అనుసంధాన ఉద్యమానికి జాతీయ నేతృత్వం వహించాలన్న ఆకాంక్షను సూచిస్తోంది. "ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా, సవాళ్లెన్ని ఎదురైనా గోదావరి-కృష్ణా-పెన్నా అనుసంధానం పూర్తి చేసి తీరుతాం.. ప్రతి ఎకరాకు నీళ్లిస్తాం. ప్రతి గ్రామానికీ తాగునీరందిస్తాం" అని గతంలో జలవనరుల శాఖ సమీక్షలో చంద్రబాబు చేసిన ప్రకటన ఈ పట్టుదలకు నిదర్శనం. విభజన అనంతరం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రం ఇంత భారీ వ్యయానికి సిద్ధపడటం సాహసమే! కానీ నీటి లభ్యతే వ్యవసాయానికి, పరిశ్రమలకు, పట్టణీకరణకు మూలాధారమన్న దీర్ఘకాలిక ఆలోచనతో చూస్తే.. ఇది వ్యయం కాదు, భవిష్యత్తుపై పెట్టుబడి. పట్టిసీమ అనుభవం నేర్పిన పాఠం ఒక్కటే.. సంకల్పం దృఢంగా ఉంటే సాధ్యాసాధ్యాల చర్చను ఆచరణే జయిస్తుంది. అయితే సంకల్పానికీ సాకారానికీ మధ్య నిధుల సమీకరణ, అంతర్రాష్ట్ర సమన్వయం, పర్యావరణ అనుమతులువంటి అగ్నిపరీక్షలెన్నో ఉన్నాయి. వాటి లోతుపాతులేమిటో రేపటి భాగంలో చర్చిద్దాం.



**ప్రయోజనాల ప్రవాహం.. సవాళ్ల సుడిగుండం**

(రెండవ భాగం రేపు)

# ‘ఆక్వా’పై అసత్య ప్రచారాలు!

## వైసీపీ అసత్యాలపై మంత్రి అచ్చెన్న ఆగ్రహం - గణాంకాలతో అబద్ధాలను తిప్పికొట్టిన వైనం




విజయవాడ (చైతన్య రథం): గత ప్రభుత్వం ఆక్వా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చుపెడుతూ పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె అచ్చెన్నాయుడు అన్నారు.

పెనమలూరు మండలం గంగూరులోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఆక్వా కల్చర్ డవలప్మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణ రెడ్డిలు మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో ఆక్వా మరియు అనుబంధ రంగాల ద్వారా కేవలం 41.75 లక్షల కోట్ల జీవీఏ ఆదాయం వస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే దానిని 63.65 లక్షల కోట్లకు పెంచిందన్నారు. 2014-19 మధ్యకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శూన్యంనుంచి ఆక్వా రంగాన్ని 17.74శాతం వృద్ధి రేటుతో గత ప్రభుత్వానికి అప్పగించారన్నారు. అయితే గత ప్రభుత్వం దానిని పెంచాల్సింది పోయి, 16.7శాతానికి తగ్గించి దివాళా తీయించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మళ్లీ దీనిని 19శాతం వృద్ధి రేటుకు తీసుకువెళ్లిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో గత ముఖ్యమంత్రి ‘అప్సడా’ చట్టం తెచ్చానని, తానే చైర్మన్గా ఉన్నానని గొప్పలు చెప్పుకున్నారని, కానీ, ఆయన హయాంలో ఒక్కటంటే ఒక్క రోజు కూడా అప్సడా ఫుల్బాడీ సమావేశం నిర్వహించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మొట్టమొదటి పూర్తిస్థాయి అప్సడా సమావేశం నిర్వహించి, ప్రతి 15 రోజులకు ఒకసారి రైతులు, పరిశ్రమల యాజమాన్యాలతో సమీక్షలు జరుపుతూ ధరల నియంత్రణకు ఒక సిస్టమ్ను ఏర్పాటు చేసిందన్నారు.

2019 లో ఫీడ్ ధర కేజీ కేవలం రూ.87 మాత్రమే ఉండేదన్నారు. గత ప్రభుత్వం అంతర్జాతీయ మార్కెట్లో రా మెటీరియల్ (సోయాబీన్, ఫిష్ ఆయిల్) ధరలు పెరగకపోయినా, కంపెనీలతో మిలాఖత్ అయి 6సార్లు ధరలు పెంచి రూ.110కి చేర్చిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతుల భారాన్ని తగ్గిస్తూ తక్షణమే రూ.6 తగ్గించిందన్నారు. ఇటీవల అంతర్జాతీయంగా ఫిష్ ఆయిల్ ధర 91శాతం, సోయాబీన్ ధర 49శాతం పెరిగి, ఫ్యాక్టరీలు మూతపడే పరిస్థితి వస్తే... ముఖ్యమంత్రి 5గంటల పాటు సుదీర్ఘంగా సమీక్షించి సమతుల్యత సాధించారన్నారు. కేంద్ర మంత్రితో మాట్లాడి సోయాబీన్, ఫిష్ ఆయిల్ ధరలు తగ్గించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.

2014కు ముందు యూనిట్ విద్యుత్ ధర రూ.3.8 ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దానిని రూ.2కి తగ్గించి ఆక్వా రంగానికి ఊతమిచ్చారన్నారు. గత ప్రభుత్వం పాదయాత్రలో అందరికీ రూ.1.50కే ఇస్తామని గొప్పలు చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక ఆక్వా జోన్, 10 ఎకరాలలోపు ఉన్నవారికేనంటూ ఆంక్షలు పెట్టి మెజారిటీ రైతులను మోసం చేసి, కేవలం 68 వేల కనెక్షన్లకు రూ.750 కోట్ల సబ్సిడీ మాత్రమే ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎలాంటి జోన్, నాన్-జోన్ నిబంధనలు లేకుండా, ఎకరాల పరిమితి లేకుండా ఆక్వా రైతులకు రూపాయిన్నర (రూ.1.50)కే విద్యుత్ అందిస్తూ జీవో జారీ చేసిందన్నారు. ఇందుకోసం ఏడాదికి రూ.1175 కోట్లు సబ్సిడీగా కేటాయించిందన్నారు. అదనంగా రూ.320 కోట్ల వ్యయంతో 12,500 కొత్త కనెక్షన్లను మంజూరు చేస్తోందన్నారు.

తమ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు 25 కేవీ ట్రాన్స్ఫార్మర్ కేవలం రూ.67,000లకే ఇస్తే, గత ప్రభుత్వం ఆ ధరను ఏకంగా రూ.3,24,000కి పెంచి రైతుల నడ్డి విరిచిందన్నారు. అలాగే గతంలో రూ.3,56,000గా ఉన్న 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ ధరను గత ప్రభుత్వం రూ.7,03,000కి పెంచి భారీ దోపిడీకి పాల్పడిందన్నారు. గత ప్రభుత్వం 375 ల్యాబ్లు పెట్టామని ప్రచారం చేసుకుంది, కానీ వాటిల్లో కనీసం ఒక ఇన్స్ట్రుమెంట్ గానీ, సిబ్బందిగానీ లేరని కేవలం బోర్డులకే పరిమితమయ్యాయన్నారు. ఫిషరీస్ యూనివర్సిటీ పేరుతో సచివాలయాల్లో క్లాసులు పెట్టి కోడిపిల్లల్లాగా విద్యార్థులను చెల్లాచెదురు చేశారన్నారు. భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సిన రూ.38 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం ఎగ్గొడితే కూటమి ప్రభుత్వం బడ్జెట్లో ఆ నిధులు కేటాయించి బకాయిలు తీర్చి, యూనివర్సిటీని పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తోందన్నారు.

అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గులు, ఇరాన్ యుద్ధ ప్రభావం, అమెరికా ఆంక్షలు వంటి క్లిష్టపరిస్థితులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రంగాన్ని కాపాడుకోవడానికి నిరంతరం శ్రమిస్తోందన్నారు. సొంత సిమెంట్ కంపెనీ ధరలను విపరీతంగా పెంచి దోచుకున్న చరిత్ర ఉన్న ప్రతిపక్ష నేతకు, ఆక్వా రంగంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఆక్వా రైతులు వాస్తవాలను గమనించాలని మంత్రి. కె.అచ్చెన్నాయుడు అన్నారు.

# ఆయుష్ హబ్గా ఏపీ

- ప్రాచీన వైద్యానికి పూర్వవైభవం
- రూ.414 కోట్లతో 1500 డిస్పెన్సరీల ఆధునికీకరణ
- ఔషధ మొక్కల సాగుకు ప్రోత్సాహం
- కొత్తగా నాలుగు ఆయుష్ కళాశాలల
- వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ వెల్లడి



విజయవాడ (చైతన్య రథం): ఆయుష్ వైద్యానికి ఆంధ్రప్రదేశ్ హబ్గా మారుస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో అత్యంత నిరాదరణకు గురైన ప్రాచీన ఆయుష్ వైద్యానికి పునరుజ్జీవం తెచ్చేందుకు రూ.414కోట్లతో అభివృద్ధి చర్యల్ని చేపట్టామని చెప్పారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం “ఔషధ మొక్కల స్థిరమైన సాగు, ఆర్థిక వృద్ధి, మార్కెటింగ్ మౌలిక సదుపాయాలు” అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ, నేచురోపతి, హోమియోపతి) విభాగం పరిధిలో భారీ అంచనా వ్యయంతో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నామని వెల్లడించారు. కేవలం రోగం వచ్చిన తర్వాత చికిత్స అందించే ‘రియాక్టివ్-క్యూరేటివ్’ విధానం నుంచి, రోగాలను ముందుగానే గుర్తించి నివారించే ‘ప్రెడిక్టివ్-ప్రివెంటివ్-వెల్నెస్ సెంట్రిక్’ ఆరోగ్య విధానం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ప్రాచీన ఆయుష్ వైద్య సేవల విస్తరణలో భాగంగా రూ. 280 కోట్లతో నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద వైద్య కళాశాలలు, ప్రొద్దుటూరులో యునాని కళాశాలలు రాబోతున్నాయని చెప్పారు. ఒక్కో కళాశాలకు రూ. 70 కోట్లు వ్యయం చేస్తామని చెప్పారు. ఇప్పటికే విశాఖపట్నంలో నేచురోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు (మొత్తం రూ. 280 కోట్లు) పూర్తయ్యాయని తెలిపారు. అదేవిధంగా తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులకు ఒక్కో దానికి రూ. 90 కోట్లు వెచ్చిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 44 కోట్లతో తలపెట్టిన 1,500కు పైగా ఆయుష్ డిస్పెన్సరీల ఆధునికీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. త్వరలో కేంద్ర ఆయుష్ శాఖ మంత్రి రాష్ట్ర పర్యటనకు రానున్నారని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. మరోవైపు ప్రభుత్వ ఆరోగ్య సంస్కరణల ఫలితంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు సుమారు 20 శాతం పెరిగాయన్నారు. గుంటూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 255 ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ వైద్య సామర్థ్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ కృషి కారణంగా ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబిబియస్ సీట్లు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు.

### ఔషధ మొక్కల పెంపకానికి మంచి డిమాండ్

ఆయుర్వేదం, యునాని, హోమియోపతి, నేచురోపతి వంటి భారతీయ వైద్య విధానాలపట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఔషధ మొక్కల పెంపకం ద్వారా రైతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి చెప్పారు. మునగ, అలోవెరా వంటి మొక్కలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు. రైతు ఉత్పత్తుల్ని విలువ ఆధారిత ఔషధ మొక్కల ద్వారా డిమాండ్ పెరిగేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అశ్వగంధ, మునగాకు, ఉసిరి వంటి ఔషధ మొక్కలకు అంతర్జాతీయంగా పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని, రైతులు, విద్యార్థులు ఈ రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ, వైద్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఔషధ మొక్కల సాగును మరింత ప్రోత్సహిస్తాయని తెలిపారు.

### శాస్త్రీయ ప్రమాణాలను అనుసరించాలి

వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి జి.వీరపాండియన్ మాట్లాడుతూ ఇటీవల తాను హిమాలయాల పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడ వేల సంవత్సరాల చరిత్ర గల దేవదారు మరియు ఇతర అద్భుతమైన ఔషధ మొక్కల్ని డిపార్ట్మెంట్ వారు ఎలా సంరక్షిస్తున్నారో స్వయంగా చూశానన్నారు. సాంప్రదాయ వైద్యం గురించి మనం ఎంత గొప్పగా చెప్పుకున్నా, దాన్ని ప్రజలు భయం లేకుండా వాడాలంటే ప్రభుత్వ డ్రగ్ కంట్రోల్ నిబంధనల ప్రకారం శాస్త్రీయ ప్రమాణాలు, సర్టిఫికేషన్ అవసరమన్నారు. మందులను ఎంత మోతాదులో వాడాలో, ఎవరు వాడకూడదో స్పష్టమైన లేబులింగ్, గైడ్లైన్స్ ప్రొడక్ట్స్పై ముద్రించాలన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో కేవలం 30,000 నుండి 35,000 ఎకరాల్లోనే ఔషధ మొక్కల సాగు జరుగుతోందని, దీనిని అటవీశాఖ సహకారంతో లక్షల ఎకరాలకు విస్తరించాలన్నారు. రైతులకు కేవలం అవగాహన కల్పించడమే కాకుండా, సాధారణ పంటల కంటే ఎక్కువ లాభాలు వచ్చేలా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించి, ల్యాబ్లు అందుబాటులోకి తెచ్చినప్పుడే రైతులు ఈ సాగు వైపు ఉత్సాహంగా ముందుకు వస్తారన్నారు. ఈ దిశగా తమ శాఖ తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

### నకిలీ ఉత్పత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కె.వి.ఎన్. చక్రధర్బాబు మాట్లాడుతూ వంటింట్లోనే సహజ సిద్ధమైన మందులున్నాయన్నారు. ‘నేచురల్’ పేరుతో మార్కెట్లో విక్రయించే ఉత్పత్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి నాణ్యత ప్రమాణాలను పరిశీలించాలని కోరారు. అరోమాటిక్ ప్లాంట్స్ బోర్డు ప్రచురించిన నివారణ వైద్యానికి సంబంధించిన విజ్ఞానాన్ని గ్రామీణ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారు (యోగా అండ్ నేచురోపతి) డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ రుషుల జీవన విధానం గురించి వివరించారు. మొక్కల పెంపకం ద్వారా సహజ సిద్ధమైన ఆక్సిజన్ అందుబాటులోకి వస్తుందని, ఆ దిశగా ప్రజలు ఆలోచించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆవుల చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 2,200 ఎకరాల్లో అశ్వగంధ ఔషధ మొక్కల్ని పెంచేందుకు విత్తనాల్ని బోర్డు ద్వారా పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమ వేదికను అలంకరించిన వారిలో ప్రభుత్వ సలహాదారు (పర్యావరణ, అటవీ శాఖ) పి. మల్లికార్జున రావు, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి, ఏపీ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ పి.వి.లక్ష్మయ్య ప్రభృతులు ఉన్నారు.

### వెబ్సైట్, గ్రంథాల ఆవిష్కరణ

ఈ సదస్సులో ఔషధ, సుగంధ మొక్కల ప్రోత్సాహానికి రూపొందించిన వెబ్సైట్ను మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు. అలాగే ప్రపంచ రికార్డు గుర్తింపు పొందిన ఆయుర్వేద, ఔషధ మొక్కల గ్రంథాలను ఆవిష్కరించి, రైతులకు ఔషధ, సుగంధ మొక్కలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# 'సీబీజీ'తో సమస్యలుండవు

- నూజివీడు అభివృద్ధిని అడ్డుకుంటున్న విపక్షం
- పరిశ్రమ ఏర్పాటుకు కుట్రతో మోకాలడ్డు
- మీడియా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి



ఏలూరు/ఆగిరిపల్లి (చైతన్య రథం): ఆగిరిపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చేసే ప్రయత్నాలకు ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలతో బురదచల్లుతూ వివాదాస్పదం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో బుధవారం గ్రామసభలో పాల్గొని ప్రజ సమస్యలను మంత్రి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ఏ ప్రాంతమైన అభివృద్ధి కావాలంటే పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు, ఆ ప్రాంతంలోని ఎంతో మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ క్లీన్, గ్రీన్ ఎనర్జీ విధానం ద్వారా ఆగిరిపల్లి మండలంలో 120 కోట్ల రూపాయలతో నితిన్ కృష్ణ కన్స్ట్రక్షన్స్ కంపెనీ కంప్రెస్డ్ బయో గ్యాస్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. 39 కోట్ల రూపాయలు ప్రమోటర్ల పెట్టుబడి, మిగిలిన మొత్తం బ్యాంకుల నుండి రుణంతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. నూజివీడు మండలం తుక్కులూరులో కూడా 200 కోట్ల రూపాయల పెట్టుబడితో ఇటువంటి కర్మాగారం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కర్మాగారాల ఏర్పాటు ప్రధాన ఉద్దేశ్యం నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లడంతోపాటు ఈ ప్రాంతంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమన్నారు. రిలయన్స్ కంపెనీ 65 వేల కోట్ల రూపాయలతో దేశవ్యాప్తంగా ఇటువంటి కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్లను 500 యూనిట్లను ఏర్పాటు చేస్తున్నదన్నారు. కానీ ఎక్కడా వారి సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ప్రజలతో గ్రామ సభలు నిర్వహించలేదని, కానీ తన కుమారుడు సామాజిక బాధ్యతతో గ్రామ సభ నిర్వహించి ప్రజలకు పరిశ్రమ ఏర్పాటు లాభాలను తెలియజేశాడన్నారు. అంతేకాక పీ4 కార్యక్రమం కింద పలుగ్రామాలలో పేదల అభివృద్ధికి కుట్టు మిషన్లు, పాడి పశువులను అందించారన్నారు. పరిశ్రమలు వస్తే వాటి సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆయా ప్రాంతాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. కానీ అభివృద్ధిని అడ్డుకునే ప్రతిపక్షం నూజివీడు అభివృద్ధిని అడ్డుకునేందుకు కంప్రెస్డ్ బయో గ్యాస్ యూనిట్ల ఏర్పాటు కారణంగా ప్రజలకు సమస్యలు వస్తాయని, వంటి ఎన్నో అసత్యాలను ప్రచారం చేస్తున్నదన్నారు. ప్రజలను రెచ్చగొట్టి అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్నారు. సిబిజి నేపియర్ గ్యాస్, గడ్డి, మొక్కజొన్న వ్యర్థాలు, ఆవు పేడ వంటివి వినియోగిస్తారని, వీటి కారణంగా ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు ఉండవన్నారు. ఆగిరిపల్లి ప్రాంతాల్లోని వారిని పెద్దాపురం, కంచికచర్లలో సిబిజి ప్లాంట్ నిర్వహణను పరిశీలించేందుకు తీసుకువెళ్లామని, వారు పరిశీలించి ఎటువంటి దుర్వాసన లేదని పరిశీలించారన్నారు. సిబిజి పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూమిని మంత్రివర్గ సమావేశంలో మంజూరు చేసారని, అప్పటివరకు తాను ఆ స్థలాన్ని పరిశీలించలేదన్నారు. తనకు కేటాయించిన భూమిని తప్ప ఒక్క ఎకరం కూడా తీసుకోలేదన్నారు. సిబిజి కంపెనీకి కేటాయించిన భూమిలో భూమిని తవ్వి భూమిని చదును చేస్తున్నామన్నారు. ప్రతిపక్షానికి చెందిన కొందరు తమ భూములు ఉన్నాయని తెలియజేస్తున్నారని, గత ప్రభుత్వ సమయంలో మాజీ ఎమ్మెల్యే అనుచరుడు బాబూరావుకు అక్రమ మట్టి తరలింపుపై ఖనిజాల శాఖ విచారణ చేసి 3 కోట్ల రూపాయలు పెనాల్టీ విధించిందన్నారు. విచారణలో గత ప్రభుత్వ సమయంలో ఆనాటి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మట్టి అక్రమ రవాణా చేసానని బాబూరావు అధికారుల విచారణలో వెల్లడించారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేసారు. అమ్మవారిగూడెంలో గెలాక్సీ మినరల్స్ కంపెనీపై 5 గురిపై కేసులు కూడా నమోదు చేశారన్నారు. గత ప్రభుత్వ సమయంలో మాజీ ఎమ్మెల్యే 27 ఎకరాలకు అనుమతి తీసుకుని వేలాది ఎకరాలలో మట్టిని అక్రమంగా తవ్వి, తరలించారన్నారు. ఇందుకు సంబంధించి శాటిలైట్ చిత్రాలను మంత్రి పాత్రికేయులకు చూపుతూ వీటిపై విచారణ చేసి ఆనాటి ప్రకృతి విధ్వంసానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ఒక ప్రదేశంలో చర్చ్ తొలగించాల్సి వచ్చినప్పుడు చర్చ్ పెద్దలతో మాట్లాడి వేరే ప్రదేశంలో పెద్దస్థాయిలో నిర్మిస్తామని కోరమని, కానీ వారు అదే ప్రదేశంలో చర్చ్ ఉండాలని కోరడంతో వారి విన్నపాన్ని మన్నించామన్నారు. సిబిజి పరిశ్రమ ఏర్పాటులో ఆగిరిపల్లి ప్రాంత ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. ఆగిరిపల్లి ప్రాంత ప్రజలు తమకు అభివృద్ధి వద్దు, తమ ప్రాంత యువత ఉద్యోగ అవకాశాలు వద్దు అని తీర్మానం చేస్తే తన కుమారుడు నితిన్ కృష్ణ కన్స్ట్రక్షన్స్ కంపెనీ సిబిజి కంపెనీని అక్కడ నుండి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధమన్నారు.

ఈ సందర్భంగా ఆగిరిపల్లి ఎవాంజెలికల్ మినిస్ట్రీస్ చర్చ్ పాస్టర్ పెదబాబు మాట్లాడుతూ సిబిజి పరిశ్రమ ఏర్పాటుకు మంజూరు చేసిన భూమిలో తమ చర్చ్‌లో కొంతభాగం ఉండడంతో వేరే ప్రదేశంలో పెద్ద చర్చ్ నిర్మిస్తామని మంత్రి పార్థసారధి కోరారని, కానీ తమవారితో చర్చించి తాము ఒప్పుకోలేదన్నారు. దాంతో మంత్రి తమ మాటను మన్నించారని, అంతేకాక మంచి మనసుతో ప్రస్తుతం ఉన్న చర్చ్ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారన్నారు. ఈ విషయాన్ని బహిరంగంగా తెలియజేసినప్పటికీ కొంతమంది వ్యక్తులు, పత్రికల వారు కావాలని వివాదాస్పదం చేస్తున్నారన్నారు.

## రొయ్యల రైతుల సంక్షేమమే

# ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత

- పారదర్శకత, శాస్త్రీయ విధానాలతో స్థిరత్వం తీసుకొస్తాం
- వ్యవసాయ,మత్స్యశాఖల మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి/విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రం లోని రొయ్యల రైతుల సంక్షేమాన్ని పరిరక్షించడం కూటమి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రొయ్యల ఫీడ్ ధరలు, రొయ్యల కొనుగోలు ధరలు, ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులు, ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులు, ఎగుమతిదారులు, శాస్త్రవేత్తలు, సంబంధిత శాఖల అధికారులతో బుధవారం పెనమలూరులోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు సంక్షేమానికే పెద్దపీట వేస్తుందని, ముఖ్యంగా రొయ్యల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు శాశ్వత పరిష్కారాల అమలుకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామన్నారు. ఈ లక్ష్యంతో అన్ని వర్గాల భాగస్వాములతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తూ, ఆచరణ సాధ్యమైన, శాస్త్రీయ ఆధారిత విధానాలను రూపొందించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. రొయ్యల ఫీడ్ ధరల నిర్ణయంలో పూర్తి పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ముడి పదార్థాల వాస్తవ ధరలు, శాస్త్రీయ ప్రమాణాలు, నిపుణుల సిఫార్సుల ఆధారంగా ఫీడ్ ధరలను నిర్ణయించే పారదర్శక విధానాన్ని అమలు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, వాస్తవ పరిస్థితులపై రైతులకు ఎప్పటికప్పుడు సరైన సమాచారం అందించాలని, అపోహలు, తప్పుడు ప్రచారానికి తావులేకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. రొయ్యల సాగు వ్యయాన్ని తగ్గించేందుకు అవసరమైన విధానపరమైన అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నిరంతర సమన్వయం కొనసాగించాలని సూచించిన మంత్రి, ఫీడ్ తయారీలో కీలకమైన సోయాబీన్ మీల్ దిగుమతులు, దేశీయంగా ఫిష్ మీల్ లభ్యత పెంపువంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర ప్రతిపాదనలు పంపి అవసరమైన విధానపరమైన మద్దతు పొందేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని ఆక్వాకల్చర్ రంగం ప్రపంచస్థాయిలో మరింత పోటీతత్వాన్ని సాధించాలంటే రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ యంత్రాంగం పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ఆదాయం పెరగడం, ఉత్పత్తి వ్యయం తగ్గడం, ఆక్వాకల్చర్ రంగం దీర్ఘకాలికంగా స్థిరపడేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. చివరగా మంత్రి మాట్లాడుతూ, రైతు సంక్షేమం, ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పారదర్శక విధానాలు, శాస్త్రీయ నిర్ణయాలు, అన్ని వర్గాల సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల్లో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## కేఎల్ రావు కల పట్టిసీమతో సాకారం




- ఆ ఘనత సీఎం చంద్రబాబుదే..
- నదుల అనుసంధానమే దేశ సుభిక్షతకు మార్గం
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు

విజయవాడ (చైతన్య రథం): భారతదేశ నదుల అనుసంధాన పితామహుడు, ప్రముఖ జలవనరుల నిపుణుడు కెఎల్ రావు 125వ జయంతి సందర్భంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీవద్ద ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌస్‌లోని ఆయన విగ్రహం వద్ద జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో కరువు నివారణకు, నీటి వనరుల సమగ్ర వినియోగానికి నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని దశాబ్దాల క్రితమే కేఎల్ రావు ప్రతిపాదించారని గుర్తు చేశారు. గంగ, మహానది, గోదావరి, కృష్ణా, కావేరి నదులను అనుసంధానిస్తూ "గార్లాండ్ ఆఫ్ రివర్స్" అనే మహత్తర భావనను ప్రపంచానికి పరిచయం చేసిన దూరదృష్టి కలిగిన మహాను భావుడు కేఎల్ రావు అని కొనియాడారు. ఆయన ఆశయాలకు స్ఫూర్తిగా మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు సాగారని, అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి-కృష్ణా నదులను అనుసంధానం చేసి చరిత్ర సృష్టించారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఏటా సముద్రంలో కలిసిపోతున్న గోదావరి వరద జలాలను పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి మళ్లించి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేయడంతోపాటు, శ్రీశైలం జలాశయంలో నీటిని నిల్వ చేసి రాయలసీమకూ సాగు, తాగునీటి భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం విజయవంతంగా అడుగులు వేసిందన్నారు. కేఎల్ రావు జయంతి రోజున పవిత్ర సంగమం వద్ద గోదావరి వరద జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు హారతి ఇచ్చి స్వాగతం పలకడం ఆయనకు అందించే నిజమైన నివాళిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా పట్టిసీమ ప్రాజెక్టుపై గతంలో వచ్చిన విమర్శలను ప్రస్తావించిన మంత్రి, ఒకప్పుడు ఈ ప్రాజెక్టును విమర్శించిన వారు నేడు దాని ఫలితాలను చూసి సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కృష్ణా డెల్టా, రాయలసీమ ప్రాంతాలకు పట్టిసీమ వరప్రదాయినిగా నిలిచిందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చిన మంత్రి, కేఎల్ రావు తనయుడు విజయ్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందదాయకమని, కూటమి ప్రభుత్వం తరపున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి , కృష్ణా డెల్టా సిఈ రాంబాబు, ఇరిగేషన్ ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# మానవత్వానికి నిలువుటద్దం చమన్ సాబ్

- ప్రజా నాయకునిగా గుర్తింపు తెచ్చింది ఆ సద్గుణమే
- టీడీపీలో పరిటాల రవీంద్ర, చమన్ పాత్ర సదాస్మరణీయం
- భవిష్యత్ యువ నాయకులకు చమన్ సాబ్ జీవితం ఆదర్శప్రాయం
- అనంతపురంలో చమన్ సాబ్ జయంతి వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర



అనంతపురం (చైతన్య రథం): జీవితాంతం ప్రజల కోసం, ప్రజల బాగుకోసం తపించిన నయకుడు చమన్ సాబ్ అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనంత పురంలో నిర్వహించిన చమన్ సాబ్ జయంతి వేడుక ల్లో రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎంఏ షరీఫ్‌తో కలిసి పాల్గొన్నారు. కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిం చారు. అనంతరం మంత్రి కొల్లు మాట్లాడుతూ.. "చమన్ సాబ్ చేసినపోరాటాలు, ఆయన మానవత్వమే ఇంత మందిని అభిమానులుగా చేసింది. చమన్ జయంతి కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టం. బడుగు బలహీనవర్గాలపట్ల ఆయన చూపిన ఔదార్యం ఎనలేనిది.పరిటాల రవీంద్ర మరణంతర్వాత అజ్ఞాతం లోకి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చినా.. బెదిరింపుల్ని ఎదురొడ్డి ప్రజాక్షేత్రంలో నిలబడ్డారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా జిల్లా అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. నాలాంటి ఎంతోమంది యువ రాజకీయ నాయకులకు అనేక సలహాలు సూచనలతో ముందుకు నడిపించారు" అని స్మరించకున్నారు.

"రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రాజధానిగా అమరావతి కొనసాగడానికి ప్రధాన కారణం ఎం.ఎ.షరీఫ్. శాసన మండలిలో కొంతమంది వైసీపీ నాయకులు అనేక రకాలుగా వేధించినా, అమానుష పదజాలంతో మానసిక క్షోభకు గురి చేసినా వెనక్కి తగ్గకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడారు. రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి బాటలో నడిపిస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలి. పెట్టుబడులు రాబట్టాలి. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం. మంత్రి నారా లోకేశ్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా.. ప్రభుత్వ స్కూల్ విద్యార్థుల ఫోటోలతో పత్రికల్లో ప్రకటనలు వచ్చాయి. పేరెంట్ టీచర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నాం. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పదో తరగతి ఫలితాల్లో రికార్డులు సృష్టించాం. ప్రభుత్వ హాస్టల్స్ అన్నింటినీ రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చాలని నిర్ణయించాం" అని స్పష్టం చేశారు.

"గతంలో ఐటీపై పెట్టిన శ్రద్ధతో దేశంలో ఐటీ విప్లవం మొదలైంది. ప్రపంచంలో కొద్దిమంది మాత్రమే క్వాంటం కంప్యూటింగ్ గురించి మాట్లాడుతున్న సమయంలో.. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన ఘనత నారా చంద్రబాబు నాయుడిది. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలు పెట్టుబడులకు తగ్గట్లుగా మనం స్కిల్ సాధించాలి. గత ఐదేళ్లు ఏపీకి పరిశ్రమలు రావాలంటే భయపడే పరిస్థితి నుండి.. నేడు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కట్టే పరిస్థితి తీసుకొచ్చాం. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25శాతం ఏపీకి వచ్చేలా చేశా"మని మంత్రి కొల్లు పేర్కొన్నారు.

"పుట్టపర్తిలో లక్ష కోట్లతో డిఫెన్స్ యుద్ధ విమానాల తయారీ సంస్థ ఏర్పాటుకాబోతోంది. ఇదే అనంతపురంలో రాయల్ ఎన్ ఫీల్డ్ పరిశ్రమ ఏర్పాట వుతోంది. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి అండగా నిలవడం లక్ష్యంగా 26 పాలసీలు తీసుకొచ్చాం. ఎడారిగా మారిన అనంతపురం జిల్లాలో కృష్ణా జలాలు పారిస్తున్నాం. నందమూరి తారకరామా రావు ఆశయాల సాధన లక్ష్యంగా.. అనంతపురం జిల్లాను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నాం. రామగిరి లో గోల్డ్ మైన్ గుర్తించాం. త్వరలోనే పనులు ప్రారం భించబోతున్నాం. కర్నూలు జిల్లా జొన్నగిరిలో గత నెలలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించాం. దేశంలోనే అత్యధికంగా బంగారం ఉత్పత్తి చేసే రాష్ట్రంగా ఏపీని అభివృద్ధి చేసుకుంటున్నాం. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. పరిటాల రవీంద్ర, చమన్‌లా పరిటాల శ్రీరాం.. ఒమర్ ఉంటారని ఆశిస్తున్నాం" అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, పరిటాల శ్రీరాం, ఒమర్ తదితర నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే లక్ష్యంగా 'అభయ'

- పోలీసులు చేపట్టిన కార్యక్రమం అభినందనీయం
- సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి
- నియంత్రణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు
- శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ
- 'అభయ'ను ప్రారంభించిన హోంమంత్రి అనిత




నక్కపల్లి (చైతన్య రథం): మహిళల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు "మీ భద్రత-మా బాధ్యత" అనే నినాదంతో చేపట్టిన 'అభయ' కార్యక్రమాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత అభయ ఫిర్యాదుల బాక్స్‌ను ప్రారంభించడంతో పాటు, అభయ పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళలు, విద్యార్థినులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు జిల్లావ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయనున్నట్టు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు చేపట్టిన 'అభయ' కార్యక్రమం అభినందనీయమన్నారు. మహిళలకు ధైర్యాన్ని నింపడంతో పాటు, వారిలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తోందని పేర్కొన్న హోంమంత్రి, ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, చదువే జీవితంలో ఉన్నతస్థాయికి తీసుకెళు తుందన్నారు. ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షణను విస్తృతంగా చేపడుతున్నామని హోంమంత్రి తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి పాఠశాల, కళాశాలలో అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేసి భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.



# దామచర్ల సేవలు చిరస్మరణీయం

- దశాబ్దాల సమస్యలకు పరిష్కారం చూపించారు
- ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- ఘనంగా మాజీ మంత్రి దామచర్ల జయంతి వేడుకలు

ప్రకాశం /తూర్పు నాయుడుపాలెం (చైతన్య రథం): మాజీమంత్రి దామచర్ల ఆంజనేయులు సాధారణ రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 97 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి డిఎస్ బీవీ స్వామి, మ్యారిటైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య ఎన్టీఆర్, అంబేద్కర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ....దామచర్ల ఆంజనేయులు సాధారణ రైతు కుటుంబంలో పుట్టి రాజకీయాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారు. నిజాయితీ గల వ్యక్తి వ్యక్తిత్వం, ముక్కుసూటి తత్వం దామచర్ల ఆంజనేయులు సొంతం. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా ఈ ప్రాంత ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం.

ఈ ప్రాంతంలో దామచర్ల ఆంజనేయులు చేసిన అభివృద్ధి నేటికీ మన కళ్ళ ముందు కనిపిస్తోంది. కొండపి నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిలు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాన్ని సులభతరం చేశారు. ఈ ప్రాంతంలో దశాబ్దాల తరబడి ఉన్న సమస్యలకు దామచర్ల ఆంజనేయులు పరిష్కారం చూపించారు. ఈ ప్రాంత ప్రజల గుండెల్లో పెద్దాయనగా దామచర్ల ఆంజనేయులు చిరస్థాయిగా నిలిచిపోయారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కొనియాడారు.



# త్వరలోనే రామగిరి గోల్డ్ మైన్ అందుబాటులోకి

- ఖనిజ సంపద వినియోగంతో ఉపాధి, ఆదాయం పెంపే లక్ష్యం
- మైనింగ్ రంగాన్ని ఆర్థిక రంగానికి వెన్నుదన్నుగా నిలుపుతాం
- దేశంలోనే అత్యంత లాభదాయక మైన్: మంత్రి కొల్లు



అనంతపురం (చైతన్య రథం): రామగిరి గోల్డ్ మైన్‌ను త్వరలోనే వేలంవేసి ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. అనంతపురం జిల్లా రామగిరి మండలంలోని గోల్డ్ మైన్ ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజుతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అపార ఖనిజ సంపద కలిగిన రాష్ట్రం. మన రాష్ట్రంలో ఉన్న విలువైన వనరుల్ని సద్వినియోగం చేసుకుంటే దేశానికే ఆదర్శంగా మైనింగ్ రంగాన్ని తీర్చిదిద్దగలమన్నారు. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ రంగం పూర్తిగా నిర్వీర్యమైంది. కొత్త ఖనిజ నిల్వలను గుర్తించే ప్రయత్నాలు చేయకుండా ఉన్న గనులను దోచుకున్నారని విమర్శించారు. రామగిరి గోల్డ్ మైన్‌లో బ్రిటిష్ కాలంనుంచే బంగారం తవ్వకాలు జరిగాయి. భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ లీజు గడువు ముగిసిన తర్వాత పూర్తిగా కార్యకలాపాలు నిలిచిపోయాయి. సుమారు 168 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న గనిలో గతంలో భారీగా ముడిసరుకు ఉన్నప్పటికీ ప్రస్తుతం అది కనిపించకపోవడంపై అనేక అనుమానాలున్నాయి. సుమారు 4.6 లక్షల టన్నుల డంప్ మెటీరియల్ ఉండాల్సి ఉండగా, అది తరలించబడిందనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులతో పూర్తిస్థాయి విచారణకు ఆదేశాలిచ్చాం. అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొల్లు వెల్లడించారు.

"రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ అన్వేషణ కార్యక్రమాలు వేగవంతం చేశాం. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ కన్సల్టెన్సీ లిమిటెడ్ (ఎంఈసీఎల్) నివేదికల ఆధారంగా బంగారం, ఇనుప ఖనిజం, మాంగనీస్, బ్రారైటీస్, ఇతర విలువైన ఖనిజాల గుర్తింపును వేగవంతం చేశాం. ఇటీవల కర్నూలు జిల్లా జొన్నగిరి గోల్డ్ మైన్‌లో ఉత్పత్తి ప్రారంభమై రోజుకు సుమారు కిలో బంగారం ఉత్పత్తి అవుతోంది. రామగిరి ప్రాంతంలో టన్నుకు సగటున నాలుగు గ్రాముల వరకు బంగారం లభించే అవకాశముందని నివేదికలు చెబుతున్నాయి. అదే జరిగితే రాష్ట్రంలోని గోల్డ్ మైన్స్‌లో ఇదే అత్యంత లాభదాయకమైన గని అవుతుంది. రామగిరి, చిగురుగుంట తదితర ప్రాంతాలను మూడు బ్లాకులుగా విభజించి వేలం ప్రక్రియకు సిద్ధం చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వంనుంచి అనుమతులు రాగానే టెండర్లు పిలిచి తక్షణమే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటా"మని మంత్రి వెల్లడించారు.

"బీచ్ సాండ్ మినరల్స్, ఐరన్ ఓర్, ఇతర కీలక ఖనిజాల అభివృద్ధిపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు ప్రభుత్వ ఆదాయాన్ని కూడా గణనీయంగా పెంచే దిశగా మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేస్తున్నాం. వైసీపీ హయాంలో మైనింగ్ ఆదాయం సింగిల్ డిజిట్‌కి పరిమితమైతే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో మైనింగ్ ఆదాయం 32 శాతానికి పెంచామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

### జగన్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

రోడ్డు ప్రమాదాల కేసుల్లో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనం. ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటనలో నిందితుడిపై కేసు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం సహజం. అలాంటి సందర్భంలో "18 ఏళ్ల యువకుడిపై కేసు పెడతారా" అనే వ్యాఖ్యలు చేయడం మాజీ ముఖ్యమంత్రికి తగదు. గతంలో కోడికత్తి కేసులో నిందితుడు ఐదేళ్లపాటు జైలులో ఉన్నప్పటికీ జగన్ కోర్టుకు వెళ్లి వాంగ్మూలం ఇవ్వలేదు. ఇప్పుడు హత్య చేసిన వారిపై కేసు పెట్టడమే తప్పు అనేలా వ్యవహరిస్తున్నాడు. ప్రజాస్వామ్యంలో చట్టాలకంటే ఎవరూ గొప్పవారు కారనే విషయాన్ని జగన్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని మంత్రి కొల్లు హెచ్చరించారు.

విశాఖపట్నం సముద్ర ప్రమాద ఘటనలో ప్రభుత్వం వెంటనే స్పందించి కోస్ట్‌గార్డ్, నేవీ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టిందని, బాధిత కుటుంబాలకు వెంటనే ఆర్థిక సాయం అందించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిహారాలు మంజూరు చేయకుండా పెండింగులో పెట్టిన మత్స్యకారులకు కూడా కూటమి ప్రభుత్వం పరిహారం విడుదల చేసింది. ఆక్వా రైతులకు రాయితీ విద్యుత్, ఇతర ప్రోత్సాహకాలు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. మరోవైపు పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి వివరించారు. పుట్టపర్తిలో డిఫెన్స్ విమానాల తయారీ పరిశ్రమ, అనంతపురంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ విస్తరణ, కడపలో దాల్మియా సిమెంట్ విస్తరణ, విశాఖలో కొత్త పరిశ్రమల ఏర్పాటువంటి ప్రాజెక్టులతో రాష్ట్రంలో భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. అమరావతి రాష్ట్ర రాజధానిగా కొనసాగుతుందని, మూడు ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.

# జగన్ క్షమాపణలు చెప్పాలి

- చంద్రబాబును ఉద్దేశించి మాట్లాడే అర్హత అతనికి లేదు
- జగన్‌రెడ్డిది మత్స్యకారులను మభ్యపెట్టే ప్రయత్నం
- ఆక్వా రైతులకు జగన్ చేసింది శూన్యం..
- జగన్ ధోరణి మారకుంటే వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు గల్లంతు
- మంత్రి కొడుకుకి ఒక న్యాయం? సామాన్యుడికి ఒక న్యాయమా?
- మీడియా సమావేశంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విజయనగరం (చైతన్య రథం): మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్ రెడ్డి భీమవరంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మాట్లాడిన మాటలకు క్షమాపణ చెప్పి మాటలు వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ,చిన్న,మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా మిత్రుల సమావేశంలో పలు విషయాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి దుర్భాషలాడడం సిగ్గుచేటని మంత్రి విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న ప్రజా ప్రతినిధి విధానపరంగా విమర్శలు చేయాలి కానీ నోటికి ఏది వస్తే అది మాట్లాడకూడదని హితవుపలికారు. జగన్ రెడ్డి మాట్లాడిన మాటలను ఖండిస్తున్నామన్నారు. విలువలతో కూడిన మాటలతో రాజకీయాలు నడిపించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ ఒక్కరిని కించపరుస్తూ మాట్లాడినా ఊరుకోరని, వ్యక్తిగతంగా దూషణలు చేయవద్దని చెబుతారన్నారు.కానీ వైకాపా అధినేత, నాయకులు అడ్డదిడ్డంగా మాట్లాడతారన్నారు.మత్స్యకారుల విషయంలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, ప్రభుత్వం గల్లంతైన బోటు విషయంలో తక్షణ చర్యలు చేపట్టడంతోపాటు అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం చిన్న అనే వ్యక్తిని కాపాడటంతో పాటు విస్తృతమైన గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం గతంలో పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి ఎగనామం పెట్టిందన్నారు.అధికారం కోల్పోయాక ప్రస్తుతం మత్స్యకారుల వద్దకు వచ్చి కొత్త బోటు... కోటి రూపాయలు అంటూ... నాటక మాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారతతో తక్షణమే పది లక్షల రూపాయలు అందజేసి గల్లంతయిన మత్స్యకారుల కుటుంబాలను ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రాణానికి విలువ కట్టడం కాదని... కష్టంలో ఉన్న కుటుంబాన్ని ఆర్థిక సహాయం అందించి ఆదుకోవడం అన్నారు. వైకాపా ప్రభుత్వంలో ప్రమాదాల్లో చనిపోయిన ఏ ఒక్క మత్స్యకార కుటుంబానికి కూడా పరిహారం చెల్లించలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం జగన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారని, కల్లబొల్లి మాటలు నమ్మవద్దని రైతులకు హితవు పలికారు. ఆక్వా రైతులకు రూపాయన్నరకే కరెంటు అందజేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కొందరికి మాత్రమే ఇచ్చిన ఘనుడు జగన్ రెడ్డి అన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆక్వా రైతులందరికీ కూడా రెండున్నరకే యూనిట్ విద్యుత్ సరఫరా అందించడం జరుగుతుందన్నారు. జగన్ రెడ్డికి నచ్చిన ఎలాంటి విషయాన్నైనా సమర్థిస్తారని, దానికి తార్కాణమే... తెలంగాణలో నేరం చేసిన వ్యక్తిని ఎన్‌కౌంటర్ చేస్తే... అసెంబ్లీ సాక్షిగా అభినందించిన జగన్.. విజయవాడలో అనేక నేరాలు చేసిన యువకుడిని, అలాగే రోడ్డు ప్రమాదంచేసి ఒకరి మృతికి కారణమైన మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడిని సమర్థించడాన్నీ నేడు ఆంధ్రదేశ ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. సొంత వారిని, తనకు కావలసిన వారిని జగన్ రెడ్డి కేసుల నుంచి కాపాడటం కోసంచట్టాన్ని ఉపయోగిస్తారని..., సొంత వారికి ఒక చట్టం.. బయటి వారికి ఒక చట్టం అని... అది జగన్ నైజం అన్నారు. జగన్ ఇదే వరవడితో ఉంటే ఈసారి 11 సీట్లు కాదు...కదా!డిపాజిట్లు కూడా రావు అని మంత్రి కొండపల్లి ఎద్దేవా చేశారు. పరిపాలన చేసే ఏ నాయకులైనా ప్రజలకు మంచి చేసే విధంగా ఉండటంతో పాటు భవిష్యత్తును చూపించాలన్నారు. ప్రజల్లో ధైర్యం నింపే బాధ్యత అధికారంలో ఉన్న పార్టీతోపాటు ప్రతిపక్ష పార్టీకి కూడా ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గుర్తు చేశారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**హోంమంత్రి వంగలపూడి అనిత**

**నక్కపల్లి క్యాంపు కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహణ**



నక్కపల్లి (చైతన్య రథం): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించి, సమస్యలను ఓర్పుగా విని సంబంధిత అధికారులకు తక్షణ చర్యల కోసం ఆదేశాలు జారీ చేశారు. పాయకరావుపేట నియోజకవర్గంతో పాటు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను హోంమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సుమారు 100 మంది ప్రజలు పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్యుత్, రెవెన్యూ, పింఛనులు తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడిన హోంమంత్రి అనిత, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించగలిగిన కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా, మిగిలిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పాలన అందించడం, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం ప్రభుత్వ ప్రాధాన్యమని తెలిపారు. ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి కే. సచిదేవి, యంగ్ ప్రొఫెషనల్ జయరాం మోరంపూడి, నియోజకవర్గ ముఖ్య నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముంబయి ఆసుపత్రినుంచి పవన్ కళ్యాణ్ డిశ్చార్జ్

- హైదరాబాద్‌లోని నివాసానికి చేరుకోనున్న డిప్యూటీ సీఎం
- వైద్యుల సూచన మేరకు మూడు వారాల తరువాత ఫిజియోథెరపీ

ముంబయి (చైతన్య రథం): ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొద్దిసేపటి క్రితం ఆసుపత్రినుంచి డిశ్చార్జ్ అయ్యారు. శస్త్ర చికిత్సనుంచి కోలుకుంటున్న ఆయన డిశ్చార్జ్ అనంతరం నేరుగా హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకుంటారు. మూడువారాల తరువాత నుంచి ఫిజియోథెరపీ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఆపరేషన్ చేసిన భుజం సాధారణ స్థితికి చేరుకోవడానికి నాలుగు నెలల సమయం పడుతుందని వైద్యులు వెల్లడించారు.



# ఎన్డీయే కోఆర్డినేషన్ కమిటీ భేటీ

- హాజరైన పల్లా, మాధవ్, మనోహర్
- స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృత చర్చ



తాడేపల్లి (చైతన్య రథం): అమరావతి తాడేపల్లిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎన్డీఏ కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనే కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. అలాగే రాష్ట్ర, జిల్లాస్థాయి ఎన్డీఏ సమన్వయ కమిటీల ఏర్పాటు, కూటమి పార్టీల మధ్య సమర్థవంతమైన సమన్వయం, క్షేత్రస్థాయిలో ఉమ్మడి కార్యాచరణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అదేవిధంగా ఏపీలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై కూడా సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేలా ప్రజలకు అవగాహన కల్పించడం, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయడం, ప్రతి అర్హులైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవడంవంటి అంశాలపై నాయకులు చర్చించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయమే లక్ష్యంగా అన్ని భాగస్వామ్య పార్టీలు సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

# ప్రపంచం గర్వించదగ్గ గాయని జానకి

### స్మృత్యంజలి సభలో మంత్రి కందుల దుర్గేష్



విజయవాడ (చైతన్య రథం): భౌతికంగా సుప్రసిద్ధ గాయని ఎస్. జానకి మన మధ్య లేకపోయినా ఈ జగత్తు ఉన్నంతకాలం ఆవిడ పాట మారుమ్రోగుతూనే ఉంటుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

బుధవారం విజయవాడలోని దుర్గాపురంలో ఘంటసాల వెంకటేశ్వర రావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి, భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాన కోకిల శ్రీమతి ఎస్. జానకి స్మృత్యంజలి కార్యక్రమంలో మరియు కేంద్ర సంగీత నాటక అకాడమీ, భారత, ఏపీ ప్రభుత్వాల సాంస్కృతిక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వందేమాతరం 150 సంవత్సరాల పండుగ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమతి గోకరాజు లైలా గంగరాజు కళా వేదికపై ఏర్పాటు చేసిన ప్రముఖ గాయని ఎస్. జానకి చిత్రపటానికి పూలమాల వేసి మంత్రి దుర్గేష్ ఘన నివాళులు అర్పించారు. అదే విధంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ దాదాపు 17 భాషల్లో 48 వేలకు పైగా పాటలు ఆలపించి, భారతీయ చలన చిత్ర రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సృష్టించుకున్న ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గాయని ఎస్. జానకి మన గుంటూరు జిల్లా రేపల్లె తాలూకా వాసి కావడం తెలుగువారందరికీ గర్వకారణమన్నారు. ఆమె మరణం సంగీత సామ్రాజ్యానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లల గొంతు నుండి పండు ముసలి స్వరం వరకు ఏ గొంతునైనా అద్భుతంగా అనుకరించగల ఏకైక గాయని ఆమె అని కొనియాడారు. ఈ సందర్భంగా 'బాల మిత్రుల కథ' చిత్రంలోని "గున్నమామిడి కొమ్మమీద", 'ప్రతిఘటన' లోని "ఈ దుర్యోధన దుశ్శాసన..." వంటి ప్రసిద్ధ గీతాలను ఆయన గుర్తుచేసుకున్నారు. ఎన్నో జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు అందుకున్న ఆమె, విభిన్న భాషల శ్రోతలను తన గాత్రంతో మైమరిపించారని చెప్పారు. గాయని జానకి తన జీవిత ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులను వివరిస్తూ మంత్రి భావోద్వేగానికి లోనయ్యారు.

**వందేమాతరం గీతం దేశభక్తికి నిలువెత్తు నిదర్శనం: దుర్గేష్**

మహోన్నతమైన 'వందేమాతరం' గీతం ఆలపించడం ప్రారంభించి 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆ గీత విశిష్టతను మరియు చారిత్రక ప్రాశస్త్యాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. బంకించంద్ర చటర్జీ కలం నుండి జాలువారిన వందేమాతరం గీతం స్వాతంత్ర్య సమరంలో కోట్ల మందిలో దేశభక్తిని రగిలించిందని ఆయన గుర్తుచేశారు. నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛా వాయువులు ఎందరో త్యాగధనుల ప్రాణత్యాగాల ఫలితమేనని మంత్రి పేర్కొన్నారు.

ఈ వేడుకల్లో భాగంగా మాజీ ప్రధాని స్వర్గీయ పి.వి. నరసింహారావు రచించిన నాటిక ఆధారంగా దర్శకుడు ఫణీంద్ర, ఎమ్.ఎస్. చౌదరిల నేతృత్వంలో రూపొందించిన "అమరావతికి ఆమడ దూరంలో వందేమాతరం గర్జన" అనే సాంఘిక నాటకాన్ని మంత్రి తిలకించి, ప్రదర్శనను ఎంతగానో అభినందించారు. ఇలాంటి వైవిధ్యభరితమైన కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా జాతీయతను పెంపొందించడం మరియు యువతలో దేశభక్తిని రగిలించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సగర్వంగా 'వందేమాతరం' అని నినదించారు. రాబోయే రోజుల్లో పాఠశాలలు, కళాశాలల్లో సైతం ఇలాంటి దేశభక్తి పూరిత కార్యక్రమాలను విస్తృతంగా ప్రదర్శించి, నేటి తరానికి స్ఫూర్తిని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం, కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణను, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు శ్రీమతి ఎస్.పి. భారతిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. సంగీతం, నాటకం మరియు లలిత కళల ద్వారా సమాజంలో జాతీయ భావాన్ని, దేశభక్తిని మరింత బలంగా పెంపొందించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లికార్జునరావు, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ మెంబర్ ఎస్.పి. భారతి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షులు అంబటి మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం కళాకారులకు మంత్రి దుర్గేష్ పురస్కారాలు ప్రదానం చేసారు.





## సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషల్ మెజిస్ట్రేట్ల నియామకాలు రెండేళ్ల వ్యవధితో చేపట్టాలి

- న్యాయశాఖ మంత్రి ఫరూక్‌కు సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషల్ మెజిస్ట్రేట్ల విజ్ఞప్తి
- న్యాయవాదులకు రక్షణ చట్టం, ఆరోగ్య భీమా కల్పించాలని కోరిన ఐఎల్ఏ ప్రతినిధులు

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ల (సెకండ్ క్లాస్) నియామకాలను రెండేళ్ల కాల వ్యవధితో చేపట్టాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను పలువురు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లు కోరారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్‌లో న్యాయ, మైనారిటీ మంత్రిత్వ శాఖ కార్యాలయంలో మంత్రి ఫరూక్‌ను మేజిస్ట్రేట్‌లు కలిశారు. ప్రస్తుతం ఒక ఏడాది వ్యవధితో జరుగుతున్న స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌ల నియామకాలవల్ల కలుగుతున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు. నియామకాలలో, కేసుల నిర్వహణలో జాప్యాన్ని నివారించాలనే ఉద్దేశ్యంతో స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ల నియమిత కాలాన్ని ప్రస్తుత ఒక సంవత్సర వ్యవధినుండి రెండేళ్లకు పెంచేందుకు వీలుగా ముఖ్యమంత్రి చొరవతో అసెంబ్లీలో బిల్లు నంబర్ 18/2025ని తీర్మానించి భారత రాష్ట్రపతి ఆమోదానికి రిజర్వు చేయబడినదని.. త్వరలో ఈ బిల్లు అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

**మంత్రిదృష్టికి న్యాయవాదుల సమస్యలు**

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) ప్రతినిధులు న్యాయ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులకు, కుటుంబ సభ్యులకు ఉచితంగా సమగ్ర ఆరోగ్య బీమా కవరేజీని ప్రభుత్వం అందించాలని, నగదురహిత ఆరోగ్య బీమా కార్డులను అందించాలని కోరారు.

అర్హులైన జూనియర్ న్యాయవాదులందరికీ, వారు నమోదు చేసుకున్న తేదీనుంచి ఐదేళ్ల కాలానికి నెలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం మంజూరు చేయాలని కోరారు. న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులను నిర్వర్తిస్తున్నప్పుడు, దాడులు, బెదిరింపులకు గురవుతున్నారని ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు.

న్యాయవాదులకు ఇళ్లస్థలాల కేటాయింపుపైనా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్‌ను ఐఎల్ఏ ప్రతినిధులు కోరారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ రూపొందించే విషయంలో ఏపీ బార్ కౌన్సిల్ నుండి ప్రతిపాదనలు కోరడమైనదని, మిగతా విషయాలపై న్యాయశాఖ కార్యదర్శితో చర్చించి ప్రణాళిక బద్ధమైన చర్యలు తీసుకుంటామని న్యాయవాదులకు మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

# పోర్టుల అభివృద్ధే లక్ష్యం

- వైసీపీ ప్రైవేటీకరణ ప్రచారం అవాస్తం
- 'రామాయపట్నం'పై అబద్ధాల ప్రచారం తగదు
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వైసీపీ కుట్ర
- పీపీపీలో ప్రభుత్వ హక్కులకు ఎలాంటి భంగం లేదు..
- ప్రభుత్వ వాటా, హక్కులు యథాతథం
- మీడియా సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పష్టం




అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర ప్రభుత్వం పోర్టుల అభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు ఉపాధి కల్పన అనే లక్ష్యాలతో అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న పీపీపీ విధానంపై కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారం చేయడం అత్యంత దురదృష్టకరమని రోడ్లు భవనాల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేకించి రామాయపట్నం పోర్టును ప్రైవేటుకు అప్పగిస్తున్నారని, ప్రభుత్వ ఆస్తులను విక్రయిస్తున్నారని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు సృష్టించడం తప్ప దీనిలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి మీడియాతో మాట్లాడుతూ పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు, ప్రభుత్వ ఆస్తులను విక్రయించడం కాదు, ప్రభుత్వ హక్కులను వదులుకోవడం అసలే కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ యాజమాన్యంలోని మౌలిక వసతులను మరింత సమర్థవంతంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్వహించేందుకు ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న పరిపాలనా విధానమే పీపీపీ అని వివరించారు.

### పీపీపీ విధానంలో ప్రభుత్వ హక్కులకు ఎలాంటి భంగం ఉండదు

ప్రయివేట్ పబ్లిక్ పార్టనర్‌షిప్ విధానంలో పోర్టు యాజమాన్యం, భూమి, సముద్రతీర హక్కులు, భద్రత, విధాన నిర్ణయాలు, టారిఫ్‌లు, చట్టబద్ధ నియంత్రణలు, పర్యావరణ ప్రమాణాలు సహా అన్ని కీలక అధికారాలు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయన్నారు. ప్రైవేట్ భాగస్వామి ప్రభుత్వ నిర్దేశించిన షరతులకు లోబడి ఆపరేషన్స్, మెయింటెనెన్స్ నిర్వహణ బాధ్యతలను మాత్రమే నిర్వర్తిస్తాడన్నారు. ఒప్పంద నిబంధనలను ఉల్లంఘించినట్లయితే జరిమానాలు విధించే అధికారం, అవసరమైతే ఒప్పందాన్ని రద్దు చేసే పూర్తి హక్కు కూడా ప్రభుత్వానికే ఉంటుందన్నారు.అందువల్ల పీపీపీవిధానంలో ప్రభుత్వ హక్కులు ఏవిధంగానూ తగ్గవని, ప్రైవేటీకరణకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు.

### దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలవుతున్న విధానమే పీపీపీ

దేశంలోని విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, మెట్రో రైలు వ్యవస్థలు, పారిశ్రామిక పార్కులు, ప్రధాన పోర్టులు సహా అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులు పీపీపీ విధానంలో విజయవంతంగా కొనసాగుతున్నాయని మంత్రి గుర్తు చేశారు. ప్రపంచంలోని అత్యంత అభివృద్ధి చెందిన పోర్టుల విజయానికి ప్రభుత్వ పర్యవేక్షణ, ఆధునిక సాంకేతికత, సమర్థ నిర్వహణ, ప్రైవేట్ పెట్టుబడుల సమన్వయమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.

### పీపీపీ విధానంతో రాష్టానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు

పీపీపీ విధానం ద్వారా ప్రభుత్వంపై నిర్వహణ భారం తగ్గడంతోపాటు ప్రపంచస్థాయి సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక నిర్వహణ వ్యవస్థలు పోర్టులకు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు. దీంతో పోర్టుల నిర్వహణ సామర్థ్యం గణనీయంగా పెరిగి, నౌకల టర్న్‌రౌండ్ సమయం తగ్గడంతో లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలు మరింత వేగవంతమవుతాయని పేర్కొన్నారు. అలాగే దేశీయ, విదేశీ పెట్టుబడులు పెద్దఎత్తున ఆకర్షితమై, పోర్టుల పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక పార్కులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజ్‌లు, ఎగుమతి కేంద్రాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. దీనివల్ల స్థానిక యువతకు వేలసంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వానికి దీర్ఘకాలికంగా గణనీయమైన ఆదాయం సమకూరుతుందని మంత్రి వివరించారు.

### రామాయపట్నం పోర్టుపై అవాస్తవ ప్రచారానికి చెక్

రామాయపట్నం పోర్టు నిర్మాణం విషయంలో గత ప్రభుత్వం 95 శాతం పనులు పూర్తయ్యాయని ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. వాస్తవానికి 2024 జూన్‌నాటికి కేవలం 50 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిన తర్వాత గత రెండేళ్లలో మరో 30శాతం పైగా పనులను పూర్తి చేయడంతో ప్రస్తుతం మొత్తం పనుల పురోగతి సుమారు 80.50 శాతానికి చేరుకుందని వెల్లడించారు. అంతేకాక, గత ప్రభుత్వం మధ్యలో వదిలేసిన భూసేకరణ ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేసి ప్రాజెక్టుకు అవసరమైన భూములన్నింటినీ కూటమి ప్రభుత్వమే సమకూర్చిందని మంత్రి పేర్కొన్నారు.

### ప్రభుత్వ ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చే ఆర్థిక నిర్మాణం...

పీపీపీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వానికి దీర్ఘకాలికంగా అత్యధిక ఆర్థిక ప్రయోజనం చేకూరేలా ఒప్పంద నిబంధనలు రూపొందించినట్టు మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ప్రైవేట్ నిర్వాహకులు రూ.1,500 కోట్ల ముందస్తు ప్రీమియాన్ని రెండు విడతలుగా ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా, వేలంలో కోట్ చేసిన ఆదాయ వాటా ప్రభుత్వానికి లభించడంతో పాటు, 20వ సంవత్సరం నుంచి ప్రతి మూడేళ్లకు ఆ వాటా 1 శాతం చొప్పున పెరుగుతూ గరిష్ఠంగా 25 శాతానికి చేరుతుంది. అలాగే, కనీస హామీ ఆదాయం కింద పోర్టు నిర్వాహకులు ప్రతి ఏడాది కనీసం రూ.10 కోట్లనుంచి ప్రారంభమై కాలక్రమేణా రూ.150 కోట్ల వరకు ప్రభుత్వానికి తప్పనిసరిగా చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించడం ద్వారా రాష్ట్రానికి స్థిరమైన, దీర్ఘకాలిక ఆదాయం అందేలా చర్యలు తీసుకున్నామని మంత్రి వివరించారు.

### ప్రభుత్వ వాటా, హక్కులు యథాతథంగా కొనసాగుతాయి...

రామాయపట్నం పోర్టు ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్ మెరిటైమ్ బోర్డు (ఏపీఎంబీ) అన్ని దశల్లోనూ, మొత్తం 19 బెర్తులపై 12 శాతం నాన్-డైల్యూటబుల్ ఈక్విటీ వాటాను శాశ్వతంగా కొనసాగిస్తుందని మంత్రి తెలిపారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ వాటా తగ్గదని, భూమిని ప్రైవేట్ సంస్థకు విక్రయించడం కాకుండా లీజు ప్రాతిపదికన మాత్రమే వినియోగ హక్కులు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. అలాగే, పోర్టు విస్తరణకు ప్రైవేట్ సంస్థ చేసే ప్రతి పెట్టుబడిలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని, కాబట్టి దీనిని ప్రైవేటీకరణగా చిత్రీకరించడం ప్రజలను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించడమేనని మంత్రి పేర్కొన్నారు.

### వైసీపీకి మంత్రి సూటి ప్రశ్నలు...

ప్రస్తుతం పీపీపీ విధానంపై అసత్య ప్రచారం చేస్తున్న వైసీపీ, తమ పాలనలో తీసుకున్న నిర్ణయాలకు ముందుగా ప్రజలకు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. గంగవరం పోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉన్న 10.4 శాతం వాటాను అదానీ గ్రూప్‌కు విక్రయించింది అప్పటివైసీపీ ప్రభుత్వంకాదా? అలాగే 2023లో జెఎస్‌డబ్ల్యుకు రెండు బెర్తులను ఏ ప్రాతిపదికన కేటాయించారు? ఆ ప్రక్రియలో బహిరంగ బిడ్డింగ్ ఎక్కడ నిర్వహించారని, ప్రభుత్వానికి లభించే ఆదాయంపై ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేశారని ప్రశ్నించారు. ఆ సమయంలో మౌనం పాటించిన వారు, ఇప్పుడు పీపీపీ విధానంపై అసత్య ప్రచారం చేసి ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రజలను మోసం చేయడమేనని పేర్కొంటూ, ఈ ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పిన తర్వాతే ప్రభుత్వంపై విమర్శలు చేయాలని మంత్రి సూచించారు.

### వైసీపీకి అసలు సమస్య అభివృద్ధే...

పీపీపీ విధానం వైసీపీకి సమస్య కాదని, రాష్ట్ర అభివృద్ధే అసలు సమస్య అని మంత్రి తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం వారికి ఇష్టం లేదు. పరిశ్రమలు రావడం ఇష్టం లేదు. యువతకు ఉద్యోగాలు రావడం ఇష్టం లేదు. ప్రభుత్వ ఆదాయం పెరగడం ఇష్టం లేదు. ఆంధ్రప్రదేశ్ దేశంలో పోటీ రాష్ట్రంగా ఎదగడం వారికి నచ్చడం లేదు. అందుకే ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై అసత్య ప్రచారం చేయడం, ప్రజలను భయపెట్టడం, పెట్టుబడిదారులను నిరుత్సాహపరచడం వైసీపీ రాజకీయ అజెండాగా మారిందని మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

### అభివృద్ధే మా ప్రభుత్వ ధ్యేయం...

రాష్ట్ర ప్రభుత్వం పోర్టులను విక్రయించడం కాదని, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తోందని స్పష్టం చేశారు. ప్రభుత్వ హక్కులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకుండా, ప్రజల ప్రయోజనాలు, ప్రభుత్వ ఆదాయం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగేలా సమర్థవంతమైన పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. అసత్య ప్రచారాలతో అభివృద్ధిని అడ్డుకోవడం కాదు, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత శక్తివంతమైన పోర్టు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

### 2026 డిసెంబర్ నాటికి మూడు పోర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యం

రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు మరియు పెట్టుబడుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణపనులు ప్రస్తుతం 80.5శాతం పూర్తయ్యాయని, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతోందని, 2026 డిసెంబర్‌కు మూడు పోర్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

రామాయపట్నం పోర్టును ప్రపంచస్థాయి ఆల్-వెదర్, మల్టీ-కార్గో పోర్టుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. పోర్టు యాజమాన్యం, భూమి, విధానపరమైన నియంత్రణ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయని, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు అన్ని దశల్లో 12 శాతం నాన్-డైల్యూటబుల్ ఈక్విటీ వాటా కలిగి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు రూ.1,500కోట్ల ముందస్తు ప్రీమియం, ఆదాయ భాగస్వామ్యం, కనీస హామీ ఆదాయం వంటి ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించే నిబంధనలతో పారదర్శక పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు.

2,538.42 ఎకరాల్లో, 19 బెర్తులతో, 138.54 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో అభివృద్ధి చెందుతున్న రామాయపట్నం పోర్టు ద్వారా సుమారు రూ.20,000 కోట్ల పెట్టుబడులు, 25 వేల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ పోర్టు ఎగుమతి-దిగుమతి వాణిజ్యాన్ని విస్తరించడంతోపాటు పోర్టు ఆధారిత పరిశ్రమలు, లాజిస్టిక్స్ రంగం అభివృద్ధికి ఊతమిచ్చి, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి సముద్ర ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, మ్యారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణాదిత్య పాల్గొన్నారు.

# రోజుకు 280ఎంయు విద్యుత్ వినియోగం

- వాతావరణ సవాళ్లను సమర్థంగా ఎదుర్కుంటున్నాం
- దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం గాడిన పెడుతున్నారు
- వరుసగా రెండో ఏడాదీ ట్రూ డౌన్ అమలు
- ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి

అమరావతి (చైతన్య రథం): దేశంలో ట్రూ-అప్ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, ట్రూ-డౌన్ అమలు చేసిన ఏకైక ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర ఇంధన మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని, ఐదేళ్లపాటు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్రంలో వాతావరణ హెచ్చుతగ్గుల కారణంగా రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం




ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లకు తాత్కాలిక అంతరాయాలు ఏర్పడుతున్నా, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సరఫరాను పునరుద్ధరిస్తున్నారని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వల్పకాలంలోనే గాడిలో పెట్టారని మంత్రి పేర్కొన్నారు. ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను పటిష్టం చేస్తున్నామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం వేగంగా సాగుతోందని వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించిన రూ.6వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రస్తుతం వివిధ దశల్లో అమలవుతున్నాయని, నిర్ణీత గడువులో అవసరమైన అన్ని సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు.

# చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

## 'లెనిన్' విజయోత్సవంలో మంత్రి దుర్గేష్ భరోసా

గుంటూరు (చైతన్య రథం): హీరో అక్కినేని అఖిల్ కథానాయకుడిగా, దర్శకుడు మురళి కిషోర్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాతలు అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మించిన భారీ చిత్రం 'లెనిన్'. గ్రామీణ నేపథ్యంలో మహాభారతంలోని ఒక కీలక ఘట్టాన్ని బేస్ చేసుకొని తెరకెక్కిన చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించి బ్లాక్‌బస్టర్‌గా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం గుంటూరు నగరంలోని భాష్యం గ్రౌండ్స్‌లో అత్యంత వైభవంగా 'లెనిన్ బ్లాక్‌బస్టర్ సెలెబ్రేషన్స్' నిర్వహించింది. వేడుకకు రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్ర యూనిట్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



**పరిశ్రమ అభివృద్ధికి సింగిల్ విండో అనుమతులు, సమగ్ర జీవో: దుర్గేష్**

సభను ఉద్దేశించి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "లెనిన్ చిత్రం సూపర్ హిట్ సాధించడంపట్ల చిత్ర బృందానికి నా అభినందనలు. ఇలాంటి వైవిధ్యమైన సినిమాలు విజయం సాధించినప్పుడే చిత్ర పరిశ్రమ మరింత ముందుకు సాగుతుంది. మన ఏపీ గ్రామీణ వాతావరణం నేపథ్యంలో తీసిన సినిమా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. హీరో అఖిల్ నటన బాగుంది. ఆయన పడిన కష్టాన్ని, కఠోర శ్రమను స్క్రీన్‌పై స్పష్టంగా చూడవచ్చు. తన అద్భుత నటనతో లెగసీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారు. అఖిల్ మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. సినిమాలో హీరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ చక్కగా కుదిరింది. బ్రహ్మాజీ, ఈశ్వరీరావు, శివాజీ, గెటప్ శ్రీను తదితరులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. ఒక సినిమా హిట్ అయితే ఎందరికో ఉపాధి లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైజాగ్‌నుంచి తిరుపతి వరకు సినిమా రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. చిత్రాల షూటింగ్‌ల కోసం సింగిల్ విండో పద్ధతిలో అనుమతులు మంజూరు చేస్తున్నాం. పరిశ్రమ అభివృద్ధికి త్వరలోనే ఒక సమగ్ర జీవోను కూడా తీసుకురాబోతున్నాం. మౌలిక సదుపాయాల కల్పనలకు ముందుకొచ్చే వారికి భూములు ఇస్తాం" అని స్పష్టం చేసారు.

**పరిశ్రమకు కూటమి కొండంత అండ: నాగవంశీ**

చిత్ర నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. "మంత్రి కందుల దుర్గేష్ సినీ పరిశ్రమ సమస్యలను, ప్రగతిని ఎంతో నిశితంగా ఫాలో అప్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు అందిస్తున్న మద్దతు వెలకట్టలేనిది. ఏపీలో షూటింగ్‌లు సజావుగా సాగేలా ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కి చిత్ర యూనిట్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అన్నారు. ఈ వేదికగా అమరావతి చిత్ర కళావీధి పోస్టర్‌ను మంత్రి కందుల దుర్గేష్, హీరో అఖిల్, చిత్ర టీం, సాంస్కృతిక, సృజనాత్మక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి ఆవిష్కరించారు. భారీ జనసందోహం మధ్య జరిగిన వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు, ప్రముఖులు, భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేశారు.

# జగన్ మనస్తత్వం రాజకీయాలకు పనికిరాదు

- **అధికారంలో ఉన్నపుడు శాసనసభే అసాంఘిక శక్తుల నిలయమైంది**
- **నేరగాళ్లు, రౌడీ షీటర్లకు జగన్‌రెడ్డి మద్దతు**
- **క్రిమినల్ మనస్తత్వానికి అమర్నాథ్ గౌడ్ సజీవ దహనమే నిదర్శనం**
- **వ్యక్తి చావుకు కారణమైన సీదిరి కుమారుడిపై జాలిచూపడం ఆశ్చర్యకరం**
- **సంఘవిద్రోహ శక్తి 'ప్రశ్న రావణ్' వెనుక గొడ్డలి పార్టీ హస్తం**
- **టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ధ్వజం**

మంగళగిరి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగుపెట్టిన తర్వాత "రాజకీయ నాయకుడు" అనే పదానికి ఉన్న గౌరవం దెబ్బతిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ప్రజాప్రతినిధులంటే సమాజంలో ప్రత్యేక గౌరవం, బాధ్యత ఉండేదని, జగన్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆ విలువలన్నీ కనుమరుగయ్యాయన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజకీయాలను వ్యక్తిగత కక్షలు, ప్రతీకారాలు, అసత్య ప్రచారాలు, దౌర్జన్యాలతో కలుషితం చేశారని విమర్శించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న అధికారాన్ని అడ్డం పెట్టుకుని క్విడ్‌ప్రోకో ద్వారా జగన్ కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని, సీబీఐ దర్యాప్తులో ఇది వెలుగుచూసి 16 నెలలపాటు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు.

జైలు ప్రభావమో ఏమోగానీ, నేరచరిత్ర ఉన్నవారు, అసాంఘిక శక్తులపట్ల జగన్‌కు విపరీతమైన మక్కువ ఉందని, ఇలాంటి వైఖరి వల్లే చదువుకున్న యువత రాజకీయాల్లోకి రావడానికి భయపడుతున్నారని మండిపడ్డారు. గతంలో ప్రకాశం పంతులు, సంజీవరెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, పి.వి. నరసింహారావు, జలగం వెంగళరావు, నందమూరి తారక రామారావు, ప్రస్తుతం చంద్రబాబు నాయుడువంటి మహామహులు పాలించిన ఈ రాష్ట్రంలో, రాజశేఖరరెడ్డి హయాంలో సైతం శాసనసభ గౌరవం ఇంతగా దిగజారలేదని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక శాసనసభను వాగ్వాదాలు, వ్యక్తిగత విమర్శల వేదికగా మార్చేశారని ఆరోపించారు. వైసీపీ నేతల వ్యక్తిగత విమర్శలు, మహిళలపట్ల చేసిన వ్యాఖ్యలు భరించలేక, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు "ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ; మళ్లీ గౌరవ సభగా మారినప్పుడే ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను" అని శపథం చేసి సభ నుంచి నిష్క్రమించారని, ఆ మాట ప్రకారమే భారీ మెజారిటీతో గెలిచి తిరిగి ముఖ్యమంత్రిగా అడుగుపెట్టారని గుర్తుచేశారు.

జగన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, నేరస్థులను కలవడానికి, పరామర్శించడానికి ఎందుకంత ఆసక్తి చూపుతున్నారని రామయ్య ప్రశ్నించారు. తెనాలిలో పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న ముగ్గురు యువకులను జగన్ పరామర్శించిన ఘటనను ప్రస్తావిస్తూ, వారు రౌడీ షీటర్లుగా, మహిళలను వేధించిన వ్యక్తులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, మహిళల రక్షణ కోసం పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే వారికి మద్దతుగా నిలవడం ఏం సందేశం ఇస్తుందని నిలదీశారు. అలాగే విజయవాడలో లాకప్ డెత్‌కు గురైన సాయికృష్ణ అనే రౌడీ షీటర్ కుటుంబాన్ని జగన్ పరామర్శించిన అంశాన్ని ప్రస్తావిస్తూ, పోలీసు వ్యవస్థలో 28 ఏళ్లు పనిచేసిన అనుభవంతో తాను ఈ ఘటనను ఖండిస్తున్నానని, అయితే నేరచరిత్ర ఉన్నవారిపట్ల జగన్‌కు ఇంత ఆసక్తి ఎందుకని ప్రశ్నించారు.

**అమర్‌నాథ్ గౌడ్ ఘటనను ప్రస్తావించిన రామయ్య**

గత ప్రభుత్వ హయాంలో 14 ఏళ్ల విద్యార్థి అమర్‌నాథ్ గౌడ్‌ను వైఎస్సార్సీపీ సానుభూతిపరులు పెట్రోల్ పోసి సజీవ దహనం చేసిన ఘటనను ప్రజలు మరువలేరని రామయ్య గుర్తుచేశారు. అప్పటి ముఖ్యమంత్రి జగన్, బాధిత కుటుంబాన్ని



పరామర్శించలేదని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకున్నట్లు కూడా కనిపించలేదని ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి పోలీసు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శిస్తూ.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా స్పందిస్తున్నారని, ఇటీవల విజయవాడలో జరిగిన ఘటనలో సింగపూర్ పర్యటనలో ఉండి కూడా తక్షణమే స్పందించి బాధ్యుడైన సీఐని సస్పెండ్ చేశారని కొనియాడారు.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు అతివేగంగా వాహనం నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన ఘటనపై జగన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, "చిన్న పిల్లలు యాక్సిడెంట్లు చేస్తుంటారు, దానికి కేసులు పెడతారా" అనడం సిగ్గుచేటని, 18 ఏళ్లు నిండిన వ్యక్తికి ఓటు హక్కు ఉన్నప్పుడు చట్ట పరమైన బాధ్యత ఉండదా? అని నిలదీశారు. తప్పు చేసిన తన కుమారుడిని తప్పించేందుకు అప్పలరాజు మరో వ్యక్తిని ముద్దాయిగా చూపే ప్రయత్నం చేశారని ఆరోపిస్తూ, ఈ కేసులో సమాచారం బయటకు రావడంతో అసలు నిజం వెల్లడైందని, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారని పేర్కొన్నారు.

**సంఘవిద్రోహ శక్తులకు మద్దతు ఆరోపణ**

ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న 'ప్రశ్న రావణ' కేసును ప్రస్తావిస్తూ, ఆ వ్యక్తికి జగన్ మద్దతు ఉందని రామయ్య ఆరోపించారు. అతనిపై బ్లాక్‌మెయిల్, మహిళలను వేధించే ఆరోపణలు ఉన్నాయని, ఈ కేసులో కొందరు రిటైర్డ్ అధికారులు మీడియా చర్చల్లో అతనికి మద్దతుగా మాట్లాడటాన్ని తప్పుబట్టారు. జగన్ మద్దతు లేకపోతే ఇలాంటి మద్దతు కూడగట్టడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. జగన్ తిరిగి అధికారంలోకి వస్తే నిందితులందరినీ విడుదల చేయిస్తామని చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, నేరస్థులకు మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు.

కల్తీ మద్యం తాగి 27మంది మృతి చెందిన కేసులో 78 రోజులు జైలు జీవితం గడిపిన జోగి రమేష్‌ను జగన్ పరామర్శించడాన్ని ప్రస్తావిస్తూ, మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ పలకరించలేదని, ఇప్పుడు నిందితుడిని పరామర్శించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జగన్ రూ.43 వేల కోట్ల ప్రజాధనం అన్యాక్రాంతం చేశారంటూ సీబీఐ చార్జ్‌షీట్ దాఖలు చేసిన అంశాన్ని గుర్తుచేస్తూ, 2010లో తొలి ఎఫ్ఐఆర్ నమోదైనప్పటి నుంచి తన ఆస్తుల మూలాలపై జగన్ స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు.

జగన్ హయాంలో అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రవర్తన, భాష దిగజారిందని, అందుకే చంద్రబాబు దానిని 'కౌరవ సభ'గా అభివర్ణించారని, కూటమి ప్రభుత్వంలో దానిని తిరిగి 'గౌరవ సభ'గా మార్చారని కొనియాడారు. దళిత డాక్టర్ సుధాకర్ మృతి, రాజమండ్రిలో దళిత మహిళపై జరిగిన అత్యాచార ఘటన, మద్యం ధరలపై ప్రశ్నించిన ఓం ప్రకాష్ హత్య వంటి ఘటనల్లో బాధిత కుటుంబాలను జగన్ పట్టించుకోలేదని ఆరోపించారు. జగన్ రాజకీయ ప్రవేశమే అవినీతి సొమ్ముతో జరిగిందని, ఆయన వచ్చాక రాజకీయ విలువలు దిగజారాయని, కూటమి ప్రభుత్వం ఆ విలువలను పునరుద్ధరిస్తోందని పేర్కొంటూ, నేరస్థులకు మద్దతిచ్చే శక్తులను ప్రజలు సమర్థించవద్దని వర్ల రామయ్య పిలుపునిచ్చారు.

# పెట్రోల్ బంక్ లీజు పేరుతో భారీ మోసం

- రూ.50 వేల బాకీ కోసం రూ.50 లక్షల ఆస్తిపై ఆర్టీవో కన్ను
- గ్రామ కంఠం భూమితో పాటు రోడ్డునూ ఆక్రమించిన రిటైర్డ్ టీచర్
- భూ రికార్డుల ఫోర్జరీ.. 3.59 ఎకరాలు స్వాహా
- చర్యలు తీసుకోవాలంటూ గ్రీవెన్స్ సెల్‌కు ఫిర్యాదులు
- అర్జీలు స్వీకరించి.. పరిష్కారానికి హామీ ఇచ్చిన న్యాయ మంత్రి ఫరూక్



మంగళగిరి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో పలువురు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. పెట్రోల్ బంక్ లీజు మోసం, రూ.50 వేల బాకీ కోసం రూ.50 లక్షల ఆస్తిపై ఆర్టీవో కన్నేయడం, గ్రామ కంఠం భూమితోపాటు రోడ్డును ఆక్రమించిన రిటైర్డ్ టీచర్, భూరికార్డుల ఫోర్జరీ ద్వారా 3.59 ఎకరాల భూమి కాజేయడంవంటి పలు ఫిర్యాదులు గ్రీవెన్స్ సెల్‌కు అందాయి. మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బుచ్చి రామ్‌ప్రసాద్ అర్జీలను స్వీకరించి.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బాధిత వర్గాలకు హామీ ఇచ్చారు. గుంటూరుకు చెందిన షేక్ అక్రమ్ తన అర్జీలో, లాలాపేటలో ఉన్న 'బదిగినేని సర్వీస్ స్టేషన్' (హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్)ను బదిగినేని పద్మజ అనే మహిళ వద్ద నుంచి 5 ఏళ్ల కాలానికి లీజుకు తీసుకున్నానని, భాగస్వామ్యం ఇప్పిస్తానని నమ్మించి పద్మజ తన వద్ద నుంచి రూ.74 లక్షలు తీసుకుందని తెలిపారు. హెచ్‌పీసీఎల్ సంస్థ భాగస్వామ్యానికి నిరాకరించడంతో 50 శాతం షేర్ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకుని, వ్యాపార పెట్టుబడి కింద మరో రూ.50 లక్షలు ఇచ్చానని పేర్కొన్నారు. గత 4 ఏళ్లుగా వ్యాపారం సాగుతున్న క్రమంలో పద్మజ కుమారుడు బదిగినేని రామయ్య, కోడలు అనుష షేర్ ఇవ్వడం కుదరదని బెదిరించారని, ఏఎస్పీకి ఫిర్యాదు చేయగా పంచాయితీ ద్వారా పద్మజ పేరిట ఉన్న రూ.45 లక్షల విలువైన ఫ్లాట్‌ను తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించి రూ.14 లక్షలు బదిలీ చేయించారని తెలిపారు. అయితే మిగిలిన రూ.15 లక్షల బాకీతో పాటు, వ్యాపారంలో తనకు రావలసిన షేర్ డబ్బులు రూ.23.20 లక్షలను పద్మజ సొంతానికి వాడుకున్నారని, అలాగే పెట్రోల్ స్టాక్ నిమిత్తం తాను చెల్లించిన రూ.22 లక్షలకు సంబంధించి బంకు నిర్వహణ తాత్కాలికంగా జైళ్ల శాఖకు అప్పగించినప్పుడు వచ్చిన రూ.10.17 లక్షల గ్రౌండ్ స్టాక్ సొమ్మును కూడా తల్లీకొడుకులు వాడుకున్నారని ఆరోపించారు. తనకు రావలసిన సుమారు రూ.47 లక్షల బకాయిల గురించి నిలదీయగా బెదిరింపులకు, తప్పుడు క్రిమినల్ కేసులకు గురిచేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం శీతాయలంక గ్రామానికి చెందిన ఆరిగ వరప్రసాద్ బాబు తన అర్జీలో, కరోనా సమయంలో ఆర్థిక ఇబ్బందుల్లో పడి ఏలూరులో ఆర్టీవోగా పనిచేస్తున్న తల్లాప్రగడ భీమారావు వద్ద అప్పు అడగగా, తల్లి కట్టించిన రూ.50 లక్షల విలువైన ఇంటిని తాత్కాలికంగా తన కుమార్తె మద్దాలి సోనీ సంపూర్ణ పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తేనే రూ.7 లక్షల అప్పు ఇస్తానని, డబ్బులు తిరిగి చెల్లించగానే ఇల్లు తిరిగి రాసిస్తానని షరతు పెట్టారని తెలిపారు. మధ్యవర్తి సమక్షంలో ఒప్పందం జరిగి రూ.7 లక్షలు తీసుకుని, తర్వాత వడ్డీతో కలిపి రూ.7.50 లక్షలు తిరిగి చెల్లించానని, ప్రస్తుతం కేవలం రూ.50 వేల బాకీ మాత్రమే మిగిలి ఉందని, అనారోగ్యంతో ఆ మొత్తం చెల్లించడానికి రెండు నెలల గడువు కోరినా భీమారావు, అతని మనుషులు రూ.50 లక్షల విలువైన ఇంటిని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.

ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామానికి చెందిన కడియాల ప్రశాంతి తన అర్జీలో, గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నివసించే రిటైర్డ్ ఉపాధ్యాయుడు కడియాల ప్రసాద్ గ్రామ కంఠం భూమిని ఆక్రమించి ఇల్లు నిర్మించడంతో పాటు ప్రభుత్వ రోడ్డును సైతం ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకున్నారని, దీనివల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు స్థానిక శాసనసభ్యుడు విజయకుమార్ మంజూరు చేసిన సిమెంట్ రోడ్డు పనులను కూడా అడ్డుకున్నారని తెలిపారు. గ్రామ పెద్దలు పంచాయితీ నిర్వహించి రెండు అడుగులు వెనక్కి జరిపి గోడ కట్టుకోవాలని చెప్పినా, ఆ తర్వాత నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ రోడ్డుపైనే గోడ నిర్మించారని, స్థలానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకున్నా రాజకీయ బలంతో నిర్మాణం కొనసాగిస్తున్నారని, పోలీసులకు, పంచాయితీ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు.

సత్యసాయి జిల్లా నల్లమడ మండలం పులిగంపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ ఫరియాద్ జాన్ తన అర్జీలో, తమ గ్రామంలో బావాఖాన్ అనే వ్యక్తికి చెందిన పూర్వీకుల ఆస్తికి సంబంధించి పక్కా ఆధారాలు ఉన్నప్పటికీ, బావాఖాన్ కుమార్తె ఖైరున్నీ పత్రాల్లో తండ్రి స్థానంలో భర్త పేరు వచ్చేలా తప్పుడు రికార్డులు రాయించి 3 ఎకరాల 59 సెంట్ల భూమిని తీసుకున్నారని, దీనివల్ల న్యాయబద్ధంగా తమ కుటుంబానికి దక్కాల్సిన భూమిలో ఎక్కువ భాగం కోల్పోయామని ఆరోపించారు. మిగిలిన భాగస్వాముల హక్కుల కోసం గతంలో ఆర్‌డీఓ కోర్టును ఆశ్రయించినా న్యాయం జరగలేదని తెలిపారు.

కాకినాడకు చెందిన దుర్గపావని తన అర్జీలో, భర్త మరణానంతరం తల్లిగారి ఇంట్లో నివసిస్తున్న తనను చుట్టుపక్కల వ్యక్తులు ముఠాగా ఏర్పడి మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని, ఇంట్లోకి చొరబడి రూ.15,000 విలువైన సెల్ ఫోన్, రూ.3 లక్షల నగదు దొంగిలించారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆశించిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం వలసపల్లి గ్రామానికి చెందిన ఎన్. నాగరాజు తన అర్జీలో, 1999లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలు పంపిణీ చేసినా, సరిహద్దులు చూపించకపోవడంతో గత 27 ఏళ్లుగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, ఇదే అదనుగా కొందరు భూమిని ఆక్రమించారని, ఇటీవలి సర్వేలో భూమి విస్తీర్ణం తగ్గినట్లు తేలినా, తగ్గిన కొలతల ప్రకారమైనా 31 మంది లబ్ధిదారులకు భూమి పంచాలని అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం ప్రహ్లాదపురం గ్రామానికి చెందిన దాసరి అప్పలనరసింహ తన అర్జీలో, 2019లో ఇంటి స్థలం మంజూరు కోసం వెరిఫికేషన్ ప్రక్రియలో తన పేరు అర్హుల జాబితాలో చేరినా, ఏడేళ్లు గడుస్తున్నా తుది వెరిఫికేషన్ పూర్తి చేసి స్థలం కేటాయించలేదని, సమస్యను పరిష్కరించాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై అర్జీలు ఇవ్వగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు అందించారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక తోడ్పాటు కోరుతూ మరికొందరు అభ్యర్థనలు సమర్పించారు.

# ఎక్సలెన్సీ సెంటర్లలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## ప్రవేశం పొందిన విద్యార్థులకు ఇంటర్ సహా ఐఐటీ, నీట్, జేఈఈకి ఉచిత శిక్షణ

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ప్రముఖ కోచింగ్ సంస్థల సహకారంతో నడపబోతున్న 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్'లో, ఇంటిగ్రేటెడ్ ఐఐటీ/జెఇఇ, నీట్ కోచింగ్‌తో కూడిన ఇంటర్మీడియట్ మొదటి మరియు రెండవ సంవత్సర కోర్సులలో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్ కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో మూడు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, మేఘాద్రిగడ్డ, విశాఖపట్నం జిల్లా; డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, అమరావతి (తాడికొండ), గుంటూరు జిల్లా; డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, కోట, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో ఈ ఎక్సలెన్సీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్చి 2026లో జరిగిన ఎస్సెస్సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులై, 85శాతం లేదా అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. మార్చి 2026లో జూనియర్ ఇంటర్మీడియట్‌లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతోపాటు సమగ్రమైన ఐఐటీ/జేఈఈ, నీట్ కోచింగ్, వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ మరియు ఇతర విద్యాపరమైన సహాయంతో కూడిన ఉచిత గురుకుల విద్యను అందిస్తామని తెలిపారు. షెడ్యూల్ కులాల విద్యార్థులకు 75శాతం సీట్లు, ఇతరవర్గాల (ఓసీ, ఎస్టీ, బీసీ) విద్యార్థులకు 25శాతం సీట్లు కేటాయించే రిజర్వేషన్ విధానం ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు. 17 జూలైనుండి ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్ దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూలై 30 అని తెలిపారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రసన్న వెంకటేష్ తెలిపారు.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి: మంత్రి స్వామి**

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందుకనుగుణంగా ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో వారు ఉన్నతస్థాయికి ఎదగాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.



# ఎస్సీ, ఎస్టీలకు ఫ్రీ సోలార్ పవర్

- అర్హులంతా పీఎం సూర్యఘర్‌ను వినియోగించుకోవాలి
- కూటమి పాలనలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు
- రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారి విద్యుత్ ఛార్జీలు ట్రూ డౌన్
- మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి వెల్లడి

ప్రకాశం /తూర్పు నాయుడుపాలెం (చైతన్య రథం): ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్ అందిస్తున్నామని, పీఎం సూర్యఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పిలుపునిచ్చారు.



బుధవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం ఎస్సీ కాలనీలో పీఎం సూర్య ఘర్ సోలార్ ప్యానల్స్‌ని మంత్రి డివస్ బీవీ స్వామి, మ్యారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 40శాతం రాయితీతో సోలార్ ప్యానెళ్లను పంపిణీ చేస్తున్నట్టు మంత్రి వివరించారు. ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకూ విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించవచ్చన్నారు.

అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్తుని ప్రభుత్వానికి అమ్మవచ్చన్నారు. ఈ పథకంతో భవిష్యత్‌లో విద్యుత్ కొరతకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. కూటమి పాలనలో విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటిసారి విద్యుత్ ఛార్జీలు ట్రూ డౌన్ చేశామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

# ఎల్ నినో తీవ్రత కంటే.. జగన్ శవయాత్రల ఆరాచకమే ఎక్కువ

- ఒకరిని వేలెత్తి చూపిస్తే.. నాలుగు వేళ్లు మనల్నే చూపిస్తాయి
- ఆ వాస్తవాన్ని జగన్ గుర్తుంచుకుంటే మంచిది
- సంక్షేమం అందుకుంటున్న ప్రజలు కూటమిని మనసారా దీవిస్తున్నారు
- ఉమ్మడి రాష్ట్రంలోనే రైతులు, పేదలకు ఉచిత బీమానిచ్చిన ఘనుడు చంద్రబాబు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

మంగళగిరి (చైతన్య రథం): జగన్ పాలనలో దళితుల ప్రాణాలు కోల్పోయిన ఘటనల్లో కోటి రూపాయల పరిహారం ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ధ్వజమెత్తారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా రాష్ట్రంలో వాతావరణం ఎలా ఉందో పక్కన పెడితే.. ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న శవయాత్రలను చూసి అబ్బురపడుతున్నారు. ఆయన చేస్తున్న యాత్రలు ఎంతమాత్రం సానుభూతితో కూడినవి కావు. అవి కేవలం ఆరాచకంతో, రాజకీయ స్వార్థంతో కూడిన శవయాత్రలు మాత్రమేనని ప్రజలంతా గమనిస్తున్నారు. ఇటీవల జగన్మోహన్ రెడ్డి.. 20కి పైగా కేసులు ఉండి, రేపిస్ట్, మర్డరర్ అని అపఖ్యాతి పాలైన గాదే సాయికృష్ణ అనే వ్యక్తి చనిపోతే, అతడి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి రూ.25 లక్షల డబ్బు ఇస్తానని ప్రకటించి మోసం చేశారు అని ఎద్దేవా చేశారు.

"ఇక్కడ జగన్మోహన్ రెడ్డిని సూటిగా ఒక ప్రశ్న అడుగుతున్నాను. గతంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో ఒక జూదగాడిని పరామర్శించడానికి వచ్చినప్పుడు.. మీ సొంత పార్టీకి చెందిన క్రియాశీలక కార్యకర్త, దళితుడైన సింగయ్య మీ కారు టైర్లకింద నలిగి చనిపోయిన విషయం వాస్తవం కాదా? కనీసం కారు ఆపి అతనికి ఎలా ఉందో కూడా చూసుకోకుండా, దళితుడే కదా ఏం చేస్తాడనే అహంకారంతో, రాక్షస మనస్తత్వంతో మీరు అక్కడి నుంచి వెళ్ళిపోలేదా? కనీసం ఆ దళితుడి ఇంటికి వెళ్లి పరామర్శించకుండా, వారి కుటుంబ సభ్యులను మీ ప్యాలెస్‌కు పిలిపించుకున్న మాట నిజం కాదా? ఈరోజు నోరు తెరిస్తే కోటి రూపాయల పరిహారమని మాట్లాడుతున్నారే.. మరి ఆ రోజు ఆ దళిత కుటుంబానికి మీరు ఎంత పరిహారం ఇచ్చారో సమాధానం చెప్పాలి" అని నిలదీశారు.

"జగన్ పరిపాలనలోని కొన్ని ఘోరమైన సంఘటనలను గుర్తు చేయదలుచుకున్నాను. మీ ప్రభుత్వంలో అమర్నాథ్ గౌడ్ అనే బీసీ బాలుడు తన అక్కకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తే.. మీ పార్టీ కార్యకర్తలు ఆ అబ్బాయి నోట్లో గుడ్డలు కుక్కి.. పెట్రోల్ పోసి సజీవ దహనం చేశారు. ఆ రోజు కనీసం ఆ బాధితుల ఇంటికి వెళ్లి మీరు పరామర్శించారా? ఏమైనా పరిహారం ఇచ్చారా? లేదు కదా! అలాగే మీ సొంత నియోజకవర్గంలో నాగమ్మ అనే దళిత మహిళపై అత్యంత పైశాచికంగా, సామూహికంగా అత్యాచారం చేస్తే.. కనీసం ఆమె ఇంటికి వెళ్లే తీరిక మీకు దొరికిందా? ఈరోజు కోటి కోటి అని అరుస్తున్నారే.. మరి ఆ రోజు ఆ దళిత మహిళ కుటుంబానికి కోటి రూపాయలు ఇచ్చారా? మీ సొంత ఎమ్మెల్సీ అనంతబాబు తన దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం అనే దళిత యువకుడిని దారుణంగా చంపి, శవాన్ని కార్లో తెచ్చి డోర్ డెలివరీ చేశాడు. మీ ప్రభుత్వంలో జరిగిన ఈ ఘోరానికిగానూ.. ఆ సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లి ఓదార్చారా? ఏమైనా పరిహారం ఇచ్చారా? లేదు. ఇక కోవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి పనిచేస్తూ, కేవలం మాస్కులు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను మీ అహంకారంతో పిచ్చివాడిని చేసి, చిత్రహింసలకు గురిచేసి చంపేశారు. ఆయన చనిపోతే కనీసం ఆ కుటుంబాన్ని పరామర్శించారా? మీరు చెప్తున్న ఈ కోటి రూపాయల పరిహారం వాళ్లకు ఇచ్చారా? లేదు. మరి ఏ మొహం పెట్టుకుని మీరు ఈరోజు శవయాత్రలు చేస్తున్నారు?" అని నిలదీశారు. కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, కులాల మధ్య చిచ్చు పెట్టడానికి మాత్రమే జగన్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే రామాంజనేయులు ధ్వజమెత్తారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తుంటే.. ఆ ప్రజాదరణను తట్టుకోలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికే జగన్ ఈ శవయాత్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇటీవల మత్స్యకారుల కుటుంబాలను కలిసి, గల్లంతైన వారికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని జగన్ డిమాండ్ చేస్తున్నారు. మీకు నిజంగా మత్స్యకారులపై అంత ప్రేమ ఉంటే.. మీరు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో దాదాపు 65 మంది వేటకు వెళ్లి గల్లంతై చనిపోతే వారికి కనీసం ఒక్క రూపాయి అయినా చెల్లించారా? వేటకు వెళ్లి తిరిగి రాని మత్స్యకారులకు రూ.10 లక్షలు ఇస్తామని ఆనాడు గొప్పలు చెప్పారు కదా.. మరి పది పైసలైనా ఇచ్చారా?" అని ప్రశ్నించారు.

కానీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత.. జగన్ చేయలేని పనిని మానవీయ కోణంలో ఆలోచించి, ఆ మత్స్యకార కుటుంబాలకు రూ.3.15 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించారని ఎమ్మెల్యే బూర్ల గుర్తు చేశారు. "మేము ఎక్కడా దీనిపై ఆర్భాటాలు చేయలేదు, రాజకీయ యాత్రలు చేయలేదు. మొన్న స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగి కార్మికులు చనిపోతే.. మా యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు మీలాగా శవాలపై రాజకీయాలు చేయలేదు. నేరుగా బాధితుల కుటుంబాల వద్దకు వెళ్లి, పరామర్శించి, వారికి అందాల్సిన సహాయాన్ని తక్షణమే అందించారు. ఎక్కడా రాజకీయం ప్రదర్శించలేదు. కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఎక్కడ శవం కనిపిస్తే అక్కడ యాత్ర చేస్తూ, రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారు. చనిపోయిన కుటుంబాల మీద రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదు, జగన్ దీనిపై ఆలోచించుకోవాలి" అని హితవు పలికారు.

2024 ఎన్నికల ముందు మీరు నిర్వహించిన 'సిద్ధం' యాత్రలో.. మేదరమెట్లలో మురళీకృష్ణ అనే ఒక మున్సిపల్ కార్మికుడు గుండెపోటుతో చనిపోయిన విషయం మీకు తెలియదా? ఆ రోజు మీ సభ కోసం వచ్చిన ఆ పేద కార్మికుడి గురించి మాట్లాడటానికి లేదా ఆదుకోవడానికి మీకు సమయం దొరకలేదు. అలాంటిది ఈరోజు చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని 2027 నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, ప్రతి ఎకరాకు నీరు అందిస్తామని ప్రకటిస్తే ప్రజలంతా సంతోషిస్తున్నారు. ఆ సంతోషాన్ని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని డైవర్ట్ చేయడానికి మీరు కుట్రలు పన్నుతున్నారు. ఇకనైనా ఈ డ్రామాలు ఆపాలని హితవు పలికారు.

"నిజానికి పరిహారం, మానవత్వం అనే పదాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు నాయుడే. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు దాదాపు 242 కోట్ల 45 లక్షల రూపాయలతో.. రైతు కుటుంబాలకు, రైతు కూలీలకు, పేదలకు రూ. 5 లక్షల ఉచిత బీమా కల్పించిన మహానుభావుడు చంద్రబాబు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా అలా చేయలేదు. రైతన్నలు అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటే భారీగా సహాయం అందించి ఆదుకున్న చరిత్ర చంద్రబాబుది. ఈరోజు ఒక కుటుంబానికి భద్రతగా రూ.25 లక్షల ఇన్సూరెన్స్ తెచ్చింది కూడా చంద్రబాబు నాయుడే. ప్రజల భద్రత, సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి అనే విషయాల్లో చంద్రబాబుకు ఒక పేటెంట్ ఉంది. ఇప్పటికైనా జగన్ ఆయన్ను చూసి రాజకీయం నేర్చుకోవాలి. మీ దగ్గర ఏవైనా మంచి సలహాలు ఉంటే ఇవ్వండి, ప్రభుత్వం తీసుకుంటుంది. కానీ శవాలపై రాజకీయాలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టడం మంచిది కాదు" అని ఎమ్మెల్యే బూర్ల జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ప్రశ్న రావణ్‌లాంటి నేరగాళ్లకు మీ నాయకులు సపోర్ట్ చేస్తున్నారు. మీ ప్రభుత్వంలో రంగనాయకమ్మ అనే 70 ఏళ్ల వృద్ధురాలు తన ఫోన్‌కు వచ్చిన ఒక సోషల్ మీడియా పోస్టును కేవలం ఫార్వర్డ్ చేసినందుకే అర్ధరాత్రి పూట పోలీసులు పెట్టి అరెస్ట్ చేయించిన విషయాన్ని మరిచిపోయారా? ఇప్పటికైనా విజ్ఞతతో ఆలోచించండి. మనం ఒకరిని వేలెత్తి చూపేటప్పుడు మిగతా నాలుగు వేళ్లు మన వైపే చూపిస్తాయనే సహజ సూత్రాన్ని గ్రహిస్తే మంచిది అని జగన్‌కు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు హితవు పలికారు.

# విశాఖ పడవ ప్రమాదం..
# యుద్ధప్రాతిపదికన స్పందించిన సర్కారు

- సమాచారం అందిన మరుక్షణమే రెస్క్యూ ఆపరేషన్
- బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్




అమరావతి (చైతన్య రథం): విశాఖ మత్స్యకార పడవ ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి, తొలి సమాచారం అందిన క్షణంనుంచే రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించి బాధితులకు, వారి కుటుంబాలకు అండగా నిలిచిందని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో విపత్తు నిర్వహణ శాఖ డైరెక్టర్, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రకర్ జైన్, విశాఖపట్నం రేంజ్ మరియు కోస్టల్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గోపీనాథ్ జెట్టితో కలసి మీడియాతో మాట్లాడుతూ దుర్ఘటనకు సంబంధించి వాస్తవ సమాచారాన్ని వివరించారు.

విశాఖపట్నం తీరంలో యాంత్రిక మత్స్యకార పడవ ప్రమాదం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం, భారత తీర రక్షక దళం, భారత నౌకాదళం, మెరైన్ పోలీసులు, విపత్తు నిర్వహణ శాఖలతో సమన్వయం చేస్తూ 72 గంటలకు పైగా విస్తృత స్థాయిలో గాలింపు, రక్షణ చర్యలను చేపట్టినట్టు రామశంకర్ నాయక్ తెలిపారు. ఒక మత్స్యకారుడిని సురక్షితంగా రక్షించి వైద్యసేవలు అందించడంతోపాటు, ఒక్కో బాధిత కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున ఆరు కుటుంబాలకు రూ.60 లక్షల తక్షణ ఆర్థిక సహాయం, రక్షించబడిన మత్స్యకారుడికి రూ.50 వేల ప్రత్యేక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్టు తెలిపారు. నిర్దేశిత ప్రక్రియ పూర్తయిన అనంతరం ప్రతి బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, బీమా సహాయం అందించనుండగా, భవిష్యత్తులో సముద్ర భద్రత, అత్యవసర స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు.

### ప్రమాద ఘటన

2026 జూలై 4న విశాఖపట్నం తీరానికి చెందిన ఐఎన్‌డి-ఏపీ-ఎంఎం-విస్-83 యాంత్రిక మత్స్యకార పడవలో మొత్తం ఏడుగురు మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారని తెలిపారు. మధ్యాహ్నం సుమారు 3.45 గంటలకు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, బలమైన ఈదురుగాలుల కారణంగా పడవ ప్రమాదానికి గురైంది. ఒక మత్స్యకారుడు వెంటనే సముద్రంలో గల్లంతు కాగా, మిగిలిన ఆరుగురు మునిగిపోతున్న పడవపై రాత్రి వరకు ఆశ్రయం పొందారు. అనంతరం థర్మాకోల్ సహాయంతో ఈదుకుంటూ ప్రాణాలు నిలబెట్టుకునే ప్రయత్నం చేశారు. వారిలో కారి చిన్న సమీపంలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకను చేరుకొని ప్రాణాలతో బయటపడగా, మిగిలిన ఐదుగురు సముద్రంలో గల్లంతయ్యారు.

### సమాచారం అందిన వెంటనే అధికారిక స్పందన

కుటుంబ సభ్యులు, మత్స్యకార సంఘాల ద్వారా సమాచారం అందిన వెంటనే మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, కోస్ట్ గార్డ్, నౌకాదళం, జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించడం జరిగిందని రామశంకర్ నాయక్ తెలిపారు. అదే రాత్రి అత్యవసర సమాచార వ్యవస్థను వినియోగిస్తూ అన్ని సంబంధిత శాఖలను అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించారు.

విశాఖ రేంజ్ అండ్ కోస్టల్ సెక్యూరిటీ ఐజీ గోపీనాథ్ జెట్టి మాట్లాడుతూ, జూలై 4న రాత్రి సుమారు 10.30 గంటలకు సాయంత్రానికే తీరానికి చేరుకోవాల్సిన పడవ ఇంకా ఒడ్డుకు చేరలేదని మెరైన్ పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందిందని తెలిపారు. వెంటనే స్పందించిన మెరైన్ సీఐ, ఫిషింగ్ బోట్ యజమానులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులతో మాట్లాడి సంఘటనను నిర్ధారించారు. రాత్రి 10.50 గంటలకు సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారుల పూర్తి వివరాలు, పడవ వివరాలు, ప్రయాణించిన ప్రాంతం తదితర సమాచారాన్ని సేకరించి, సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ ప్రోటోకాల్ ప్రకారం నమోదు చేసి, అర్ధరాత్రి 12.15 నుంచి 12.30 గంటల మధ్య భారత నౌకాదళం, తీర రక్షక దళానికి అధికారిక ఈ-మెయిల్స్ పంపినట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే నౌకాదళం, కోస్ట్ గార్డ్ సముద్రంలో సంచరిస్తున్న అన్ని వాణిజ్య, రక్షణ నౌకలకు గల్లంతైన మత్స్యకారుల వివరాలను చేరవేశాయని తెలిపారు.

### విస్తృత గాలింపు ఆపరేషన్

విశాఖపట్నంలోని కోస్ట్ గార్డ్ నౌక మరమ్మతుల్లో ఉండటంతో వెంటనే కాకినాడ నుంచి సహాయక నౌకలను తరలించారు. జూలై 5 ఉదయం 7.00 నుంచి 7.30 గంటల మధ్య పనామా రిజిస్ట్రేషన్ కలిగిన ఒక వాణిజ్య నౌక యాంకర్‌ను పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్న కారి చిన్నను గుర్తించి సురక్షితంగా రక్షించారు. అదే సమయంలో సముద్రంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కాకినాడ కోస్ట్ గార్డ్ నౌకకు కూడా సమాచారం అందించగా, అది వెంటనే ప్రమాద ప్రాంతానికి మళ్లి గాలింపు చర్యలు ప్రారంభించింది. జూలై 5 ఉదయం నుంచి భారత తీర రక్షక దళం, నౌకాదళం, మెరైన్ పోలీసుల అదనపు నౌకలు, హెలికాప్టర్లు గల్లంతైన మత్స్యకారుల కోసం విస్తృత గాలింపు చేపట్టాయి. తీవ్ర ప్రతికూల వాతావరణం, నాలుగు మీటర్లకు పైగా ఎత్తైన అలలు ఉన్నప్పటికీ సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్ నిరంతరాయంగా కొనసాగించినట్లు గోపీనాథ్ జెట్టి పేర్కొన్నారు. గల్లంతైన మత్స్యకారుల కోసం జూలై 8 వరకు, అంటే 72 గంటలకు పైగా నిరంతర గాలింపు, రక్షణ చర్యలు కొనసాగించి అనంతరం సంబంధిత నివేదికను సమర్పించినట్టు, తదుపరి ప్రభుత్వ నిబంధనల మేరకు త్రిసభ్య కమిటీ ద్వారా విచారణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

### ప్రాణాలతో బయటపడిన మత్స్యకారుడికి వైద్య సహాయం

వాణిజ్య నౌకపై ఉన్న కారి చిన్నను ఆ సమయంలో అలల తీవ్రత కారణంగా చిన్న పడవల ద్వారా ఒడ్డుకు తీసుకురావడం సాధ్యం కాలేదు. మరుసటి రోజు వాతావరణం అనుకూలించడంతో భారత నౌకాదళానికి చెందిన ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా ఎయిర్‌లిఫ్ట్ చేసి సురక్షితంగా ఒడ్డుకు తరలించారు. రక్షించిన వెంటనే ఆయనకు ఆహారం, తాగునీరు, ప్రాథమిక వైద్యసహాయం అందించి, తర్వాత కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

### బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

బాధిత కుటుంబాలు ఎదుర్కొంటున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, అధికారిక ధృవీకరణ ప్రక్రియ పూర్తికాకముందే ప్రభుత్వం మానవతా దృక్పథంతో ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున మొత్తం ఆరు కుటుంబాలకు రూ.60 లక్షల తక్షణ ఆర్థిక సహాయం అందించింది. కారి చిన్నకు అత్యవసర వైద్య అవసరాల కోసం రూ.50,000 ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మత్స్యశాఖ మంజూరు చేసింది. రెవెన్యూ శాఖ ద్వారా కూడా వైద్య సహాయం అందించే చర్యలు కొనసాగుతున్నాయి. నిర్దేశిత విధానాలు పూర్తయిన అనంతరం అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి మత్స్యశాఖ ఎక్స్‌గ్రేషియా (రూ.5 లక్షలు), పీఎంఎంఎస్‌వై-ఎన్ఎఫ్‌డీబీ గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద బీమా (రూ.5 లక్షలు) కలిపి మొత్తం రూ.10 లక్షల అదనపు ఆర్థిక సహాయం అందించనున్నట్లు రామశంకర్ నాయక్ తెలిపారు. సముద్ర భద్రత, గాలింపు చర్యలు, బాధితులకు అందించిన సహాయంపై అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించి, భవిష్యత్తులో సముద్ర ప్రమాదాల సమయంలో అత్యవసర స్పందన వ్యవస్థను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

---

# భారత్ టెక్స్‌లో ఏపీ సత్తా..

- భారీ పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలు, ఎగుమతుల విస్తరణకు ఏపీ పెవిలియన్ వేదిక
- చేనేత మరియు జౌళి శాఖ కమిషనర్ జి. రేఖారాణి

న్యూఢిల్లీ (చైతన్య రథం): భారతదేశపు అతిపెద్ద అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శన భారత్ టెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెవిలియన్ విశేష ఆదరణ పొందుతోంది. జూలై 14నుంచి 17 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ప్రదర్శనలో రాష్ట్ర చేనేత,జౌళి, దుస్తుల తయారీ, ఓడీఓపీ, జీఐ ట్యాగ్ ఉత్పత్తులు, పెట్టుబడి అవకాశాలు, ఎగుమతి సామర్థ్యాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా ప్రదర్శిస్తోంది. చేనేత, జౌళిశాఖ కమిషనర్ జి.రేఖారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు సందర్శించి జౌళిరంగ సామర్థ్యాన్ని అభినందించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బైరెడ్డి జయ నాగేశ్వరరెడ్డి టెక్స్‌టైల్ పార్కులు, చేనేత కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలను ప్రశంసించడంతో పాటు ఎమ్మిగనూరు ఉత్పత్తులకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు కల్పించే అంశంపై ప్రతినిధులతో చర్చించారు. రాజ్యసభ సభ్యుడు విజయేంద్ర ప్రసాద్ భారతీయ చేనేత ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను ప్రస్తావిస్తూ, వర్చువల్ రియాలిటీవంటి ఆధునిక సాంకేతికత ద్వారా ఆంధ్రప్రదేశ్ చేనేత ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింత చేరువ చేయాల్సిన అవసరాన్ని సూచించారు. ఫ్యాబిండియా, ఏఈపీసీ, ఏసీడీటీ, అరవింద్ లిమిటెడ్, ట్రైడెంట్ గ్రూప్, హ్యాండ్లూమ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, కాంచీపురం సిల్క్ పార్క్, వజీర్ అడ్వైజర్స్ తదితర ప్రముఖ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో సోర్సింగ్, పెట్టుబడులు, మార్కెట్ అనుసంధానాలు, ఎగుమతి అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేశాయి. ఉప్పాడ జాందాని, వెంకటగిరి చీరలవంటి సంప్రదాయ చేనేత ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు మరింత విస్తరించే అంశంపైనా చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా విశాఖపట్నంలో రూ.4,000 కోట్ల పెట్టుబడితో సుస్థిర వస్త్ర రీసైక్లింగ్ యూనిట్, రూ.100 కోట్ల పెట్టుబడితో వస్త్ర తయారీ యూనిట్ ఏర్పాటుకు అవగాహన ఒప్పందాలు కుదిరాయి. ఈప్రాజెక్టుల ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భారత ప్రభుత్వ చేనేత అభివృద్ధి కమిషనర్ డాక్టర్ ఎం బీనా, కర్ణాటక ప్రభుత్వ ఎంఎస్ఎంఈ, గనులు, జౌళి, చక్కెర శాఖ కార్యదర్శి రోహిణి సింధూరి, కర్ణాటక జౌళి అభివృద్ధి కమిషనర్ బసవరాజు తదితరులు పెవిలియన్‌ను సందర్శించి రాష్ట్ర జౌళి, చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను అభినందించారు.

పట్టు ఉత్పత్తిలో దేశంలో రెండోస్థానం,పత్తి ఉత్పత్తిలో ఆరోస్థానం, జనపనార ఉత్పత్తిలో ఏడోస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 15వేలకుపైగా ఎంఎస్ఎంఈలు,140కు పైగా పెద్ద వస్త్ర పరిశ్రమలు,35వేలకు పైగా పవర్‌లూమ్‌లు,36లక్షల స్పిండిల్స్‌తో బలమైన జౌళి పరిశ్రమ వ్యవస్థ ఉందని అధికారులు తెలిపారు. విధానపరమైన ప్రోత్సాహకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఎగుమతి విస్తరణ, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామి వస్త్ర, చేనేత కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు.

## గ్రామీణ ప్రాంతాలను పట్టణ ప్రాంతాలుగా తీర్చిదిద్దాలి

● ఇంజినీరింగ్ పనులు వేగవంతం చేయాలి : ఎం.వి ప్రణవ్‌గోపాల్



విశాఖపట్నం (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనల మేరకు వీఎంఆర్‌డిఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో గ్రామీణ ప్రాంతాలను పట్టణాలుగా తీర్చిదిద్దాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలోపు అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వీఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. బుధవారం వీఎంఆర్‌డిఏ కార్యాలయ సమావేశమందిరంలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్‌తో కలిసి ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీల్లో ఇప్పటికే చేపడుతున్న రహదారులు, కాలువలు సామాజిక భవనాలు, కల్వర్ల నిర్మాణం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాలుగు మునిపాలిటీల్లో స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సదుపాయాలతో మోడల్ పార్కులు అభివృద్ధి చేయాలని సూచించారు. వీఎంఆర్‌డిఏ చేపడుతున్న ప్రధాన రహదారుల్లో ఏమైనా న్యాయపరమైన చిక్కులు ఉంటే, వాటిని మినహాయించి, మిగిలిన పనులు శరవేగంగా చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి చేస్తున్న లే అవుట్లలో సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనకాపల్లి జిల్లా తుంపాల వద్ద కన్వెన్షన్ సెంటర్‌ను వచ్చేనెలలో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనకాపల్లిలో కొత్తూరు వద్ద పార్కు, నగర పరిధిలోని సెంట్రల్ పార్క్ ఆవరణలో యాంటి డ్రగ్ థీమ్ పార్క్‌లని ఆగస్టు నెలాఖరి నాటికి సిద్ధం చేయాలని ఆదేశించారు. కాకాని నగర్ వద్ద అండర్ పాస్ నిర్మాణం అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గాజువాక పెదగంట్యాడ వద్ద వీఎంఆర్‌డిఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న స్పోర్ట్స్ విలేజ్ నిర్మాణంలో శాప్ అధికారుల సూచనలు తీసుకోవాలని, అడ్మిన్ బ్లాక్‌లో ఒక అంతస్తులో ఇండోర్ స్పోర్ట్స్ ఏర్పాటుచేయాలని, మరో అంతస్తులో డార్మెటరీ ఉండేలా ప్రతిపాదనలు చేయాలని ఆదేశించారు.

## ఎస్.కోట నియోజకవర్గంలో జోరుగా టీడీపీ మండల స్థాయి సమావేశాలు



కొత్తవలస (చైతన్యరథం): ఎస్.కోట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మండల స్థాయి సమావేశాలు అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్తు కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశాలకు పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభించింది. కొత్తవలస మండలంలో పార్టీ అధ్యక్షులు కోళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో, ఎల్.కోట మండలంలో పార్టీ అధ్యక్షులు కరెడ్ల ఈశ్వరరావు సారథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించారు. అలాగే జామి మండలంలో పార్టీ అధ్యక్షులు వర్రి రమణ, ఎస్.కోట మండలంలో పార్టీ అధ్యక్షులు డోకుల అచ్చంనాయుడు నేతృత్వంలో ఆయా మండలాల పరిధిలోని పార్టీ కార్యకర్తలు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. వీటితో పాటు రాబోయే రోజుల్లో పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలపై నాయకులు దిశానిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## గిరిజన విద్యార్థుల వసతిగృహాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఎం.గోవిందరావు



హిరమండలం (చైతన్యరథం): పీఎం జన్మన్ యోజనం పథకం కింద హిరమండలంలోని గొట్ట గ్రామం సమీపంలో రూ.2.30 కోట్లతో వ్యయంతో నిర్మించిన గిరిజన విద్యార్థుల వసతి గృహాలను ఎమ్మెల్యే ఎం.గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం, కూటమి ప్రభుత్వం సమన్వయంతో గిరిజన విద్యార్థుల అభివృద్ధికి ఈ గృహాలను నిర్మించినట్లు తెలిపారు. విద్యార్థులకు సరిపడేలా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ డీఏవీఎస్ మూర్తి, డీఈఈ బి. రమేశ్. ఏఈ ఏ. బుచ్చిబాబు, ఐటీడీఏ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గజపతినగరంలో పలు రైళ్లు ఆపాలి : మంత్రి కొండపల్లి



విజయనగరం (చైతన్యరథం): గజపతినగరంలో పలు రైళ్లు ఆపాలని, రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహారాను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు విశాఖపట్నంలోని డీఆర్ఎం కార్యాలయంలో లలిత్ బోహారానిని మంత్రి కొండపల్లి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాయగడ పాసింజర్ రైలును గరుడబల్లి జంక్షన్లో ఆపాలని, అలప్పి- బొకారో ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం - పోర్బా, భువనేశ్వర్- క్వారాపూర్, సమత ఎక్స్‌ప్రెస్ రైళ్లను గజపతినగరంలో నిలుపుదల చేసేలా చర్యలు చేపట్టాలని మంత్రి కోరారు. విశాఖ ఎక్స్‌ప్రెస్ గజపతినగరం రైల్వే స్టేషన్లో రిజర్వేషన్ వెసులుబాటు కల్పించాలన్నారు. ప్రతివారం బనారస్ వెళ్లే ఎక్స్ ప్రెస్ రైల్లో 150 మందికి పైగా ప్రయాణికులు కాశీ ప్రయాణం కోసం వెళుతున్నారని, వీరంతా విజయనగరం రైల్వే స్టేషన్ను రావాల్సి వస్తోందని, ఈ రైలును గజపతినగరంలో నిలిపితే ప్రయాణికుల కష్టాలు తీరుతాయని వివరించారు. ఇందుకోసం అనుమతులు మంజూరు చేయాలని అధికారులను మంత్రి కోరారు.

## నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండ

●నిరుపేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం కృషి... సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట (చైతన్యరథం): నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి వ్యాఖ్యానించారు. జలుమూరు మండలం, రాణా గ్రామానికి చెందిన వాన లక్ష్మణరావు వెన్నెముక సర్జరీ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 46,942 చెక్కును లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యం పాలై ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ప్రతి ఒక్కరికీ ఈ నిధి ఒక సంజీవనిలా పనిచేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దీనిని వర్తింపజేసేలా తమ వంతు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. తమకు సకాలంలో చెక్కు అందేలా సహకరించినందుకు రాగోలు సరస్వతి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొందర, కూరాకుల కార్పొరేషన్ చైర్మన్ దామోదర నర్సింహులు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, మాజీ సర్పంచ్ తర్ర పార్దివ్, బటన కేశవరావు, తంగి తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శల పేరుతో శవ రాజకీయాలు మానాలి : కిడారి శ్రావణ్ కుమార్



గాజువాక (చైతన్యరథం): గాజువాక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ... మత్స్యకారుల విషాదాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను ఓదార్చాల్సిన సమయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరామర్శల పేరుతో రాజకీయ మైలేజ్ పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన జగన్, ఇప్పుడు అకస్మాత్తుగా వారి పట్ల ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేసే ప్రయత్నమేనని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందిస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని, అయితే వైసీపీ నాయకుల పర్యటనల వల్ల సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి రాజకీయ పరామర్శలు చేస్తున్నారని విమర్శించారు. మత్స్యకార భరోసా, వేట నిషేధ కాలం భృతి, బీమా క్లెయిమ్‌లు, మత్స్యకారుల సంక్షేమ పథకాల అమలులో గత ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందిందని ఆరోపించారు. విశాఖ హార్బర్ అగ్నిప్రమాదం వంటి ఘటనల్లో బాధితులను పట్టించుకోని వారు, ఇప్పుడు ప్రతి విషాద ఘటనను రాజకీయంగా ఉపయోగించుకోవాలని చూడటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మత్స్యకారుల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటుందని కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. ప్రస్తుతం మత్స్యకారులు కూడా "మా బాధలను రాజకీయాలకు వాడుకోవద్దు.. మమ్మల్ని ప్రశాంతంగా ఉండనివ్వండి" అని బహిరంగంగానే చెబుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సామాజిక న్యాయానికి మార్గదర్శకుడు బి.ఆర్ అంబేద్కర్ : ఎంపీ కలిశెట్టి



ఎచ్చెర్ల (చైతన్యరథం): భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయానికి మార్గదర్శకుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నాకు ఎంతో గౌరవంగా భావిస్తున్నానని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. బుధవారం శ్రీకాకుళం, జి.సిగడం మండలం, వాండ్రంగి గ్రామంలో డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం శాసనసభ్యులు నడికుదుటి ఈశ్వరరావు, రాజాం నియోజకవర్గం సీనియర్ శాసనసభ్యులు కోండ్రు మురళి మోహన్, ముఖ్య అతిథులుగా శ్రీకాకుళం జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షులు, వాండ్రంగి మాజీ సర్పంచ్ సాకేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... డా. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, సమాన అవకాశాలు కల్పించింది. ఆయన చూపిన సమానత్వం, సామాజిక న్యాయం, విద్య, స్వాభిమానమే మన దేశ అభివృద్ధికి పునాది. యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యను ఆయుధంగా మార్చుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో ప్రతి ఒక్కరం ముందుకు సాగాలని కోరుకున్నారు.

# కూటమి కార్యకర్తలే సుప్రీం... ప్రజలే మా బలం

●24, 25 డివిజన్లలో 'మన వార్డులో - మన ఆదిరెడ్డి' కార్యక్రమం



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ప్రజల సమస్యలను వారి గడప వద్దకే వెళ్లి తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలనే లక్ష్యంతో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన "మన వార్డులో – మన ఆదిరెడ్డి" కార్యక్రమం 24, 25 డివిజన్లలో జరిగింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వాసు, ప్రజలు వినిపించే ప్రతి సమస్యను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి నాయకులు, కార్యకర్తలతో ముఖాముఖి నిర్వహించి పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... 2019 ఎన్నికల్లో అప్పటి టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి భవానికి 24వ వార్డులో 750, 25వ వార్డులో 1,035 ఓట్ల మెజారిటీ రాగా, 2024లో తాను ఎన్డీఏ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు అదే వార్డుల్లో వరుసగా 1,948, 2,230 ఓట్ల భారీ మెజారిటీ లభించిందని గుర్తు చేశారు. ప్రతి ఎన్నికలో కూటమిపై ప్రజల విశ్వాసం పెరుగుతూనే ఉందని, ఈ మెజారిటీలు ప్రజల ప్రేమకు నిదర్శనమన్నారు. ప్రజాప్రతినిధులు చెప్పే ప్రతి సమస్య వెనుక ప్రజల ప్రయోజనమే ఉంటుందని అధికారులు గుర్తించాలని, కూటమి నాయకులు చెప్పే అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని సూచించారు. ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వచ్చినప్పుడే స్పందించడం కాదు, వేదికపై ఉన్న ప్రతి కూటమి నాయకుడిని ప్రజాప్రతినిధిగానే భావించి స్పందించాలని అధికారులకు స్పష్టం చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు. కూటమి ప్రభుత్వంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలే సుప్రీం అని పేర్కొన్న ఎమ్మెల్యే వాసు ప్రజల కోసం పనిచేయని అధికారులు అవసరం లేదని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రెండేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా పెద్ద ఎత్తున సభలు, ఆత్మీయ సమావేశాలు నిర్వహించడం కంటే నేరుగా ప్రజల మధ్యకు రావడానికే తాను ప్రాధాన్యత ఇచ్చానన్నారు. వేల మందితో సభ నిర్వహిస్తే కొద్దిమందితోనే మాట్లాడే అవకాశం ఉంటుందని, కానీ వార్డుల్లో తిరిగితే ప్రతి కుటుంబాన్ని కలుసుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. అందుకే "మన వార్డులో – మన ఆదిరెడ్డి" కార్యక్రమాన్ని చేపట్టానని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారులు, వాలంటీర్లు మాత్రమే ఉండేవారని, కానీ తమకు కార్యకర్తలే అసలైన బలమన్నారు. కూటమి కుటుంబం ఎంతో పెద్దదైందని, మూడు పార్టీల నాయకులు పరస్పర గౌరవంతో, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర స్థాయిలో చూపుతున్న ఐక్యతను కింది స్థాయిలో కూడా కొనసాగించాలని

## కూటమి విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : మాజీ ఎంపీ సీతారామలక్ష్మి

●పబ్లిసిటీ కోసమే జగన్ భీమవరం పర్యటన... జగన్‌రెడ్డి హయాంలో ఆక్వా రంగం సర్వనాశనం



భీమవరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాజ్యసభ మాజీ సభ్యురాలు, టీడీపీ భీమవరం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మద్దుల రాము అధ్యక్షతన బుధవారం పార్టీ నియోజవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మాజీ ఎంపీ సీతారామలక్ష్మి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పెన్షన్లు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు కుటమి ప్రభుత్వం అందిస్తుందని, గొడ్డలి పార్టీ చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టాలని సూచించారు. నియోజక వర్గ పరిశీలికులు సాయిరామ్, టిడిపి రాష్ట్ర మాజీ కోశాధికారి మెంటే పార్థసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియకు టిడిపి కార్యకర్తలందరూ పాల్గొనాలని, ఏ ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలన్నారు. జగన్‌రెడ్డి పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్ష , కార్యదర్శులు మద్దుల రాము, చెల్లబోయిన గోవింద్ మాట్లాడుతూ జగన్ రెడ్డి హయాంలో ఆక్వా రంగం సర్వనాశనం అయిందని, పబ్లిసిటీ కోసమే జగన్ భీమవరం పర్యటన చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు ఆక్వా రైతులకు రూ. 1.50 కే విద్యుత్ ఇస్తామని చెప్పిన జగన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకట్రామయ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చెరుకుపల్లి సంతోష్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని, జగన్ మాత్రం ఆక్వా రైతులను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఎద్దు ఏసుపాదం, మాజీ కౌన్సిలర్లు మైలబత్తుల ఐజాక్ బాబు, విజ్జురోతి రాఘవులు, గంధం రాధా, కొండ్రు శ్రీనివాస్, యలమంచిలి శ్రీనివాస్, నసీమ బేగం, ఫిరోజ్, ఎండి షాబు, కోళ్ల నాగబాబు పాల్గొన్నారు.

## మురికివాడల రూపురేఖలు మారుస్తాం : ఎమ్మెల్యే నసీర్ వెల్లడి



మురికి వాడల రూపురేఖలు మారుస్తామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే నసీర్ స్థానిక 15వ డివిజన్‌లో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్ వ్యవస్థ సక్రమంగా పనిచేస్తుందా? లేదా? అని ఆరా తీశారు. ప్రతిరోజు పొడి చెత్త, తడి చెత్త సేకరిస్తున్నారా అని స్థానికులు అడిగారు. అనంతరం డ్రైనేజీ వ్యవస్థ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుంటూరు తూర్పు నియోజకవర్గం రూపురేఖలు మార్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో పక్కా ప్రణాళికతో పనులు చేపట్టామని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం నడవడానికి కూడా వీలులేని గుంతల రోడ్ల నుంచి ప్రజలకు విముక్తి కల్పించామని తెలిపారు. ప్రధాన రహదారుల్లో గుంతలు పూర్చడమే కాకుండా మారుమూల ప్రాంతాలకు కూడా సీసీ రోడ్లను నిర్మించామని చెప్పారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. సుమారు 100 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్ నిర్మాణం చేపట్టామని అన్నారు. ప్రజలకు ఏ అవసరం ఉన్న తాము ముందుండి ధైర్యంగా నిలబడుతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో మారుమూల ప్రాంతాలలో ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపరిచేందుకు విద్య, వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు.

## ఆక్వా రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

భీమవరం సభలో జగన్ వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవే

: తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ



తణుకు (చైతన్యరథం): భీమవరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆక్వా రైతులపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా రాజకీయ ఉద్దేశాలతో కూడుకున్నవని, ఆక్వా రైతులను నష్టపరిచిన వ్యక్తికి వారి సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు లేదని తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకులోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో మత్స్యరంగ వృద్ధి రేటు 1 శాతానికి పడిపోయి ఆక్వా రంగం తీవ్రంగా దెబ్బతిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024-25లో 7.38 శాతం, 2025–26లో 14.9 శాతం వృద్ధి రేటు సాధించేలా కార్యాచరణ అమలు చేస్తోందని తెలిపారు.వైసీపీ హయాంలో ఫిష్ ఫీడ్ ధరను ఆరు దఫాల్లో 27 శాతం పెంచి రైతులపై భారం మోపారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేజీ ఫీడ్ ధరను రూ.5.60 తగ్గించి రూ.102కు తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులు, ముడి పదార్థాల ధరలు భారీగా పెరిగినా, రైతులపై భారం తగ్గించే ఉద్దేశంతో కేవలం 8 శాతం మాత్రమే పెంచి కేజీ రూ.111కు పరిమితం చేశామని తెలిపారు. ఆక్వా రైతులకు విద్యుత్ విషయంలో కూడా కూటమి ప్రభుత్వం అండగా నిలిచిందని ఎమ్మెల్యే చెప్పారు. గత ప్రభుత్వం జోన్–నాన్ జోన్ విధానంతో రైతులను ఇబ్బందులకు గురిచేసిందని, కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి జోన్, విస్తీర్ణంతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందించేలా జీవో జారీ చేసిందన్నారు. విద్యుత్ సబ్సిడీని కూడా గణనీయంగా పెంచి, 2026–27లో 71 వేల కనెక్షన్లకు రూ.1,150 కోట్ల సబ్సిడీ అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ ధరలు, నీటి పన్ను, మార్కెట్ సెస్ భారీగా పెంచడంతో పాటు విద్యుత్ కోతల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రొయ్యల ధరలు పడిపోయిన సమయంలో కూడా రైతులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు.ప్రస్తుతం ప్రపంచ మార్కెట్ పరిస్థితులు, అమెరికా టారిఫ్‌లు, ఇతర దేశాల పోటీ కారణంగా ఆక్వా రంగం సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతులకు శాశ్వత పరిష్కారం కోసం ఎండ్–టు–ఎండ్ పాలసీ రూపొందిస్తున్నామని తెలిపారు. నరసాపురం ఫిషరీస్ యూనివర్సిటీ పనులను గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేయగా, కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ.32 కోట్లు విడుదల చేసి పనులను వేగవంతం చేసిందన్నారు. అలాగే ఏపీఏడీఏ వ్యవస్థను బలోపేతం చేసి క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ ఆక్వా రంగాభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రైతుల సంక్షేమం, ఆక్వా రంగాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. భీమవరం సభలో జగన్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు దూరంగా ఉన్న రాజకీయ విమర్శలు మాత్రమేనని, ఆక్వా రైతులు వాస్తవాలను గుర్తించి కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన మంత్రి కొలుసు పార్థసారథి



నూజివీడు (చైతన్యరథం): ఆగిరిపల్లి మండలం, తోటపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలకు వివరించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి చేస్తున్న కృషిని కొనియాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి గ్రామంలో పార్టీ విజయానికి అంకితభావంతో పనిచేసి, వంద శాతం విజయాన్ని సాధించేలా సమష్టిగా ముందుకు సాగాలని మంత్రి పిలుపునిచ్చారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

గరివిడి (చైతన్యరథం): గరివిడి మండలంలోని ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.2.71 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు బుధవారం వారి ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ సకాలంలో అందించడమే తమ లక్ష్యమన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, రామ్ మల్లిక్ నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణా--గోదావరి సంగమ మహోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు జలహారతి

**●పాల్గొన్న మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**



మైలవరం (చైతన్యరథం): పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా తరలివచ్చిన గోదావరి జలాలు కృష్ణానదితో అనుసంధానమైన ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ఉన్న పవిత్ర సంగమ క్షేత్రంలో నిర్వహించిన మహోత్తర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వేద మంత్రోచ్ఛారణల మధ్య కృష్ణా, గోదావరి నది మాతల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించి అఖండ జలహారతి సమర్పించిన కార్యక్రమంలో మాజీ జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. భారత జలవనరుల శిల్పి డాక్టర్ కే.ఎల్. రావు కలలుగన్న నదుల అనుసంధానానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యరూపం దాల్చారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణానదికి మళ్లించి రైతులకు సాగునీటి భరోసా కల్పించడంతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగానికి కొత్త ఊపునిచ్చారు. పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణానదిలో కలవడం కేవలం రెండు నదుల సంగమమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, జలవనరుల సమర్థ వినియోగానికి ప్రతీకగా నిలిచింది. జలయజ్ఞాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లిన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ జలవనరుల రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం.. జాప్యాన్ని సహించబోను

**●ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి**



చిలకలూరిపేట (చైతన్యరథం): మౌలిక వసతుల కల్పన, రైతుల భూ సమస్యలు, విద్యా.. వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పన సమస్యల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించబోనని, సకాలంలో అర్జీదారులకు న్యాయం చేయాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అధికారుల్ని ఆదేశించారు. బుధవారం ఆయన తన నివాసంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి, ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన.. సంబంధిత ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో మాట్లాడి, అర్జీదారులకు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని ఆదేశించారు.

**కొందరి నిర్లక్ష్యం..జాప్యం వల్ల మొత్తం వ్యవస్థలకే చెడ్డపేరు**

యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన.. ప్రజారోగ్యం.. విద్యా సమస్యలు.. సామాజిక న్యాయం.. మౌలిక వసతుల కల్పన వంటి సమస్యల్ని వేగంగా పరిష్కరించాలని, ప్రధానంగా రైతులు ఎదుర్కొనే భూ వివాదాలు, సమస్యలపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రత్తిపాటి ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో కొందరు చూపే నిర్లక్ష్యం. చేసేజాప్యం.. మొత్తం వ్యవస్థలకే చెడ్డపేరు తీసుకువస్తోందని, ఈ పద్ధతికి తక్షణమే స్వస్తి చెప్పాలని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం తప్పకుండా సామాజిక పింఛన్లు అందిస్తుందని, కొత్త పింఛన్లపై త్వరలోనే అర్హులకు తీపి కబురు అందుతుందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రజలకు భరోసా ఇచ్చారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ



గుంటూరు (చైతన్యరథం): ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తిరుమలలో కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు వేద ఆశీర్వచనం అందించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ... "ముందుగా కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు మంచి పంటలు పండాలని, యువతకు మంచి ఉద్యోగాలు లభించాలని, ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో దేశానికి ఆదర్శ రాష్ట్రంగా ఎదగాలని శ్రీవారిని ప్రార్థించాను. తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తులకు టీటీడీ కల్పిస్తున్న వసతులు ఎంతో అద్భుతంగా ఉన్నాయి. దర్శనం, వసతి, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం, పరిశుభ్రత, భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, వైద్య సేవలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అన్ని అంశాల్లో టీటీడీ సమర్థవంతంగా పనిచేస్తోందని తెలిపారు.

## అమెరికాలో మృతి చెందిన వినుకొండ విద్యార్థిని ప్రసన్న కుటుంబానికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ప్రగాఢ సానుభూతి



వినుకొండ (చైతన్యరథం): అమెరికాలోని న్యూజెర్సీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన విద్యార్థిని మక్కెన ప్రసన్న మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారి దుఃఖంలో తాను భాగస్వామినని అన్నారు. మక్కెన ప్రసన్న మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో జీవీ ఆంజనేయులు ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయంలో విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని, బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆకాంక్షించారు.

## ఈనెల 17న కేసరపల్లిలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ప్రారంభం




గన్నవరం (చైతన్యరథం): నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్న ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేపట్టిన మరో ప్రాజెక్టు రేపు ప్రారంభం కానుంది. యార్లగడ్డ చొరవతో పీ4 కార్యక్రమంలో భాగంగా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో హెచ్సీఎల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఈనెల 17న ప్రారంభం కానుంది. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలోని యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గన్నవరంలోని హెచ్సిఎల్ ఫౌండేషన్‌ను సంప్రదించి సంస్థ సిఎస్ఆర్ నిధులతో గన్నవరంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే కోరిక మేరకు స్పందించిన హెచ్సిఎల్ యాజమాన్యం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. కేసరపల్లి గ్రామంలోని సచివాలయంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఇక్కడ శిక్షణకు అవసరమైన కంప్యూటర్లు ఏర్పాటు చేయటంతోపాటు సెంటర్ నిర్వహణకు హెచ్సిఎల్ సంస్థ సంవత్సరానికి సుమారు కోటి రూపాయలు వెచ్చిస్తుంది. ఈ కేంద్రంలో ఈ.ఎస్.ఎస్.సి.ఐ సంస్థ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించనుంది. ఈ కేంద్రంలో ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ డిప్లొమా, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యనభ్యసించిన గ్రాడ్యుయేట్లకు ఈ సంస్థలో 90రోజులపాటు వి.ఎల్.ఎస్.ఐ డిజైన్ ఇంజనీర్, కంప్యూటర్ సైన్స్‌లో శిక్షణనిస్తారు. ఎలక్ట్రానిక్, కంప్యూటర్ డిప్లొమా చేసిన విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్‌పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ 90 రోజుల శిక్షణ ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## గోదావరి- కృష్ణా నదుల అనుసంధానకర్త సీఎం చంద్రబాబు

**●వర్షాలు లేని సమయంలో కూడా కృష్ణ డెల్టాకు నీళ్ల అందించిన విజనరీ లీడర్**

**●1300 కోట్లుతో 11 నెలల సమయంలో 13 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చిన ప్రాజెక్ట్ పట్టిసీమ : ఎంపీ కేశినేని శివనాథ్**



విజయవాడ (చైతన్యరథం): ఎన్టీఆర్ జిల్లా(ఇబ్రహీంపట్నం, పవిత్ర సంగమం) ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం ప్రాంతంలోని కృష్ణ గోదావరి పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదికి వైభవంగా జలహారతి ఇచ్చారు సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి రామానాయుడు మంత్రి అనగాని సత్యప్రసాద్ మంత్రి సత్య కుమార్ యాదవ్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), జిల్లా కలెక్టర్ లక్ష్మీషా, సీనియర్ ఐఏఎస్ శశిభూషణ్ కుమార్, టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, మాజీ మంత్రి దేవినేని ఉమ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ... పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేయడానికి కూటమి సర్కార్ కృషి చేసింది అని అన్నారు. వర్షాలు లేని సమయంలో కూడా కృష్ణ డెల్టాకు నీళ్ళు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదేనని తెలిపారు.1300 కోట్లతో 11 నెలల సమయంలో 13 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చిన విజనరీ లీడర్ చంద్రబాబు అని అన్నారు. శ్రీశైలం నాగార్జునసాగర్‌లకు నీటి ప్రవాహం తగ్గినప్పటికీ పట్టిసీమ ద్వారా వస్తున్న గోదావరి జలాలు డెల్టా రైతులకు అండగా నిలిచేలా కృషిచేసిన మహానుభావుడు చంద్రబాబు అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఏదైనా బ్రాండ్ ఉంది అంటే అది సిబిఎన్ బ్రాండ్ అని ఎంపీ చిన్ని అన్నారు. గోదావరి కృష్ణ కలిపిన వ్యక్తి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబే అని తెలిపారు. మావిగన్ అని ముసలి కన్నీరు కార్చే వారికి ప్రజల గతంలోనే తగిన బుద్ధి చెప్పిన ఇప్పటికీ అదే విధానంలో వెళ్తున్నారని ప్రజలు మళ్ళీ బిల్లగుద్ది చెప్తున్నది ఒకే ఒక్క అంశం అమరావతి ఈ రాష్ట్రానికి ఏకైక రాజధాని అని అది జీర్ణించుకోలేక మావిగన్ అంటూ ఏదేదో మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతం నుంచి చిలకలూరిపేట వరకు అంత రాజధాని ప్రాంతమేనని ఆయన అన్నారు. ఈ రాజధాని ప్రాంతంలో ఉన్న మా బిడ్డలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తున్నాయి అంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత మరియు చొరవ మాత్రమేనని అన్నారు.

## పార్టీ కార్యాలయ పనులను పరిశీలించిన వీరంకి గురుమూర్తి



మచిలీపట్నం (చైతన్యరథం): నూతనంగా నిర్మాణం జరుగుతున్న కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ గౌడ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణ పనుల పురోగతిని సమగ్రంగా సమీక్షించి, పార్టీ కార్యకర్తలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడంతో పాటు, జిల్లా స్థాయిలో పార్టీ కార్యకలాపాలకు కేంద్రబిందువుగా నిలిచేలా కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దాలని సంబంధిత వారికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ అధికార ప్రతినిధి కోస్నా మురళీకృష్ణ, కృష్ణా జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి బత్తిన దాసు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం



# ఘనంగా ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల ఆవిష్కరణ

## పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు

కొండపి (చైతన్యరథం): మండలం, నేతివారిపాలెం గ్రామంలో టిడిపి నాయకులు ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారకరామారావు స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం లో రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులుతో దర్శి తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కలిసి పాల్గొన్నారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కనిగిరి శాసనసభ్యుడు ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసనసభ్యులు విజయకుమార్, మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి, ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, గ్రంథాలయం చైర్మన్ సుచిత్ర వీరయ్య పాల్గొన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య,యర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ ఎరిక్సన్ బాబు, గ్రంథాలయం చైర్మన్ సుచిత్ర వీరయ్య మాట్లాడారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్పైఆర్‌పై అప్రమత్తంగా ఉండాలి

గిద్దలూరు (చైతన్యరథం): ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల సవరణ ప్రక్రియ పై గిద్దలూరు క్యాడర్ ప్రత్యేక దృష్టి పెట్టాలని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి. ఈ ప్రక్రియ ఈనెల 24 వరకు కోసగుతుందని, ప్రతి బూత్ పరిధిలోనూ బూత్ లెవెల్ ఏజెంట్లు చురుగ్గా కదిలి, రెవెన్యూ అధికారులతోకలిసి పనిచేయాలన్నారు. జాబితాలో ఉన్న డబుల్ ఎంట్రీలు (రెండు చోట్ల ఓట్లు ఉండటం), చనిపోయిన వారి ఓట్లు (డెత్ ఓట్లు) గుర్తించి వాటిని తొలగించే విధంగా గట్టి నిఘా ఉంచాలని సూచించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను, కుట్రలను క్షేత్రస్థాయిలోనే తిప్పికొట్టాలని, ప్రతి వార్డు గ్రామ స్థాయిలో పార్టీని అజేయమైన శక్తిగా మార్చేందుకు యువత, బలహీన వర్గాల భాగస్వామ్యంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి జెడ్పిటిసి సభ్యులు బుడతా మధుసూదన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు పందీటి రజిని బాబు, ప్రధాన కార్యదర్శి బొజ్జా రంగనాథ్, మరియు యూనిట్ ఇంచార్జ్ లు, బూత్ ఇన్ఛార్జ్ లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, మండల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.






# స్థానిక ఎన్నికల్లో గెలుపు మనదే కావాలి

## టీడీపీ శ్రేణులకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపు

కోవూరు (చైతన్యరథం): కోవూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధ్యక్షతన జరిగిన కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కూటమి పాలనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అగాధం నుండి అభివృద్ధి వైపు నడిపించారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించక పోయిన చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 80 శాతం అమలు చేశారన్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తేవడంతో పాటు, యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం నుండి పెద్ద ఎత్తున నిధులు తెచ్చి కోవూరు నియోజకవర్గాన్ని నియోజకవర్గం లో ఎన్నో ఏళ్ల నుండి పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించారు. ప్రభుత్వ నిధులతో పాటు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా స్వంత నిధులతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేయించారు. విపిఆర్ నేత్ర ద్వారా అందరికీ కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు ఇస్తున్నారన్నారు. స్వంత మిషన్లు పెట్టి ఇరిగేషన్ కాలువలు పూడిక తీయించారు. కొడవలూరు మండలం లోని కిసాన్ సెజ్ ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలు గడిచినా , ఇప్పటి వరకూ ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, శాసనసభ్యురాలు ప్రశాంతి రెడ్డి కృషితో కిసాన్ సెజ్ లో పరిశ్రమలు వస్తున్నాయియన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కోవూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులను అందరిని గెలిపించాలని, అందుకోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# దొనకొండ చెరువులకు మహర్దశ

## డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడి

ఒంగోలు (చైతన్యరథం): ప్రకాశం భవనం ఆవరణలోని పీజీఆర్ఎస్ మావేశ హాల్లో బుధవారం జరిగిన ప్రకాశం జిల్లా సమీక్షా మండలి సమావేశంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ పి రాజబాబు, మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రిగొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డితో పాటు కలిసి దర్శి టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ జిల్లా సమీక్ష మండలి సమావేశంలో చెరువుల అభివృద్ధిపై చర్చ జరిగిందన్నారు. ఉపాధి హామీ, ఉద్యానవన, నానా పటేకర్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో పెద్ద ఎత్తున చెరువులను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ రాజబాబు ప్రణాళికాబద్ధంగా అంచనాలు రూపొందిస్తున్నారని ఆమె వివరించారు. గుండ్లకమ్మ నీటిని వినియోగించుకునేందుకు 100 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ లెఫ్ట్ ఇరిగేషన్ నానా పటేకర్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో జరుగుతుందన్నారు.

దొనకొండలో మొత్తం 46 చెరువులు ఉన్నాయని ఈ చెరువులో పూడికలన్నీ తీసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే 66 లక్షలతో రుద్రసముద్రం, పుల్లాయపాలెం గ్రామాలలో చెరువు కూడికల పనులు చేపట్టినట్లు ఆమె పేర్కొ న్నారు. దొనకొండ పారిశ్రామిక అభివృద్ధికి, తాగునీటి ఎద్దడి లేకుండా డీఆర్డీపే ప్రాజెక్టుకు కూడా అవసరమైన నీటిని అందించే విధంగా ముందుకు వెళ తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 23వ తేదీ జిల్లా కలెక్టర్ దొనకొండ మండలంలోని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రతిపాదిత ప్రాంతాన్ని చెరువులను సందర్శించి అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని దొనకొండను అభివృద్ధి ప్రాంతంగా తీర్చిదిద్దే లక్ష్యంగా కరువు రహిత ప్రాంతంగా మార్చడానికి మన కూటమి ప్రభుత్వంలో అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో వెనుకబడిన ప్రాంతాలకు ఇచ్చే సబ్సిడీలను దొనకొండకు వర్తింపజేసేందుకు కూడా కృషి చేస్తున్నామన్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితులు, తాగునీటి ఎద్దడి, రైతులకు అవసరమైన ప్రభుత్వ సహకారం ఆర్డబ్ల్యూఎస్ స్కీమ్స్ మరమ్మత్తులు తదితర అంశాలపై సమీక్ష సమావేశంలో అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని డాక్టర్ లక్ష్మీ వివరించారు. దర్శి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను రోడ్లు, డ్రైన్లు మౌలిక సదుపాయాల కల్పనపై సమావేశం దృష్టికి తీసుకురావడం జరిగిందని అందుకు అధికారుల నుండి సానుకూలత వచ్చిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కనిగిరి శాసనసభ్యుడు ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసనసభ్యులు విజయకుమార్, మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణ రెడ్డి, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తముల అశోక్ రెడ్డి, ఏపీ మారి టైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, ఏపీ టీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, రాఖణూ చైర్మన్ షాక్ రియాజ్, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ కామేపల్లి సీతారామయ్య, గ్రంథాలయం చైర్మన్ సుచిత్ర వీరయ్య పాల్గొన్నారు.



# అభివృద్ధిని కాదనే ధైర్యం వైకాపా నేతలకు ఉందా?



రాయదుర్గం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ పాలనపై బురదచల్లి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే వైకాపా నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తున్నారని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో వైకాపా నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాలు "దయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉన్నాయని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయదుర్గం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల కళ్ల ముందే కనిపిస్తున్నప్పటికీ వాటిని కాదని మాట్లాడటం వైకాపా నేతల బరితెగింపుకు నిదర్శనమన్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో రాయలసీమ తీవ్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై కేవలం రూ.2,000 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని, అయితే చంద్రబాబు నాయకత్వంలో 2014--19 ప్రభుత్వంలో రూ.12,441 కోట్లు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.12,484 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. మొత్తంగా చంద్రబాబు నాయకత్వంలో ఏడేళ్ల కాలంలో సీమ సాగునీటి ప్రాజెక్టులపై దాదాపు రూ.27 వేల కోట్లు వెచ్చించినట్లు గణాంకాలతో వివరించారు. రాయలసీమ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొంటూ రూ.4.44 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటుతో సీమలో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తోందన్నారు. వీటి ద్వారా స్థానికంగా 2.76 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలో మినహా ఇక ఏ ప్రభుత్వంలో కూడా జరగలేదని స్పష్టం చేశారు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసిన మాజీ ముఖ్యమంత్రి జగన్, ఆయన పార్టీ నేతలు ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అలగనూరు, ఫించ, శ్రీశైలం, తుంగభద్ర వంటి కీలక ప్రాజెక్టుల గేట్లకు కనీస గ్రీసు కూడా వేయించలేని దౌర్భాగ్య పాలన అందించిన జగన్ నాయకత్వంలో పనిచేయడానికి ఆ పార్టీ నాయకులు సిగ్గుపడాలన్నారు. తన సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 38 మంది ప్రాణాలు కోల్పోయినా జగన్‌లో బాధ్యతాయుత స్పందన కనిపించలేదని ఆరోపించారు. రాయలసీమ సాగునీటి అంశాలపై నెల్లూరులో ఇటీవల జరిగిన ఆ పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో స్వయానా వైకాపా మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డే తమ పాలన పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని కాలవ గుర్తు చేశారు. ప్రజల ముందు కనిపిస్తున్న వాస్తవాన్ని ఎవరైనా అంగీకరించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. గత ఏడాది భారీ వరదలకు తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోతే ఏడాది తిరగకముందే 33 కొత్త గేట్లను పూర్తిస్థాయిలో అమర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రాయలసీమ ప్రగతికి కట్టుబడి పనిచేస్తున్న చంద్రబాబు నాయకత్వానికి సీమ ప్రజలంతా అండగా నిలవాలని కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

## అభివృద్ధికి ఎమ్మెల్యే ముత్తుముల అవిశ్రాంత కృషి

గిద్దలూరు (చైతన్యరథం): పట్టణ తెలుగుదేశం పార్టీ బలోపేతమే ధ్యేయంగా, కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లేందుకు స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సయ్యద్ శనేశావళి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పట్టణ కార్యకర్తలు, నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశా వలి మాట్లాడుతూ, గిద్దలూరు నియోజకవర్గ వర్గ వికాసానికి మరియు పట్టణ సమగ్ర అభివృద్ధికి స్థానిక శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర కూటమి ప్రభుత్వం నుండి నిరంతరం ప్రత్యేక నిధులను రాబడుతూ గిద్దలూరును ప్రగతి పథంలో నడిపిస్తున్నారని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా పట్టణానికి రూ. 50 కోట్ల భారీ వ్యయంతో "బీసీ గురుకుల హాస్టల్" మంజూరు చేయించడం ఎమ్మెల్యే నిరంతర కృషికి నిదర్శనమన్నారు. గిద్దలూరు పట్టణంలో దశాబ్దాలుగా వేధిస్తున్న మౌలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు.

# దానయ్య మృతిపై జగన్ వ్యాఖ్యలు దారుణం

### రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్, గొల్ల నరసింహ యాదవ్



తిరుపతి (చైతన్యరథం): పలాసలో గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ తీవ్రంగా ఖండించారు. తిరుపతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడిని సమర్థించేలా జగన్ చేసిన వ్యాఖ్యలు యాదవులు, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయని మండిపడ్డారు. ఒక పేద యాదవ కుటుంబానికి చెందిన దానయ్య ప్రాణం కోల్పోయిన ఘటనను తేలికగా తీసుకోవడం బాధ్యతాయుత నాయకుడి వైఖరి కాదని విమర్శించారు. జగన్ చేసిన "యాక్సిడెంట్లు జరుగుతుంటాయి... 18 ఏళ్ల పిల్లోడికి ఏమి తెలుస్తుంది?" అనే వ్యాఖ్యలను ప్రస్తావించిన నరసింహ యాదవ్, 18 ఏళ్లు నిండిన వ్యక్తి చట్టం దృష్టిలో మైనర్ కాదని, ఓటు హక్కు కలిగిన పూర్తి బాధ్యత గల పౌరుడని గుర్తు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో వాహనం నడిపే ప్రతి ఒక్కరూ చట్టపరమైన బాధ్యత వహించాల్సిందేనని చెప్పారు. సామాన్యుడు ప్రమాదానికి కారణమైతే కఠిన చర్యలు తీసుకుని, మాజీ మంత్రి కుమారుడి విషయంలో మాత్రం "చిన్న పిల్లాడు" అంటూ సమర్థించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. దానయ్య కూడా ఒక మనిషేనని, అతని ప్రాణం విలువలేనిదిగా చిత్రీకరించడం అమానుషమని నరసింహ యాదవ్ అన్నారు. ప్రమాదంలో మరణించిన కుటుంబాన్ని పరామర్శించాల్సిన మాజీ ముఖ్యమంత్రి, నిందితుడికి అండగా నిలవడం చట్టాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని ఆరోపించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన దానయ్య భార్యా పిల్లలు నేడు దిక్కులేని పరిస్థితిలో ఉన్నారని, వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. "ఒకవేళ ఇదే ప్రమాదం సామాన్య యాదవ యువకుడు చేసి ఉంటే కూడా జగన్ ఇదే విధంగా స్పందించేవారా?" అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ హోదా లేదా కుటుంబ నేపథ్యం ఆధారంగా నిందితులను రక్షించే ప్రయత్నాలు ప్రజాస్వామ్యంలో అంగీకారయోగ్యం కావని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో చట్టం ముందు అందరూ సమానమేనని, నిందితుడు మాజీ మంత్రి కుమారుడైనా చట్ట ప్రకారం విచారణ జరిగి బాధ్యులపై చర్యలు తప్పవని నరసింహ యాదవ్ తెలిపారు. దానయ్య కుటుంబాన్ని బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం లేదా రాజీ ప్రయత్నాలు చేయడం సహించబోమని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి రక్షణ, సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. వరద బాధితులు, మత్స్యకారులను పరామర్శించే పేరుతో పర్యటనలు చేస్తూనే ఇటువంటి ఘటనల్లో నిందితులను సమర్థించడం రాజకీయ నైతికతకు విరుద్ధమని నరసింహ యాదవ్ విమర్శించారు. గత పాలనలో బీసీలు, యాదవులు, ఎస్సీలపై జరిగిన ఘటనలను ప్రజలు మరచిపోలేదని, ఇప్పుడు కూడా అదే ధోరణిని సమర్థించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. చట్టాన్ని గౌరవించడం, బాధితులకు న్యాయం చేయడం ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని స్పష్టం చేశారు.

# రాయలసీమకు పట్టిన చీడ పురుగు జగన్

### టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎంఎస్‌రాజు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



మడకశిర (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంలో రాయలసీమ జిల్లాలో సాగు, తాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరుగుతున్న మంచి పనుల గురించి వైసీపీ నేతలు తమ అంతర్గత రౌండ్ టేబుల్ సమావేశాల్లో సైతం చర్చించుకోవడం మా కూటమి ప్రభుత్వం పనితీరుకు, ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలనాదక్షతకు నిదర్శనమని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎంఎస్‌రాజు అన్నారు. మడకశిర క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాయలసీమ సాగు, తాగునీటి ప్రాజెక్టుల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హంద్రీనీవాకు మా ప్రభుత్వంలో రూ.3,500కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఇటీవల హిందూపురం నుండి మడకశిర బ్రాంచ్ కెనాల్ కు రూ.750కోట్లతో పనులు చేశామన్నారు. తమ ప్రభుత్వంలో రాయలసీమ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులు పరుగులు పెడుతున్న విధానాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మా ప్రభుత్వం బడ్జెట్లు కేటాయించడంతో పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైసీపీ మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ ఇన్చార్జి విశ్వేశ్వరరెడ్డి ఇటీవల నెల్లూరులో జరిగిన వైసీపీ నేతల సభలో సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారని గుర్తు చేశారు. హంద్రీనీవాకు గతంలో వేలకోట్లు బడ్జెట్ కేటాయించి చంద్రబాబు పనులు చేపించారు. సీపీ పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు రూ.2వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు రాయలసీమకు చేస్తున్న మంచిని వైసీపీ నేతలే ఒప్పుకుంటున్నారన్నారు. విశ్వేశ్వరరెడ్డి వ్యాఖ్యలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని పిలుపునిచ్చారు. . రాయలసీమ నాలుగు జిల్లాలు, ప్రకాశం, నెల్లూరుజిల్లాలకు చెందిన వైసీపీ నేతల సభలోనే విశ్వేశ్వరరెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. వైసీపీ నేతల రెండు నాల్కల ధోరణిని వైసీపీ నేతలు పునఃపరిశీలించుకోవాలి. రాయలసీమ ప్రాజెక్టులను నిర్వీర్యం చేసిన దుర్మార్గుడు జగన్ అన్నారు. జీఓ 365తెచ్చి 102సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం చేసిన నీచమైన చరిత్ర జగన్మోహన్ రెడ్డిది. అన్నమయ్య డ్యామ్ గేట్లు తెగిపోయి, ముంపుతో దాదాపు 45మంది చనిపోతే కనీసం జగన్ బాధిత కుటుంబాలను ఆదుకోలేదు. ఇరిగేషన్ విషయంలో వైసీపీ అధికారంలో ఉండగా ఒకమాట, అధికారం పోయిన తర్వాత మరొక మాట మాట్లాడుతూ రెండు నాల్కల ధోరణిని వైసీపీ నేతలు అవలంభిస్తున్నారు. రాయలసీమకు తాగు, సాగునీటి ప్రాజెక్టుల విషయంలో అన్న ఎన్టీఆర్ మొదలు నేడు చంద్రబాబు వరకు పనులు వేగంగా చేస్తున్నారు. చెరువులకు కూడా నీళ్లు పుష్కలంగా ఇస్తున్నారు. హార్టీ కల్చర్, వ్యవసాయం, ఇతర రంగాలకు చంద్రబాబు నీరు అందిస్తున్నారు. కర్నూలుకు హైకోర్టు బెంచికి భూములు కేటాయించడం, పుట్టపర్తి, రాయలసీమ జిల్లాలకు పరిశ్రమలు రావడం, వేలకోట్ల పెట్టుబడులు రావడం, పరిశ్రమలు రావడంతో రాయలసీమ అభివృద్ధికి కారణం చంద్రబాబు అన్నారు. పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్ మాత్రమేనన్నారు. వైసీపీ పాలనలో ఒక్క ప్రాజెక్టు రాలేదు, పెట్టుబడి రాలేదు, సాగునీటి ప్రాజెక్టులు, తాగునీటి ప్రాజెక్టులను జగన్ అటక ఎక్కించారన్నారు. జగన్ తన పాలనలో రైతులను, పారిశ్రామికవేత్తలను పూర్తిగా గాలికొదిలేశాడన్నారు. నేడు అధికారం కోల్పోయిన తర్వాత తన వైఫల్యాలను కూటమి ప్రభుత్వంపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. అయితే తాజాగా విశ్వేశ్వరరెడ్డి చేసిన వ్యాఖ్యలు వాస్తవానికి అద్దం పడతాయన్నారు. చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తాయి. ఈ రెండేళ్లలో పెట్టుబడులు, సాగు, తాగు నీటి ప్రాజెక్టుల కోసం చంద్రబాబు ఏం చేశారో వైసీపీ నేతలకు తెలుసునన్నారు. వైసీపీ నేతలు ఆత్మవిమర్శతో ముందుకు వెళ్లడం మానేసి, అసత్యాలు, అబద్దాలతో కూటమి ప్రభుత్వంపై బురదజిమ్మి పబ్బం గడపాలని చూడడం దుర్మార్గం. విశ్వేశ్వరరెడ్డి రాయలసీమ పట్ల తనకున్న చిత్తశుద్ధిని నిరూపించడాన్ని అభినందిస్తున్నానన్నారు. మిగిలిన రాయలసీమ వైసీపీ నేతలు కూడా ఆత్మవిమర్శ చేసుకోవాలని, వాస్తవాలు గ్రహించాలని కోరుతున్నాను అని ఎం.ఎస్.రాజు అన్నారు. విశ్వేశ్వరరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడిన మాటల వీడియోను మీడియాకు చూపించారు.

# తరాల వారధి 'తానా'

## అట్లాంటాలో వేడుకగా 'పెద్దల పండుగ'

### తాతయ్యలు, అమ్మమ్మలు, నానమ్మలకు ఘన సన్మానం



**అట్లాంటా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. కుటుంబ మూలాలను, మన సంస్కృతిని కాపాడుకోవాలనే ఉద్దేశంతో తాతయ్యలు, నానమ్మలు/అమ్మమ్మలను గౌరవిస్తూ అట్లాంటా నగరంలో ప్రత్యేకంగా ఒక సన్మాన సభ నిర్వహించింది. ఉత్తర అమెరికాలో ఒక స్వచ్ఛంద సంస్థ పెద్దల కోసం ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం బహుశా ఇదే తొలిసారి.

తానా ఈ వేడుకను 'తరాలను అనుసంధానించడం' (Reconnecting Generations) అనే థీమ్‌తో జరిపింది. ఇందులో పెద్దల కోసం రకరకాల వినోద కార్యక్రమాలు, సంప్రదాయ ఆటలు నిర్వహించారు. ఎండ వేడికి ఉపశమనం కలిగించేలా అతిథులకు చల్లని మజ్జిగ, పుచ్చకాయ ముక్కలు అందించారు. అనంతరం అందరూ కలిసి పండుగలా సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా 'తానా పాఠశాల' విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విదేశాల్లో ఉంటున్న పిల్లలు తమ మాతృభాషను, సంప్రదాయాలను మర్చిపోకుండా ఉండటానికి ఈ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతోందని అక్కడకు వచ్చిన తల్లిదండ్రులు, పెద్దలు వారి అభిప్రాయాలను పంచుకున్నారు.

'తానా' అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, శ్రీనివాస్ లావు (ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్), అంజయ్య చౌదరి లావు (మాజీ అధ్యక్షుడు) ఈ వేడుకను నిర్వహించిన వారిని అభినందించారు. పులానీ జాస్తి, మాలతీ నాగభైరవ, వినయ్ మద్దినేని, శ్రీనివాస్ ఉప్పు, కోటి కందిమల్లు, చైతన్య కోరపాటి, మహేష్ కొప్పు, శ్రీను రామానందం, మురళి బొద్దు, రాజేష్ జంపాల, అనిల్ యలమంచాలి, శిరీష కాట్రగడ్డ, హరి అద్దంకి, శరత్ పుట్టి, సంజీవ్ ఎక్కలూరి, ముఖర్జీ వేములపల్లి, విజయ మద్దిపట్ల, శ్రీధర్.వి, సుజాత దేవరపల్లి, స్వప్నా యార్లగడ్డ, సుశ్మా కొర్రపాటి, పాఠశాల అట్లాంటా కో-ఆర్డినేటర్ వాణి రెడ్డి తదితరులు కార్యక్రమ విజయవంతానికి కృషి చేశారు.

ఈ వేడుక 'తానా' నాయకురాలు సోహిని అయినాల స్వాగతోపన్యాసంతో మొదలైంది. పూలాని జాస్తి, మాలతి నాగభైరవ పెద్దలందరినీ సాదరంగా ఆహ్వానించారు. మధుకర్ యార్లగడ్డ వేడుకను విజయవంతం చేసిన వాలంటీర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శేఖర్ కొల్లు ఈ ఈవెంట్ పర్యవేక్షణ బాధ్యతలు చూసుకున్నారు. నిర్వాహకుడు సునీల్ దేవరపల్లి మాట్లాడుతూ... "పెద్దల మీద ప్రేమను చాటడానికి, కుటుంబ బంధాలను బలపర్చడానికి ఈ కార్యక్రమం నిర్వహించాం. వారితో గడిపే కొద్దిపాటి సమయం, పంచుకునే కథలు మన విలువలను కాపాడతాయి" అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్థికంగా అండగా నిలిచిన బిర్యానీ పాట్, మన విందు, ఎపిక్ ఈవెంట్స్, మారుతి ఫుడ్స్, మిస్టిక్ ఫ్లేవర్స్, సాయిబాబు మద్దినేని, ఓమ్స్ క్లీనర్స్, ఇండిఫ్రెష్ సంస్థలకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. పెద్ద సంఖ్యలో పాల్గొని సహాయం చేసిన యువ వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ఈ వేడుకలో పాల్గొని పెద్దల సన్మాన కార్యక్రమానికి తమ మద్దతు తెలియజేసిన 'మైత్రి కమ్యూనిటీ'కి చెందిన విజు చిలువేరు, వారి బృందానికి తానా తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

చివరగా శ్రీనివాస్ లావు మాట్లాడుతూ... పెద్దలను కేవలం ఒకరోజు మాత్రమే కాదు ప్రతిరోజూ ప్రేమతో, గౌరవంతో చూసుకోవాలని కోరారు. తానా పాఠశాల (లేదా) తదుపరి కార్యక్రమాల గురించిన వివరాలకు తానా అట్లాంటా టీమ్‌ను సంప్రదించాలని సూచించారు.








# న్యూజెర్సీలో ఘోర రోడ్డు ప్రమాదం

## పల్నాడు యువతి ప్రసన్న దుర్మరణం

**న్యూజెర్సీ:** అమెరికాలో జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి ప్రాణాలు కోల్పోయింది. పల్నాడు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన మక్కెన ప్రసన్న (27) న్యూజెర్సీలో జరిగిన కారు ప్రమాదంలో మృతి చెందారు.



ఉమ్మడివరానికి చెందిన రైతు కుటుంబీకులు మక్కెన వెంకటేశ్వర్లు-గోవిందమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమార్తె అయిన ప్రసన్న ఉన్నత చదువుల కోసం 2022లో అమెరికా వెళ్లింది. అక్కడ ఎంఎస్ పూర్తి చేసి ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాల్లో వుంది. ఈ క్రమంలో మంగళవారం తన ముగ్గురు స్నేహితులతో కలిసి కారులో ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ప్రసన్న అక్కడికక్కడే మృతి చెందగా ఆమె ముగ్గురు స్నేహితులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు, సహాయ సిబ్బంది సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఆశల పల్లకీలో అమెరికా వెళ్లిన పెద్ద కుమార్తె ఆకస్మిక మరణ వార్త విని వెంకటేశ్వర్లు కుటుంబం కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ప్రసన్న మరణంతో ఉమ్మడివరంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలముకున్నాయి.

విషయం తెలుసుకున్న ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లకు ఫోన్ చేసి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రసన్న మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. తన కుమార్తె భౌతికకాయాన్ని వీలైనంత త్వరగా భారతదేశానికి రప్పించేలా చూడాలని కుటుంబసభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# అమెరికాలో తొలిసారిగా శత రుద్ర యాగం

**బాల్విన్ (అమెరికా):** "లోకాసమస్తా సుఖినోభవంతు" అనే విశ్వమంగళ సంకల్పంతో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో తొలిసారిగా నిర్వహిస్తున్న "నవకుండాత్మక శత చండీ సహిత శత రుద్ర యాగం" ఆధ్యాత్మిక చరిత్రలో ఒక చిరస్మరణీయ ఘట్టంగా నిలవబోతోంది. మిస్సోరీ రాష్ట్రంలోని బాల్విన్ నగరంలో ఉన్న ది హిందూ టెంపుల్ ఆఫ్ సెయింట్ లూయిస్ ఈ మహా యజ్ఞానికి వేదికైంది. మంగళవారం మొదలైన ఈ క్రతువు ఆదివారం వరకు జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం మహన్యాస పూర్వక శతరుద్ర హోమం, సాయంత్రం శతచండీ పారాయణం హోమం నిర్వహిస్తారు. మొత్తం ఐదు రోజుల్లో వందసార్లు చండీ పారాయణ చేస్తారు. ఈ మహా యాగంలో శత చండీ, శత రుద్ర యాగాలతో పాటు దశ సహస్ర మోదక, ప్రత్యంగిరా, రాజశ్యామల, వారాహీ, నక్షత్ర, అరుణ హోమాలు, దుర్గ, సరస్వతి, గాయత్రి, లక్ష్మీ దేవతలకు పదివేల తామర పుష్పాలతో మహా కమలార్చన హోమం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.

ఈ మహా యజ్ఞంలో ముఖ్యంగా శత చండీ పారాయణం నిర్వహించేందుకు అమెరికాలోని పలు రాష్ట్రాలతో పాటు భారతదేశం నుంచి 30 మందికి పైగా రుత్వికులు పాల్గొంటున్నారు. వేదాంతం శర్మ ఆధ్వర్యంలో వేదశాస్త్ర నియమాలను అత్యంత



కచ్చితత్వంతో పాటిస్తూ ప్రతి క్రతువు రుపుతున్నారు. ప్రత్యేక యాగశాల, తొమ్మిది హోమ గుండాలు, భక్తుల కోసం ప్రత్యేక ఏరాట్లు, అన్నప్రసాదం, వసతి, రవాణా వంటివి ఏర్పాటు చేశారు.

ఈ యాగం విజయవంతానికి వివిధ కమిటీల చైర్మన్లు, సభ్యులు, వందలాది మంది స్వచ్ఛంద సేవకులు రాత్రింబవళ్లు సేవలందిస్తున్నారని యాగ కమిటీ చైర్మన్ గంగవరపు రజనీకాంత్ తెలిపారు. శివపార్వతి, వల్లీదేవసేన, సుబ్రహ్మణ్య, శ్రీనివాస, శ్రీలక్ష్మీనరసింహ, సీతారామ, రుక్మిణీకృష్ణ కళ్యాణాలను నిర్వహిస్తున్నామని కమిటీ ఉపాధ్యక్షుడు సాక్షి విజయ్, కార్యదర్శి జంగా కిషోర్ తెలిపారు.

ఈ వేడుక నిర్వహణకు ఇప్పటివరకు మిలియన్ డాలర్లు (రూ.9.4కోట్లు) సమకూరినట్టు మీడియా విభాగ సమన్వయకర్త రాజా సూరపనేని వెల్లడించారు. లోక కల్యాణమే సంకల్పంగా అమెరికాలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవంలో ప్రవాసులు విరివిగా పాల్గొనాలని ఆలయ కమిటీ నిర్వాహకులు కోరారు.




# ప్రాణం తీసిన స్కై డైవింగ్ సరదా

## విజయవాడ యువకుడు మణిచంద్ర తేజ మృతి

**మసాచుసెట్స్:** ఉన్నత శిఖరాలు అధిరోహించాలనే ఆకాంక్షతో అమెరికా వెళ్లిన ఓ తెలుగు యువకుడి ప్రయాణం అర్ధంతరంగా ముగిసిపోయింది. వీకెండ్ సరదా కోసం వెళ్లిన ఆ యువకుడిని స్కై డైవింగ్ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాదం తెలుగు రాష్ట్రాల్లోని అతని కుటుంబ సభ్యులతో పాటు అమెరికాలోని ప్రవాస భారతీయులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.



మణిచంద్ర తేజ గడ్డం (28) అనే భారతీయ యువకుడు ఈ నెల 12న మసాచుసెట్స్‌లోని ఆరంజ్ పట్టణంలో ఉన్న 'జంప్‌టౌన్ స్కై డైవింగ్' కేంద్రానికి వెళ్లాడు. స్కై డైవింగ్ విజయవంతంగా ముగించి కిందకు దిగుతున్న సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఒక్క ఉదుటున బలమైన గాలులు వీయడంతో పారాచూట్ నియంత్రణ కోల్పోయింది. ఈ క్రమంలో మణిచంద్ర తేజ దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి ఒక్కసారిగా కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన సిబ్బంది హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది.

ఈ ఘోర ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, కారణాలపై అమెరికా పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. మణిచంద్ర తేజ తల్లిదండ్రులది ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ కాగా.. కుమారుడి ఉన్నత చదువుల నిమిత్తం వారు కొంతకాలం క్రితం హైదరాబాద్ వెళ్లి అక్కడే నివసిస్తున్నారు.

మణిచంద్ర తేజ అమెరికాలోని నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఇటీవలే ఒక ప్రతిష్టాత్మక సంస్థలో ఉద్యోగంలో చేరినట్టు తెలుస్తోంది. సాహస క్రీడపై ఉన్న ఆసక్తితో స్కై డైవింగ్ చేస్తుండగా ఈ ఘోర ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోవడంతో అతడ కుటుంబంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

# పీవోకేలో పతాక స్థాయికి ఉద్రిక్తతలు

## పాక్ చర్యలను ఖండిస్తూ పీఓకేలోని జేఏసీ భారీ ర్యాలీ



పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి. పాక్ ప్రభుత్వ ఆణచివేత చర్యలను నిరసిస్తూ పీఓకేలోని జాయింట్ యాక్షన్ కమిటీ భారీ నిరసన ర్యాలీకి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పాక్ ప్రభుత్వం 4 వేల మంది భద్రతా సిబ్బందిని వివిధ నగరాలు, టౌన్‌లల్లో మోహరించింది. మీడియా సిబ్బందిపై కూడా నిషేధించింది. రవాల్ కోట్ నుంచి ముజఫరాబాద్ వరకూ 40 వేల మందితో భారీ నిరసన ర్యాలీకి జేఏఏసీ పిలుపునిచ్చినట్టు తెలుస్తోంది. దీంతో, ప్రభుత్వం ఈ ర్యాలీని అడ్డుకునేందుకు భారీ స్థాయిలో రేంజర్లు, పోలీసు బలగాలను మోహరించింది. గత కొన్ని నెలలుగా పీఓకే నిరసనలతో అట్టుడుకుతున్న విషయం తెలిసిందే. పీఓకే చట్టసభలో స్థానికుల ప్రాతినిధ్యానికి గండిపడేలా ప్రభుత్వం పాక్ వాసులను ఎమ్మెల్యే సీట్లకు నామినేట్ చేయడంతో మొదలైన నిరసనలు అంతకంతకూ తీవ్రరూపం దాలుస్తూ ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. నిరసనలపై ఉక్కుపాదం మోపేందుకు ప్రభుత్వం అరెస్టులు, ఇంటర్నెట్‌షట్‌డౌన్‌లు, భద్రతా దళాల మోహరింపులతో పరిస్థితిని అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నా ఆశించిన ఫలితంగా లేకపోగా పరిస్థితి మరింత దిగజారుతోంది. మంగళవారం జరిగిన నిరసనల్లో ఏకంగా 12 మంది మరణించారు. ఈ ఘటనలపై స్పందించిన భారత్ పాక్ ప్రభుత్వ తీరును ఎండగట్టింది. దశాబ్దాల తరబడి అణచివేతకు ఈ నిరసనలు ప్రతిబింబమని వ్యాఖ్యానించింది.



# వన్‌మ్యాన్ షోగా తృణమూల్

## మాజీమంత్రి మదన్ మిత్ర సంచలన వ్యాఖ్యలు

కమర్హాతి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మిత్ర పార్టీని వీడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు బెంగాల్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ లక్ష్యంగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. 'పార్టీ నాశనమైపోతోంది.. పడవ మునిగిపోతోంది. ప్రజలు చనిపోతున్నారు. అయినా సరే, అభిషేక్ బెనర్జీని ఎలాగైనా కాపాడుకోవాలనే ధోరణిలోనే పార్టీ నిర్ణయాలు ఉన్నాయి. అభిషేక్ కనీసం ఆరు నెలలు లేదా ఏడాది పాటు పక్కకు తప్పుకోవాలని, పార్టీని మేము నిర్మిస్తామని స్వయంగా ఆయనకే సూచించాను. కానీ ఆయన దానికి నిరాకరించారు. పార్టీ అందరిదీ కాకుండా.. కేవలం అభిషేక్ బెనర్జీ చుట్టూనే తిరుగుతోంది.' అంటూ మదన్ మిత్ర సంచలన ఆరోపణలు గుప్పించారు. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరో పెను సంచలనం నమోదైంది. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి కోలుకోలేని విధంగా గట్టి షాక్ తగిలింది. టీఎంసీలో కీలక నేత, మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా పేరుగాంచిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే మదన్ మిత్ర పార్టీకి గుడ్‌బై చెప్పారు. రీతాబ్రతా బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు టీఎంసీ వర్గంలో ఆయన చేరడం బెంగాల్ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

# పదేపది నిముషాల్లో ఇంటికి గ్యాస్ సిలిండర్

## ఇన్‌స్టామార్ట్‌తో హెచ్‌పీసీఎల్ సంస్థ ఒప్పందం

ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు రీఫిల్‌ను బుక్ చేసుకున్న రెండు మూడు రోజులకు సిలిండర్ డెలివరీ అవుతోంది. అయితే, ఈ మాత్రం జాప్యం కూడా లేకుండా క్విక్ కామర్స్ ద్వారా 10 నిమిషాల్లోనే సిలిండర్లను ఇంటికి చేరవేసే కొత్త విధానం త్వరలో బెంగళూరు వాసులకు అందుబాటులోకి రానుంది. ఇందుకోసం స్విగ్గీకి చెందిన క్విక్ కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్‌తో హెచ్‌పీసీఎల్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల నవ్య సిలిండర్లు బుక్ చేసుకున్న పది నిమిషాల్లోనే కస్టమర్ల ఇంటికి చేరుకుంటాయి. గ్యాస్ కనెక్షన్ లేని వారు, చిన్న కుటుంబాలు, విద్యార్థులకు అనువుగా హెచ్‌పీసీఎల్ సంస్థ నవ్య గ్యాస్ సిలిండర్‌లను రూపొందించింది. సాధారణ స్టీల్ సిలిండర్‌ల కంటే భిన్నమైన కాంపోజిట్ పాలిమర్‌తో నవ్య సిలిండర్‌లను తయారు చేశారు. పాక్షిక పారదర్శకంగా ఉండే ఈ సిలిండర్లలో గ్యాస్ నిల్వలు ఎంత ఉన్నాయో చూస్తే తెలిసిపోతుంది. అంతేకాకుండా, సాధారణ స్టీల్ సిలిండర్ల కంటే ఇవి 50 శాతం బరువు తక్కువగా ఉంటాయి. క్విక్ కామర్స్‌లో బుక్ చేసుకున్నప్పటికీ ఈ సిలిండర్‌లను సాధారణ గ్యాస్ ఏజెన్సీల ద్వారానే డెలివరీ చేయనున్నారు. ఏజెన్సీలకు చెందిన నిపుణులైన సిబ్బంది వీటిని కస్టమర్లకు డెలివరీ చేస్తారని హెచ్‌పీసీఎల్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి సారి బుక్ చేసుకునే వారి వద్ద నుంచి అన్ని రకరాల ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నాక సిలిండర్ కేటాయింపు ఉంటుందని సంస్థ పేర్కొంది. ఆ తరువాత బుక్ చేసుకునే వాటిని రీఫిల్‌గా పరిగణిస్తామని తెలిపింది. రీఫిల్ డెలివరీ తీసుకునే సమయంలో ఖాళీ నవ్య సిలిండర్‌ను కస్టమర్లు తిరిగిచ్చేయాల్సి ఉంటుంది. ఎల్‌పీజీ సిలిండర్‌లను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ఈ సేవను తీసుకొచ్చామని హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ అమిత్ గర్గ్ తెలిపారు. అయితే, ఇతర నగరాలకు ఈ సేవలను ఎప్పుడు విస్తరిస్తారనేది మాత్రం ఇంకా వెల్లడించలేదు.

## ఎలక్ట్రిక్ బైక్‌లో చెలరేగిన నిప్పురవ్వలు

# నోయిడాలో భారీ అగ్నిప్రమాదం

నోయిడాలోని మామురా గ్రామంలో బుధవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. 50 కుటుంబాలను రక్షించినట్లు తెలిపారు. ఎలక్ట్రిక్ బైక్‌లో చెలరేగిన నిప్పురవ్వలే ఈ ప్రమాదానికి కారణమని చెప్పారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ ప్రమాదంపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరా తీశారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ అగ్నిప్రమాదంపై తమకు సమాచారం అందిన వెంటనే ఏడు అగ్నిమాపక వాహనాలతోపాటు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారని జాయింట్ కమిషనర్ రాజీవ్ నారాయణ్ వెల్లడించారు. ఎగిసిపడుతున్న మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారని తెలిపారు. ఈ అగ్నిప్రమాదం వల్ల భారీగా పొగ వ్యాపించడంతో.. ఇద్దరు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని అన్నారు. వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. వారి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఈ ప్రమాదం జరిగిన భవనంలో బేస్‌మెంట్‌లో కాకుండా.. గ్రౌండ్ ఫ్లోర్‌లో వాహనాల పార్కింగ్ ఉందని వివరించారు. ఆ ప్రాంతం నుంచి పొగ పైకి వ్యాపించి.. ఆ భవనంలో నివసిస్తున్న వారిపై ప్రభావం చూపిందని పోలీస్ జాయింట్ కమిషనర్ తెలిపారు.



# రూ.2.19 లక్షల కోట్ల విలువైన 7 కీలక ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం

భారతదేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం ఇవాళ (బుధవారం) అత్యంత కీలకమైన నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మొత్తం రూ. 2,19,353 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దేశాన్ని సెమీకండక్టర్ల తయారీలో గ్లోబల్ హబ్‌గా మార్చడం, మొబైల్ ఉత్పాదనను పెంచడం, ఎరువుల రంగంలో స్వయంసమృద్ధి సాధించడంతో పాటు వారణాసిలో ప్రతిష్మాత్మక ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు ఈ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. క్యాబినెట్ భేటీ అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. భారతదేశాన్ని అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం 'సెమీకండక్టర్ మిషన్ 2.0 ను ప్రకటించింది. దీని కోసం ఏకంగా రూ. 1,27,500 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. ఈ నిర్ణయం ద్వారా దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ ప్లాంట్ల ఏర్పాటు, డిజైనింగ్, ప్యాకేజింగ్ పరిశ్రమలకు భారీగా ప్రోత్సాహం లభించనుంది. మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్‌కు రూ. 62,500 కోట్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో భారత్ సాధిస్తున్న దూకుడును మరింత పెంచేందుకు రూ. 62,500 కోట్ల కేటాయింపుతో 'మొబైల్ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్' (ఫీమీ) కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా స్థానిక మొబైల్ ఉత్పత్తి పెరగడమే కాకుండా, భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎరువుల రంగంలో భారతదేశాన్ని స్వయం సమృద్ధి దేశంగా మార్చేందుకు, విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు 'నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ పాలసీ ఫర్ యూరియా–2026' కు కేంద్రం ఆమోదముద్ర వేసింది. దీని ద్వారా దేశీయంగా యూరియా ఉత్పత్తిని పెంచి రైతులకు కొరత లేకుండా చేయనున్నారు. దీనికి ప్రత్యేకంగా ఆర్థిక కేటాయింపులు కాకుండా విధానపరమైన ఆమోదం తెలిపారు. వారణాసి (కాశీ) ఇన్‌ఫ్రా ప్రాజెక్టులవ రూ. 25,446 కోట్లతో పవిత్ర పుణ్యక్షేత్రం వారణాసి రూపురేఖలను మార్చేలా రెండు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చింది. రూ. 10,998 కోట్ల వ్యయంతో వరుణా నది వెంబడి 6/4 లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తారు. గంగా నది ఎలివేటెడ్ కారిడార్: రూ. 14,448 కోట్ల వ్యయంతో గంగా నది వెంబడి 6 లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్‌ను చేపట్టనున్నారు. రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు రూ. 3,907 కోట్లు కేటాయించారు. దేశంలో సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు రెండు కీలక రైల్వే లైన్ల ప్రాజెక్టులకు క్యాబినెట్ ఓకే చెప్పింది. రూ. 2,542 కోట్ల అంచనా వ్యయంతో ఈ రైల్వే లైన్ డబ్లింగ్ (రెండో లైన్) పనులను చేపడతారు. డాంగోవాపోసి, రాజ్‌ఖర్సవాన్ నాలుగో లైన్: రూ. 1,365 కోట్ల పెట్టుబడితో ఈ మార్గంలో నాల్గవ రైల్వే లైన్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు కేవలం పారిశ్రామిక రంగానికే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనకు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు (యూరియా పాలసీ ద్వారా) ఊతమిచ్చేలా ఉన్నాయి. ముఖ్యంగా సెమీకండక్టర్, మొబైల్ తయారీ రంగాలు గ్లోబల్ మార్కెట్‌లో భారతదేశ స్థానాన్ని మరింత పటిష్ఠం చేయనున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

# ఓడ రేవుల రక్షణకే ప్రాధాన్యం

## ఉక్రెయిన్ డిప్యూటీ ఆర్థిక మంత్రి తారస్ వెల్లడి



రష్యా దాడులు తీవ్రతరం చేసినప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులను కొనసాగించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ఉక్రెయిన్ డిప్యూటీ ఆర్థిక మంత్రి తారస్ వైసోత్స్కి స్పష్టం చేశారు. 'పరిస్థితి చాలా కష్టంగా ఉంది. అయినప్పటికీ, అంతర్జాతీయ ఆహార భద్రతకు ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు.. కనీసం గత ఏడాది స్థాయికి తగ్గకుండా ఎగుమతులను సురక్షితంగా కొనసాగించడానికి మేము చేయగలిగినదంతా చేస్తాం'. అని ఆయన స్పష్టం చేశారు. రష్యా దాడుల కంటే ముందుగా, జూలై నుంచి ప్రారంభమైన 2026/27 సీజన్‌లో ఉక్రెయిన్ దాదాపు 43 మిలియన్ మెట్రిక్ టన్నుల ధాన్యాలను ఎగుమతి చేయాలని అంచనా వేసింది. గత ఏడాది ఉక్రెయిన్ 37 మిలియన్ టన్నులకు పైగా ధాన్యాలను విజయవంతంగా ఎగుమతి చేసింది.

**మూడో వంతు ఎగుమతి సామర్థ్యం ధ్వంసం**

ఉక్రెయిన్ ప్రధాన రైతు సంఘం 'యూఏసీ' (ఖూజ) వెల్లడించిన వివరాల ప్రకారం, రష్యా ఉధృతం చేసిన క్షిపణి, డ్రోన్ దాడుల కారణంగా నల్లసముద్రం రేవుల ద్వారా ధాన్యాన్ని ఎగుమతి చేసే సామర్థ్యంలో ఉక్రెయిన్ ఇప్పటికే దాదాపు మూడో వంతు కోల్పోయింది.నాలుగు సంవత్సరాలుగా సాగుతున్న ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌కు విదేశీ కరెన్సీని తెచ్చిపెట్టే అతిపెద్ద వనరు వ్యవసాయ ఉత్పత్తులే (ధాన్యాలు, వెజిటబుల్ ఆయిల్స్). ఇందులో 90 శాతానికి పైగా ఎగుమతులు దక్షిణ ఒడెస్సా ప్రాంతంలోని మూడు ప్రధాన రేవుల ద్వారానే సాగుతాయి. రష్యా దాడుల భయంతో ఉక్రెయిన్‌లోని 13 పెద్ద ధాన్యపు ఎగుమతి టర్మినల్స్‌లో 4 టర్మినల్స్ ఇప్పటికే ధాన్యాల కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దాడుల తీవ్రత ఎక్కువగా ఉండటంతో, కొన్ని నౌకల యజమానులు తమ నౌకలను ఉక్రెయిన్ రేవుల్లోకి పంపేందుకు నిరాకరిస్తున్నారు .ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ దేశాలు పరస్పరం ఆర్థిక మూలాలను దెబ్బతీసే వ్యూహాన్ని అమలు చేస్తున్నాయి. ఒకవైపు ఉక్రెయిన్ సైన్యం రష్యాకు చెందిన చమురు ట్యాంకర్లు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తుండగా.. దానికి ప్రతిగా రష్యా నల్లసముద్రపు రేవులపై దాడులను గత కొన్ని వారాలుగా గణనీయంగా పెంచింది. బుధవారం కూడా ఒడెస్సా, మైకోలైవ్ ప్రాంతాల్లోని పోర్టు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై రష్యా మరోసారి దాడులకు తెగబడినట్లు స్థానిక అధికారులు ధ్రువీకరించారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. ఈసారి రష్యా సైన్యం ఉక్రెయిన్‌కు చెందిన కీలకమైన నల్లసముద్రం రేవులపై, ఆహార ధాన్యాల ఎగుమతి నౌకలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ తీవ్ర సవాళ్ల నడుమ, తమ సముద్ర రేవులను కాపాడుకోవడానికి, ప్రపంచ ఆహార భద్రతకు భరోసా ఇస్తూ ధాన్యాల ఎగుమతులను కొనసాగించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తామని ఉక్రెయిన్ ప్రకటించింది.



# హసీనాకు ఉరిశిక్ష ఖాయం

## ఆమె రాకను స్వాగతిస్తూనే బంగ్లా హెచ్చరిక

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఈ ఏడాది తన స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి దేశానికి తిరిగి వెళ్లి 'అవామీ లీగ్' పార్టీని మళ్లీ బలోపేతం చేయాలని హసీనా భావిస్తున్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లటంపై ఆ దేశ ప్రధాని తారిఖ్ రెహమాన్ అడ్వైజర్ జహీద్ ఉర్ రెహమాన్ స్పందించారు. షేక్ హసీనా నిర్ణయాన్ని ఆయన స్వాగతించారు. బంగ్లాదేశ్‌కు వస్తే ఉరి శిక్ష తప్పదని స్పష్టం చేశారు. ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ... 'హసీనా రాకను స్వాగతిస్తున్నాం. ఆమెను ఉరి తీయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఉరి శిక్షను ఆపడానికి హసీనా ప్రపంచంలోనే అత్యుత్తమ న్యాయవాదులను ఢాకాకు రప్పించుకోవచ్చు. బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్‌లో జరిగే విచారణ అత్యంత పారదర్శకంగా ఉంటుంది. దీన్ని అంతర్జాతీయ పరిశీలకులు కూడా పర్యవేక్షించవచ్చు. కోర్టులో సరైన వాదనలు జరిగితే గతంలో హసీనాకు పడిన ఉరిశిక్ష తీర్పును సవరించే అవకాశం ఉంది. ఆమె నిర్దోషిగా కూడా విడుదల కావచ్చు' అని ఆయన పేర్కొన్నారు.

# అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా ఐఆర్జీసీ భీకరదాడులు

**ప్రతీకారవాంఛతో రగులుతున్న అమెరికా**

అమెరికా, ఇరాన్ మధ్య యుద్ధం మళ్లీ తీవ్రరూపం దాల్చుతోంది. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌తాజాగా కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో పలు క్షిపణులను ఆయా దేశాల వైమానిక రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు అధికారులు తెలిపారు. అమెరికా విధించిన నౌకాదిగ్బంధనం, వైమానిక దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్యలు చేపట్టామని ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ జలసంధి మూసివేశామని, అవసరమైతే ఇతర కీలక సముద్ర మార్గాల్లోనూ ఇంధన రవాణాను అడ్డుకుంటామని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. ఐఆర్‌జీసీ దాడుల కారణంగా కువైట్, జోర్డాన్‌తో పాటు బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక స్థావరాలు కూడా అప్రమత్తమయ్యాయి (ఖూ ×తీఖఅ ఖుతీ). పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించారని, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారని స్థానిక మీడియా తెలిపింది.తాజా ఘర్షణల నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా ఆర్థిక ఆంక్షలను కొనసాగిస్తోంది. ఇరాన్ సెంట్రల్ బ్యాంక్‌కు చెందిన పలు క్రిప్టో వాలెట్లను అమెరికా ఫ్రీజ్ చేసింది. మరోవైపు ఇరాన్‌లోని పలు సైనిక స్థావరాలు, క్షిపణి ప్రయోగ కేంద్రాలపై గత ఏడు గంటలుగా దాడులు కొనసాగిస్తున్నట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. కాగా, అమెరికా దురాగతాలు పూర్తిగా ఆగిపోయేవరకు హోర్ముజ్ జలసంధి మూసే ఉంటుందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఈ ఘర్షణ ఇలాగే కొనసాగితే అమెరికా, దాని మిత్ర దేశాలకు చెందిన ఇంధన నౌకలు వెళ్లే మార్గాలను లక్ష్యంగా చేసుకుంటామని

## అమెరికాలో భారతీయుడి దారుణహత్య

అమెరికాలో సోమవారం షాకింగ్ ఘటన వెలుగు చూసింది. యూటా రాష్ట్రంలో సోహైల్ అనే భారతీయుడిని ఓ వ్యక్తి 15 సార్లు కత్తితో దారుణంగా పొడిచాడు. నిందితుడిని 48 ఏళ్ల పీటర్ మైఖేల్ లార్సన్‌గా పోలీసులు గుర్తించారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, వెస్ట్ వ్యాలీ నగరంలోని ఒక షాపింగ్ మాల్‌లో సోహైల్ పని చేస్తున్నాడు. సోమవారం షాపింగ్ మాల్‌కు వచ్చిన లార్సన్ అతడితో మాట్లాడటం ప్రారంభించాడు. అతడి మతం ఏమిటని అడిగాడు. తాను ముస్లిం అని సోహైల్ చెప్పాక నిందితుడు తనకో మినరల్ వాటర్ బాటిల్ కావాలని అడిగాడు. ఈ క్రమంలో సోహైల్ వెనక్కు తిరగగానే లార్సన్ తన వద్ద ఉన్న కత్తితో అతడిని ఏకంగా 15 సార్లు పొడిచాడు. ఈలోపు అక్కడున్న వారు వెంటనే స్పందించి లార్సన్‌ను నేలపై పడదోసి అదుపు చేశారు. అనంతరం అక్కడకు వచ్చిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. హత్యాయత్నం కింద నిందితుడిపై కేసు నమోదు చేసి సాల్ట్ లేక్ కౌంటీ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సోహైల్ పరిస్థితి విషమంగా ఉంది. అతడి చికిత్సకు అయ్యే ఖర్చు కోసం గోఫండ్‌మీ పేజీని కూడా ఏర్పాటు చేశారు. సోహైల్ చాలా స్నేహశీలి అని అతడి స్నేహితులు, సహోద్యోగులు చెప్పారు. కష్టపడి పనిచేసే సోహైల్‌కు తాను ఇటీవలే ప్రమోషన్ కూడా ఇచ్చానని షాపింగ్ మాల్ మేనేజర్

# బలూచ్‌పై చైనా డేగకన్ను!



పాకిస్థాన్ నైరుతి ప్రాంతంలోని కల్లోలిత రాష్ట్రం బలూచిస్థాన్ మరోసారి అంతర్జాతీయంగా వార్తల్లో నిలిచింది. 'రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్' పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అయిన లేఖ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించింది. బలూచ్ వేర్పాటువాదులు పాకిస్థాన్ నుంచి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారని, ఆ భూభాగంలోని ఎక్కువ ప్రాంతం ఇప్పుడు వారి ఆధీనంలోనే ఉందనేది ఆ లేఖ సారాంశం. ఈ ప్రకటనకు సంబంధించి ఎలాంటి అధికారిక లేదా స్వతంత్ర ధ్రువీకరణ లేనప్పటికీ, ఈ పరిణామం ఇస్లామాబాద్‌తో పాటు డ్రాగన్ కంట్రీ చైనాలోనూ తీవ్ర కలకలం రేపుతోంది. బలూచిస్థాన్‌లో చైనా వేల కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టడమే దీనికి ప్రధాన కారణం. పాకిస్థాన్‌లో భూభాగం పరంగా బలూచిస్థాన్ అతిపెద్ద రాష్ట్రం. ఇది దేశ మొత్తం భూభాగంలో దాదాపు 44 శాతం కలిగి ఉంది. ఇంత పెద్ద విస్తీర్ణం ఉన్నప్పటికీ, ఇది పాకిస్థాన్‌లో అత్యల్ప జనాభా, అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మిగిలిపోయింది. ఈ ప్రాంతం రాగి (జశీజూజూవతీ), బంగారం, సహజ వాయువు, బొగ్గు, అరుదైన ఖనిజాలతో సహా అపారమైన సహజ వనరులకు నిలయం. అరేబియా సముద్ర తీరాన ఉన్న బలూచిస్థాన్... దక్షిణాసియా, మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలను అనుసంధానించే కీలక ద్వారంగా ఉంది. దశాబ్దాలుగా పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వం తమ ప్రాంత వనరులను దోచుకుంటూ, స్థానిక ప్రజల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని బలూచ్ జాతీయవాద గ్రూపులు ఆరోపిస్తున్నాయి. ఈ అసంతృప్తే అక్కడ సుదీర్ఘకాలంగా వేర్పాటువాద ఉద్యమం నడవడానికి కారణమైంది. చైనా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బిలియన్ డాలర్ల 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'లో భాగమైన చైనా, పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ప్రాజెక్టులన్నీ బలూచిస్థాన్‌తోనే ముడిపడి ఉన్నాయి. దాదాపు 65 బిలియన్ డాలర్ల (రూ. 5.4 లక్షల కోట్లకు పైగా) విలువైన ఈ ప్రాజెక్ట్ ద్వారా పశ్చిమ చైనాను అరేబియా సముద్రంతో అనుసంధానించాలని బీజింగ్ వ్యూహం పన్నింది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే 'మలక్కా జలసంధి'పై ఆధారపడటాన్ని తగ్గించుకుని, అంతర్జాతీయ షిప్పింగ్ లేన్లకు నేరుగా యాక్సెస్ పొందడం కోసం చైనాకు బలూచిస్థాన్ అత్యంత కీలకంగా మారింది.

# కెప్టెన్సీకి నేను సిద్ధమే

## లార్డ్స్ విజయం మరుపురానిది: స్మృతి మంధాన

లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో భారత జట్టు చరిత్రాత్మక విజయంలో భాగమైన స్మృతి మంధాన రాబోయే రోజుల్లో కొత్త బాధ్యతలు స్వీకరించే అవకాశముంది. ప్రస్తుతం వైస్ కెప్టెన్‌గా కొనసాగుతున్న ఆమె టీమిండియా కెప్టెన్‌గా సిద్ధంగా ఉన్నానని చెప్తోంది. లార్డ్స్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాలతో మెరిసిన ఈ ఓపెనర్ 'టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో మీరు సారథ్యం వహించేందుకు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'నేను రెఢీ' అని బదులిచ్చింది. భారత మహిళల జట్టు విజయాల్లో కీలకమవుతున్న స్మృతి మంధాన లార్డ్స్ టెస్టుతో మరోసారి తానెంత విలువైన క్రికెటరో చాటింది. ఇంగ్లండ్ బౌలర్లను ఉతికేస్తూ రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాల (83, 70)తో రెచ్చిపోయిన మంధాన.. వైస్ కెప్టెన్‌గా తన బాధ్యతను సమర్థంగా పోషించింది. ఇదే ఉత్సాహంతో అవకాశం రావాలేగానే కెప్టెన్‌గా రాణిస్తానని అంటోందీ ఓపెనర్.

లార్డ్స్ టెస్టు విజయంపై మాట్లాడిన మంధాన.. 'హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు మీరు సిద్ధంగా ఉన్నారా?' అనే ప్రశ్నకు 'అవును.. నేను రెఢీ' అని చెప్పింది. 'ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల ఏకైక టెస్టు ఆడడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యంగా మ్యాచ్ గెలుపొందడం ఇంకా ఆనందంగా ఉంది. చరిత్రాత్మక మ్యాచ్‌లో భారత జట్టు విజయంలో భాగమవ్వడం నాకు చాలా ప్రత్యేకం. మేము చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు టెస్టు క్రికెట్ ఆడాలని కలలు కన్నాం. లార్డ్స్‌లో టెస్టు మ్యాచ్ ఆడడం మరపురానిది' అని మంధాన తెలిపింది. పదేళ్లకు పైగా టీమిండియాలో కీలక ప్లేయర్‌గా కొనసాగుతున్న మంధాన.. త్వరలోనే కెప్టెన్‌గా ప్రమోట్ అయ్యే అవకాశాలున్నాయి. ఎందుకుంటే ప్రస్తుత సారథి హర్మన్‌ప్రీత్ వయసు 37 ఏళ్లు దాటింది. మంధానకు 29 ఏళ్లు మాత్రమే.

నిరుడు స్వదేశంలో వన్డే ప్రపంచకప్ ట్రోఫీని అందించిన హర్మన్‌ప్రీత్ చిరకాల నిరీక్షణకు తెరదించింది. లార్డ్స్ టెస్టులో చిరస్మరణీయ విజయంతో ఆమె కీర్తి మరింత



పెరిగింది. అయితే వచ్చే టీ20 ప్రపంచ కప్, వన్డే ప్రపంచ కప్ నాటికి హర్మన్‌ప్రీత్ మూడు ఫార్మాట్లలో కొనసాగకపోవచ్చు. అదే జరిగితే వైస్ కెప్టెన్సీ అనుభవమున్న మంధానకు బాధ్యతలు అప్పగించడం లాంఛనమే. ఇప్పటిదాకా 18 టీ20లు, నాలుగు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన మంధాన 15 విజయాలు సాధించింది.



# ఆసియా నెం.1 ధీరజ్

## ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో విజయవాడ కుర్రాడు సంచలనం

హైదరాబాద్: భారత యువ ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర సరికొత్త సంచలనం సృష్టించాడు. తాజాగా విడుదలైన ఆసియా ఆర్చరీ ర్యాంకింగ్స్‌లో ఆయన ఆసియా నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించాడు. విజయవాడకు చెందిన ఈ యువ ఆర్చర్, పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఏకంగా 225.5 పాయింట్లతో ఆసియా ఖండంలోనే అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు.

**ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ దూకుడు:**

ఆసియాలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ ధీరజ్ తన సత్తా చాటాడు. తాజా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 3 స్థానాలను మెరుగుపరుచుకుని 8వ ర్యాంకుకు చేరుకున్నాడు. ఈ క్రమంలో ప్రపంచ టాప్-10 ఆర్చర్ల జాబితాలో భారత్ నుంచి స్థానం దక్కించుకున్న ఏకైక ఆర్చర్‌గా ధీరజ్ నిలిచాడు. ఇటీవల జరిగిన వరల్డ్‌కప్ స్టేజ్-3 టోర్నీలో వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ విభాగంలోనూ స్వర్ణ పతకాలు గెలుచుకుని ధీరజ్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఆ తర్వాత జరిగిన స్టేజ్-4 టోర్నీలో మిక్స్‌డ్ విభాగంలో కాంస్య పతక పోరుకు అర్హత సాధించినప్పటికీ పతకాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. ప్రపంచ వేదికపై భారత కీర్తి పతాకాన్ని ఎగురవేస్తూ ఆసియాలోనే నెం.1 స్థానాన్ని దక్కించుకున్న ధీరజ్ బొమ్మదేవరపై దేశవ్యాప్తంగా క్రీడాభిమానుల నుంచి ప్రశంసల జల్లు కురుస్తోంది.

**నాలుగో స్థానంలో జ్యోతి సురేఖ.**

మరోవైపు మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో భారత స్టార్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ ఒక ర్యాంకు కోల్పోయింది. ఆమె 291.25 పాయింట్లతో ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి పరిమితమైంది. మహిళల రికర్వ్ విభాగంలో తానిపర్తి చికిత (81 పాయింట్లు) రెండు స్థానాలు దిగజారి 52వ ర్యాంకుతో సరిపెట్టుకుంది.

# 19న వరల్డ్ కప్ ముగింపు వేడుక

## - ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం



ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో నిర్వాహకులు ముగింపు వేడుకలపై దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ ఈ నెల 19న పూర్తి కానున్నందున అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూజెర్సీ స్టేడియంలో జరిగే 'క్లోజింగ్ సెరెమొనీ'లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ 'ఐషోస్పీడీ' సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు.

సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్ కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూజెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది.

ఆస్కార్ అవార్డు విజేత, గాయని జెన్నిఫర్ హడ్సన్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించనుంది. ఆస్కార్ విజేత, అమెరికా నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాడు. రాబీ విలియమ్స్ (ఇంగ్లిష్ గాయకుడు, గేయ రచయిత), లారా పాసిని (ఇటలీ పాప్ సింగర్), నికొలె షెర్జింజర్ (అమెరికా గాయని) తమ గాత్రంతో ఫ్యాన్స్‌ను సంగీత సాగరంలో ఓలలాడించనున్నారు. ఇంటర్నెట్ సంచలనం యూట్యూబర్ ఐషోస్పీడ్ తన మార్క్ హావభావాలతో సందడి చేయనున్నాడు.

'ముగింపు వేడుకల్లో సంగీతం, సంస్కృతి, ఫుట్‌బాల్ థీమ్‌తో టోర్నమెంట్ మొత్తాన్ని ప్రతిబింబిస్తామ'ని వరల్డ్ కప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హీమో షిర్గి వెల్లడించాడు. ఈ ముగింపు వేడుకల్లో మెరిసే తారలు, ప్రముఖుల జాబితాలో మరికొందరు పేర్లు చేరే అవకాశముందని సమాచారం.




# వరల్డ్ కప్‌లో కీలక మార్పులు

## సూపర్ సిరీస్, సూపర్ 7 రౌండ్లకు శ్రీకారం

వచ్చే ఏడాది జరిగే పురుషుల వన్డే వరల్డ్ కప్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మరింత ఆసక్తికరంగా మార్చేసింది. 14 జట్లతో సూపర్ సిక్స్ దశ, సెమీ ఫైనల్, ఫైనల్... ఇలా కొనసాగాల్సిన మెగా ఈవెంట్‌లో కీలక మార్పులు చేసింది ఐసీసీ. తక్కువ ర్యాంకున్న జట్లను దృష్టిలో పెట్టుకుని సూపర్ సిరీస్‌కు రూపమిచ్చింది అత్యున్నత క్రికెట్ బోర్డు. అంతేకాదు సూపర్ 6కు బదులు సూపర్-7 రౌండ్ తెరపైకి వచ్చింది. దాంతో పెద్ద జట్లతో పోటీపడలేని పసికూనలకు కూడా ముందంజ వేసే అవకాశం లభించనుంది.

పరుషుల వన్డే వరల్డ్‌కప్ 2027 ఫార్మాట్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది ఐసీసీ. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో 14 జట్లు పోటీపడనుండగా.. చిన్న జట్లకు అనుకూలంగా సరికొత్తగా 'సూపర్ సిరీస్', 'సూపర్ 7' రౌండ్లను ప్రవేశపెట్టింది ఐసీసీ. అంటే.. పద్నాలుగు జట్లలో చివరి మూడు ర్యాంకులోని టీమ్‌లు సూపర్ సిరీస్ రౌండ్‌లో తలపడతాయి. ఈ రౌండ్ ఫలితాల ఆధారంగా ఒక జట్టు గ్రూప్ దశను దాటుతుంది. మిగతా రెండు టీమ్‌లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.

**సూపర్ 7 విషయానికొస్తే...**

వరల్డ్ కప్ గ్రూప్ దశ తర్వాతి రౌండ్ (రెండోది)కు 12 జట్లు అర్హత సాధిస్తాయి. రెండో దశగా పేర్కొనే ఇందులో ఒక్కో గ్రూప్‌లో ఆరు జట్లు.. మొత్తం 30 మ్యాచులు ఉంటాయి. అయితే.. కొత్తగా ఐసీసీ ప్రవేశపెట్టిన సూపర్ 7 ప్రకారం ఏడు జట్లు నాకౌట్‌కు చేరుతాయి.

రౌండ్ రాబిన్ పద్ధతి అనంతరం రెండు గ్రూపుల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు.. రెండు గ్రూపుల్లో అత్యధిక పాయింట్లున్న జట్టు ఏడో జట్టుగా సూపర్-7కు దూసుకెళ్తుంది. ఆపై.. ఈ ఏడింటిలో టాప్-4 జట్లు సెమీఫైనల్‌కు వెళ్తాయి. సెమీస్ దాటిన జట్లు టైటిల్ పోరులో అమీతుమీకి సిద్ధమవుతాయి. వచ్చే ఏడాది వన్డే వరల్డ్ కప్ అక్టోబరు 4 నుంచి నవంబరు 21వ తేదీ వరకు జరుగుతుంది.

**ఐపీఎల్ తరహాలో**

టీ20 వరల్డ్ కప్ సైతం ఐపీఎల్ తరహాలో అలరించనుంది. ఐదు గ్రూప్‌లు, సూపర్ 10, ఎలిమినేటర్ మ్యాచ్‌లతో ఆద్యంతం ఆసక్తిగా ఉండనుంది. గత ఎడిషన్‌లో నాలుగు గ్రూప్‌లు ఉండగా.. వచ్చే ఎడిషన్ నుంచి 20 జట్లు, ఐదు గ్రూప్‌లుగా టోర్నీ జరుగనుంది.


ప్రతి గ్రూప్ నుంచి టాప్-2లోని రెండు జట్లు ముందంజ వేస్తాయి. సూపర్-8 బదులు సూపర్ 10ను తీసుకొస్తున్న ఐసీసీ.. ఐదు చొప్పున రెండు గ్రూపులుగా విభజించనుంది. ప్రతి గ్రూప్ నుంచి టాప్‌లోని రెండు.. నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. ఐపీఎల్ తరహాలో రెండు ఎలిమినేటర్లు ఉంటాయి.

చైతన్య రథం
సినిమా
గురువారం 16 జూలై 2026 X

# బేబీ బంప్‌తో సమంత

## 'నేనెప్పుడూ కోరుకున్న క్షణమిది' అంటూ ఎమోషనల్!





టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత రూత్ ప్రభు త్వరలోనే తల్లి కాబోతున్న సంగతి తెలిసిందే. ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత తన మొదటి సంతానానికి జన్మనివ్వబోతున్నట్లు సమంత అధికారికంగా ప్రకటించారు. ఇటీవల ఆమె కథానాయికగా నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని సాధించింది. విజయోత్సవ వేడుకల్లో సమంత బేబీ బంప్‌తో మెరిసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తాజాగా తన ప్రెగ్నెన్సీ వార్తలపై స్పందిస్తూ... మాతృత్వాన్ని అనుభవిస్తున్న ఈ క్షణాల గురించి సమంత ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడారు.

'ఈ సరికొత్త ప్రయాణం నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంది. నిజానికి నేను ఈ అద్భుతమైన క్షణం కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నాను. జీవితంలో మాతృత్వాన్ని అందుకోవాలనేది నా చిరకాల కల. అందుకే ఈ కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడానికి నా వంద శాతం శ్రమిస్తాను' అని ఒక ఇంటర్వ్యూలో సమంత పేర్కొన్నారు. ప్రతి పనినీ ఎంతో ఇష్టపడి చేసే తనకు ఇప్పుడు తనలో సరికొత్త శక్తి, ఆలోచనలు మొదలయ్యాయని.. భవిష్యత్తులో రాబోయే మధురమైన రోజులను ఆహ్వానించేందుకు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నానని చెప్పారు.

# జక్కనతో 14 నెలల ప్రయాణం

## స్లో మోషన్ జంప్స్.. 'వారణాసి' సీక్రెట్స్ లీక్ చేసిన ప్రియాంక






దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్‌బాబు కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపు దిద్దుకుంటున్న భారీ విజువల్ వండర్ 'వారణాసి'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో చిత్రకథానాయిక ప్రియాంక చోప్రా చేసిన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ ప్రాజెక్ట్ కోసం గత 14 నెలలుగా పనిచేస్తున్నట్లు తెలిపిన ఆమె... రాజమౌళి ప్రతి సన్నివేశాన్నీ ఎంతో క్లారిటీతో పకడ్బందీగా తెరకెక్కిస్తారని కొనియాడారు. ఈ సినిమా కోసం తాను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ కూడా చేసినట్లు పేర్కొంటూ, అంతకు మించి వివరాలను మాత్రం ప్రస్తుతానికి వెల్లడించలేనని తెలిపారు. అయితే ప్రియాంక చేసిన ఈ స్లో మోషన్ జంప్స్ ఏ యాక్షన్ సీక్వెన్స్‌లో భాగమా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ ఇప్పటికే పూర్తయినట్టు దర్శకుడు రాజమౌళి ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీతో పాటు అన్నపూర్ణ స్టూడియోస్‌లో వేసిన భారీ సెట్లలో ఆఖరి నిమిషం షూటింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జక్కన బృందం వీలైనంత త్వరగా చిత్రీకరణను ముగించి, అంతర్జాతీయ స్థాయిలో సినిమాను ప్రమోట్ చేయడానికి పక్కా యాక్షన్ ప్లాన్‌తో సిద్ధమవుతోంది. కాగా ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు.

# ఘట్టమనేని వారసుడి ఎంట్రీ

## 'శ్రీనివాస మంగాపురం'తో వెండితెరకు జయకృష్ణ

### ఈ నెల 30న విడుదల

విశాఖపట్నం: దివంగత టాలీవుడ్ సూపర్‌స్టార్ కృష్ణ మనవడు, రమేష్‌బాబు కొడుకు జయకృష్ణ హీరోగా వెండితెరకు పరిచయమవుతున్నారు. ఆయన నటించిన తొలి చిత్రం 'శ్రీనివాస మంగాపురం' త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. వైవిధ్యభరిత చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ వినూత్న ప్రేమకథా చిత్రం ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

సినిమా విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇందులో భాగంగా ఈ చిత్ర నాయకా, నాయికలు జయకృష్ణ, రాషా థడాని విశాఖపట్నంలో పర్యటించి సందడి చేశారు. స్థానిక అభిమానులను, ప్రేక్షకులను కలుసుకుని చిత్ర విశేషాలను పంచుకున్నారు. ప్రముఖ బాలీవుడ్ నటి రవీనాటాండన్ కుమార్తె అయిన రాషా థడాని కూడా ఈ చిత్రం ద్వారానే తెలుగు తెరకు పరిచయం కావడం విశేషం.

### నా పాత్ర అందరికీ నవ్వులు పంచుతుంది: జయకృష్ణ




ఈ సందర్భంగా హీరో జయకృష్ణ మాట్లాడుతూ తన సినీ ప్రయాణం, అనుభవాలను పంచుకున్నారు. "నేను కేవలం మూడేళ్ల వయసులోనే 'నిజం' సినిమాలో నటించాను. 17ఏళ్లు వచ్చినప్పటి నుంచి పూర్తిస్థాయిలో సినిమాలపైనే దృష్టి పెట్టాను. వెండితెరపై రాణించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా యాక్టింగ్, డ్యాన్సులు, ఫైట్లు నేర్చుకున్నాను. 'శ్రీనివాస మంగాపురం' సినిమాలో నా పాత్ర ఒక అల్లరి కుర్రాడిగా ఉంటుంది. ప్రేక్షకులందరికీ నచ్చేలా, థియేటర్లలో నవ్వులు పూయించేలా నా క్యారెక్టర్ డిజైన్ చేయబడింది" అని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు.

దర్శకుడు అజయ్ భూపతి తన మార్కు ఇంటెన్స్ ఎమోషన్స్‌తో పాటు, చక్కని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను మలిచినట్లు తెలుస్తోంది. ఘట్టమనేని కుటుంబం నుంచి వస్తున్న ఈ సరికొత్త వారసుడి ఎంట్రీపై అటు అభిమానుల్లోనూ, ఇటు ఇండస్ట్రీ వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.

# ఆస్తి వేలం వివాదం

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన నిర్మాత బండ్ల గణేష్



ప్రముఖ సినీ నిర్మాత,నటుడు బండ్ల గణేష్ తన ఆస్తి వేలం వివాదంలో దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. లోన్ వ్యవహారంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న చర్యలను సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద తాము ఇప్పటికే రూ.71.44 కోట్లతో కలిపి మొత్తం సుమారు రూ.129.02 కోట్ల బకాయిలను బ్యాంకుకు చెల్లించామని బండ్ల గణేష్ పిటిషన్‌లో పేర్కొన్నారు. తాము లోన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించిన తర్వాతకూడా యూనియన్ బ్యాంక్ తమ ఆస్తిని వేలం వేయడం చట్టవిరుద్ధమని ఆయన కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు.

# కిరణ్ అబ్బవరం #KA13

## పుట్టినరోజు సందర్భంగా 'బిహైండ్-ది-సీన్స్' వీడియో రిలీజ్

'క', 'కె-ర్యాంప్' వరుస విజయాలతో అదరగొడుతున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం... ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్ అయిన #KA13తో బిజీగా ఉన్నారు. SR కళ్యాణమండపంతో కథా రచయితగా ప్రతిభ నిరూపించుకున్న ఆయన... ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, హీరోగా అన్ని బాధ్యతలను స్వయంగా స్వీకరించారు. ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి 'జాయ్ ఫిల్మ్స్' బ్యానర్‌పై నిర్మాతగా పరిచయమవుతూ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా సురేష్ ఎర్ర సహ-నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కుతోంది. దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ Ek Dum Bindass Pakaane Waale అనే ఆసక్తికరమైన ట్యాగ్‌లైన్‌తో ఇప్పటికే అందరి దృష్టినీ ఆకర్షించింది.



బుధవారం కిరణ్ అబ్బవరం పుట్టినరోజును పురస్కరించుకుని, విజయవంతంగా పూర్తయిన ఈ సినిమా మొదటి షెడ్యూల్‌కు సంబంధించిన 'మేకింగ్ వీడియో'ను చిత్ర బృందం విడుదల చేసింది. ఉత్సాహభరితమైన సన్నివేశాలతో కూడిన ఈ వీడియోలో, సెట్‌లో నటీనటులు, సాంకేతిక బృందం మధ్య ఉన్న స్నేహపూర్వక వాతావరణం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# అనకాపల్లి నుంచి 'ఎలగే పిల్ల'..

టాలీవుడ్‌లో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'అనకాపల్లి'. ఈ సినిమాను ఆగస్టు 7న భారీ స్థాయిలో థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఖగేష్ తమ్మినేని డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమాను భవ్యశ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్లపై కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.

ఇక ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంట్రెస్టింగ్ రొమాంటిక్ సాంగ్‌ను వదిలారు. 'ఎలగే పిల్ల' అనే లవ్ ట్రాక్‌ను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాత సూర్యదేవర నాగవంశీ లాంచ్ చేశారు. సాంగ్ విజువల్స్, ట్యూన్ బాగున్నాయని చెబుతూ చిత్ర యూనిట్‌కు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. స్టెప్పులు, లిరికల్ వీడియోలోని లొకేషన్స్ ఆకట్టుకునేలా ఉన్నాయని పాజిటివ్‌గా రియాక్ట్ అయ్యారు.

ఇక సాంగ్ వినేటప్పుడు ఒక క్లాసిక్ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ చూస్తున్న ఫీలింగ్ కలుగుతుందనే కామెంట్స్ వస్తున్నాయి.

